www.prajasakti.com

PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 39 Vol సంచిక : 25 No | విజయవాడ, శనివారం 26 జనవరి 2019 | 12 + 12 పేజీలు వెల : 4.00 Rs

కొత్త ధర్మాసనానికి అయోధ్య కేసు

ఈ నెల 29 నుంచి విచారణ

8

గెలిపిస్తే ఫోనిస్తా

ద్వాక్రాలకు రూ.10 వేలు చొప్పున సాయం

మనది అన్నా చెల్లెళ్ల అనుబంధం

వెలుగు ఉద్యోగులకు మరో 10 శాతం వేతనం పెంపు

అమరావతి, కడప, విశాఖ సదస్సుల్లో చంద్రబాబు



ముఖ్యమంత్రికి బుద్ధుని ప్రతిమను బహూకరిస్తున్న డ్వాక్రా మహిళలు

2



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పవన్, పక్కన రాఘవులు, సురవరం తదితరులు

కలిసే వెళ్తాం

ఫిబ్రవరిలో సీట్ల పంపిణీపై చర్చ

పర్యావరణం, మైనింగ్ సహా పలు అంశాలపై ఉమ్మడి అవగాహన

పవన్‌కల్యాణ్, సురవరం, రాఘవులు వెల్లడి

విశాఖలో జనసేన, వామపక్షాల రౌండ్ టేబుల్ భేటీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో 2019 ఎన్నికల్లో నూతన రాజకీయ సమీకరణలకు, ప్రజా సమస్యలపై పోరాటాల కొనసాగింపు, ఎన్నికల్లో పోటీకి సంబంధించి జనసేన, సిపిఎం, సిపిఐ పార్టీల మధ్య విశాఖలో శుక్రవారం చర్చలు సాగాయి. రాష్ట్రంలో ప్రజలెదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన పర్యావరణం, అక్రమ మైనింగ్, భూ సేకరణ విధానంలో ఇబ్బందులు, పౌర, మానవ హక్కులు, సామాజిక న్యాయం వంటి ఐదు అంశాలపై రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఉమ్మడిగా పోరాడేందుకు జనసేన, వామపక్షాలు నిర్ణయించాయి. విశాఖ నగర శివార్లలో ఉన్న రుషికొండ సాయిప్రియా రిసార్ట్స్‌లో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, నేతలు వి.శ్రీనివాసరావు, సిహెచ్.నరసింగరావు, వై.వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, నేతలు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జెవి.సత్యనారాయణ మూర్తి, జల్లి విల్సన్, జనసేన రాష్ట్ర నేతలు నాదెండ్ల మనోహర్, మాదాసు గంగాధర్ ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో నేతలు మాటాడారు.

ఇవిఎంలపై అనుమానాలు తొలగించాలి : పవన్

ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా రాష్ట్రంలో తాము కలిసే పనిచేస్తున్నామని, ఎన్నికల్లో కూడా కలిసే వెళతామని స్పష్టం చేశారు. సీట్ల పంపకానికి సంబంధించిన చర్చలు ఈ సమావేశంలో రాలేదన్నారు. ఎపిలో నూతన రాజకీయ సమీకరణలకు, రాజకీయాలంటే ప్రజల్లో సరికొత్త దృక్పథాన్ని కలిగించడానికి ఈ భేటీ ఎంతగానో దోహదం చేస్తుందని చెప్పారు. జనసేన, వామపక్షాల భావజాలం ఒకటే అయినందున మిగతా9లో

జనసేన, సిపిఎం, సిపిఐ విశాఖ రౌండ్‌టేబుల్ సమావేశ తీర్మానం

3

ప్రణబ్‌కు భారత రత్న

మరో ఇద్దరికి కూడా

న్యూఢిల్లీ : దేశ అత్యున్నత పౌర పురస్కారం "భారత రత్న" మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆయనతో పాటు నానాజీ దేశ్‌ముఖ్, భూపెన్ హజారికాలకు కూడా మరణానంతరం భారత రత్న పురస్కారాలు దక్కాయి.

ప్రణబ్ ముఖర్జీ



ప్రణబ్ ముఖర్జీ రాజకీయ రంగంలో అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్రపతి స్థాయికి చేరుకున్నారు. రాష్ట్రపతిగా ఆయన ఎన్నో విశిష్ట సేవలు అందించారు. అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వాలలో కొనసాగిన ఆయన కేంద్రంలో రక్షణ శాఖ, ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారు.

భూపెన్ హజారికా



అసోంకు చెందిన భూపెన్ హజారికా సంగీత దర్శ కుడిగా, గాయకుడిగా, కవిగా గుర్తింపు పొందారు. భూపెన్ హజారిక పద్మ భూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వంటి ఎన్నో పురస్కారాలను అందుకున్నారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, పద్మశ్రీకూడా ఆయన సొంతమ య్యాయి. హజారికా నవంబరు5 2011లో కన్ను మూశారు.

నానాజీ దేశ్ ముఖ్



నానాజీ దేశ్ ముఖ్ రాజకీయ రంగంలో రాణించారు. భూదాన్ ఉద్యమంలో భాగ స్వామిగా ఉన్నారు. 1999లో రాజ్యసభకు నామినేట్ అయ్యారు. అదే సంవత్సరం పద్మభూషణ్ అవార్డును అందుకున్నారు. 2010లో కన్ను మూశారు.

విరిసిన పద్మాలు

నలుగురు తెలుగువారికి ప్రతిష్టాత్మక పురస్కారం

వివరాలు 12లో



సిరివెన్నెల సీతారామశాస్త్రి



యడ్లపల్లి వెంకటేశ్వరరావు




సునీల్ చెత్రి



హారిక ద్రోణవల్లి

నవ భారత నిర్మాణంలో చేతులు కలపండి



- రిపబ్లిక్‌డే సందేశంలో రాష్ట్రపతి ఉద్బోధ
- వైవిధ్యం, ప్రజాస్వామ్యం, అభివృద్ధే పునాదులు
- బహుళత్వమే మన బలం

8

మదురోకు పెరుగుతున్న మద్దతు

రష్యా, చైనా, టర్కీ, మెక్సికో, ఇతర దేశాల సంఘీభావం

అండగా నిలిచిన వెనిజులా రక్షణ శాఖ, సైన్యం

అమెరికా జోక్యంపై విమర్శలు



కారకాస్: అమెరికా కుట్రలకు ఎదురొడ్డి నిలిచిన వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోకు అంతర్జాతీయంగా మెక్సికో, రష్యా, టర్కీ, చైనా, ఇతర ప్రపంచ దేశాల నేతలు, ఐరాస మాజీ నిపుణులు, గబ్బార్డ్, ఇల్హాన్ ఒమర్ వంటి అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు పూర్తి సంఘీభావం వ్యక్తం చేశారు. వెనిజులా రక్షణ శాఖ మంత్రి జనరల్ వ్లాదిమిర్ ప్రదీనో, సైన్యం పూర్తి మద్దతు ప్రకటించాయి.. వెనిజులాలో చట్టబద్ధమైన మదురో ప్రభుత్వానికే తమ మద్దతు అని ప్రకటించారు. దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించేందుకు మదురో ప్రభుత్వం చేస్తున్న కృషికి తమ పూర్తి మద్దతు వుంటుందని తెలిపారు. రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ వెనిజులా అధ్యక్షుడు మదురోతో శుక్రవారం ఫోన్‌లో మాట్లాడుతూ చట్టబద్ధమైన మదురో ప్రభుత్వాన్ని కాదని, గైడోను అధ్యక్షుడిగా గుర్తించిన అమెరికా చర్య అంతర్జాతీయ న్యాయ నియమాలను ఉల్లంఘించడమేనన్నారు. వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో బయటి జోక్యం తగదన్నారు. రాజ్యాంగ పరిధికి లోబడి విభేదాలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఐరాస మాజీ నిపుణుడు మిగతా 9లో



మరో గని ఘోరం!

జార్ఖండ్‌లో కూలిన బొగ్గు గని • నలుగురు మృతి • చిక్కుకున్న 14 మంది

న్యూఢిల్లీ : జార్ఖండ్ ధన్‌బాద్ జిల్లాలో చట్ట విరుద్ధంగా నిర్వహిస్తున్న ఒక బొగ్గు గని కూలిపోయింది. ఈ దుర్ఘటనలో నలుగురు మృతి చెందారు. 14 మంది గనిలో చిక్కుకుపోయారు. ఈస్ట్రన్ కోల్ ఫీల్డ్ లిమిటెడ్ (ఇసిఎల్) ప్రాంతంలోని ముగ్మా ప్రాంతంలో కప్సారా ఓపెన్ కాస్ట్ గనులలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన ఈ బొగ్గు గనిని ఇసిఎల్ అవుట్‌సోర్సింగ్ కింద కాంతా ట్రాన్స్‌పోర్టు అనే ప్రైవేటు కంపెనీకి అప్పగించింది ఇసిఎల్ ఈ ప్రాంతంలో అవుట్ సోర్సింగ్ కింద ఇచ్చిన గనులు స్థానిక బొగ్గు మాఫియాకు సురక్షిత ప్రదేశాలుగా మారాయి. గనుల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు కాంట్రాక్టర్లు చూస్తుండటమే కాకుండా, స్థానిక పేద ప్రజలను ఉపయోగించుకుని మాఫియా బొగ్గును తవ్వి తీస్తోంది. ఇదంతా స్థానిక పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానిక మీడియా పేర్కొంది.

సహాయ కార్యక్రమాలు ప్రారంభమైన వెంటనే బొగ్గు మాఫియా రంగంలోకి దిగి ఈ ప్రమాదంలో తమ ప్రమేయాన్ని కప్పిపుచ్చుకునేందుకు వీలుగా మృత దేహాలను తొలగించారు. కాని పోలీసులు అప్పటికే అక్కడికి చేరుకోవడంతో వారి ప్రయత్నాలకు ఆటంకం కలిగింది. ఆ నాలుగు మృత దేహాలలో ఒక మహిళా మృత దేహం కూడా ఉంది. వీరిలో ముగ్గురిని గుర్తించారు. ఈ ముగ్గురు కూడా స్థానికులే కావడం విశేషం.

ఇబిసి రిజర్వేషన్లపై కేంద్రానికి నోటీసులు

మూడు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ : ఇబిసిలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. యూత్ ఫర్ ఈక్వాల్టి అనే స్వచ్ఛంద సంస్థ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ధర్మాసనం శుక్రవారం విచారణ నిర్వహించింది. విద్యా, ఉద్యోగాల్లో అగ్రవర్ణాలకు చెందిన పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ మూల సూత్రాలను ఉల్లంఘించడమేనని, ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పిస్తూ కోర్టు ఇచ్చిన పలు తీర్పులతో విబేధించడమేనని పిటిషన్ పేర్కొంది. ఆర్థిక వెనుకబాటుతనం రిజర్వేషన్లకు ప్రాతిపదిక కాదని ఇందిరా సహన్నాయ్ కేసులో తొమ్మిది మంది సభ్యులతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పును పిటిషనర్ల తరపు న్యాయవాదులు సెంథిల్ జగదీషన్, గోపాల్ శంకర్ నారాయణన్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్ల పరిధి నుండి ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలను మినహాయించినట్లు న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. అన్నిటికీ మించి "ఆర్థికంగా బలహీన వర్గాలు" అనే పదాన్ని రిజర్వేషన్ బిల్లులో సరిగా నిర్వచించలేదని పిటిషన్ పేర్కొంది.



ఆర్‌టిసి ఎండికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఎన్‌ఎంయు నాయకులు

సమ్మెకు ఎన్‌ఎంయు సై

ఆర్‌టిసి ఎండికి నోటీసు

8 లేదా ఆ తరువాత ఎప్పుడైనా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించకుంటే ఫిబ్రవరి 8 నుంచి ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని ఎన్‌ఎంయు పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎండి సురేంద్రబాబుకు శుక్రవారం నోటీసు అందచేసింది. 'ఫిబ్రవరి 8న లేదా ఆ తరువాత ఎప్పుడైనా' సమ్మె ప్రారంభిస్తామని ఈ నోటీసులో ఎన్‌ఎంయు నేతలు పేర్కొన్నారు. వేతన మిగతా 9లో

సమ్మె చట్టవిరుద్ధం కాదు

మద్రాసు హైకోర్టు



చెన్నై : న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేయడం చట్టవిరుద్ధం కాదని మద్రాసు హైకోర్టు పేర్కొంది. సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదని, ప్రభుత్వాలు ఆ పని చేయడంలో విఫలమైనప్పుడు సమ్మెలు జరిగే పరిస్థితి ఏర్పడుతుందని కోర్టు తెలిపింది. సమ్మె చేస్తున్న వారిని విధుల్లో చేరాలని కూడా ఆదేశించలేమని చెప్పింది. తమ సమస్యల పరిష్కారం కోసం కొంత కాలంగా తమిళనాడులో ఉపాధ్యాయులు జెఎసిగా ఏర్పడి సమ్మె చేస్తున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు మూతపడ్డాయి. ఈ ఉపాధ్యాయులను విధుల్లో చేరేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. అటువంటి ఆదేశాలు ఇవ్వలేమని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విధుల్లో చేరాలని విజ్ఞప్తిని మాత్రమే చేయగలమని ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది.

ఆ అర్హతా ప్రమాణాలను వ్యతిరేకిస్తున్నాం

ఇబిసి రిజర్వేషన్ల పై సిపిఎం

ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

పది శాతం ఇబిసి రిజర్వేషన్లకోసం కేంద్ర ప్రభుత్వం పేర్కొన్న అర్హతా ప్రమాణాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సిపిఎం ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ పొలిట్ బ్యూరో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ రిజర్వేషన్లకు నిర్ధేశించిన అర్హతా ప్రమాణాలు ఆర్థిక వెనుకబాటు తనాన్ని అసహాస్యం చేసే రీతిలో వున్నాయనిపేర్కొంది. అసంఘటిత రంగ కార్మికులు, ఉద్యోగులకు రు.18 వేల కనీస వేతనాన్ని ప్రకటించాలన్న డిమాండ్‌ను అంగీకరించని ప్రభుత్వం ఇప్పుడు ఆర్థిక వెనుకబాటు రిజర్వేషన్ ప్రయోజనాలను పొందేందుకు రు.70వేల నెలసరి ఆదాయాన్ని నిర్దేశించటం విడ్డూరంగా వుందని విమర్శించింది. ప్రభుత్వం నిర్దేశించిన ఈ అర్హతా ప్రమాణాలు అర్హులైన వారికి కూడా ఈ రిజర్వేషన్‌ల ఫలితాలను దక్కనివ్వవని స్పష్టం చేసింది. ఒబిసి రిజర్వేషన్లలో క్రీమీలేయర్ వారికి నిర్దేశించిన అర్హతా ప్రమాణాలనే ఇక్కడ కూడా నిర్దేశించటం పూర్తి తప్పు అని తేల్చిచెప్పింది. జనరల్ కేటగిరీలో వర్తించని ఈ రిజర్వేషన్ మిగతా9లో

డ్రైవర్ పోస్టుల భర్తీ

దరఖాస్తులు ఆహ్వానించిన అగ్నిమాపక శాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అగ్నిమాపక శాఖలో . రాష్ట్ర వ్యాప్తంగా 85 డ్రైవర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించారు. దరఖాస్తులు అన్ని జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయాల్లో ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 6 వరకూ అందుబాటులో ఉంటాయని రాష్ట్ర పోలీస్ నియామక మండలి ఛైర్మన్ విశ్వజీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పాటు రూ.25 చెలించాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు ఫిబ్రవరి 12న ఉదయం 8 గంటలకు దేహదారుఢ్య, డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఓటర్ ఐడి ఆవిష్కరణ

ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో ఓటర్ ఐడిని ఆవిష్కరిస్తున్న గవర్నర్ నరసింహన్



ఇచ్చింది సగంకన్నా తక్కువే

కౌలు రైతులకు పంట రుణాల వితరణ తీరు

లక్ష్యం 7500 కోట్లు.. మంజూరు 3461 కోట్లే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వ్యవసాయం కోసం వేల కోట్ల రూపాయలను రైతులకు బ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తున్నట్లు ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఫలితాలు నామమాత్రంగానే ఉంటున్నాయి. పైగా కౌలు రైతుల సమస్యలు మరింత పెరుగుతున్నాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో కౌలు రైతులకు 7,500 కోట్ల రూపాయల వరకు రుణాలు ఇవ్వాలన్న లక్ష్యం బ్యాంకులకు ఇచ్చారు. దీనివల్ల దాదాపు 3,35,205 మంది రైతులకు మేలు జరగాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు కేవలం రూ.3461 కోట్లు మాత్రమే చెల్లించారు. ఇది మొత్తం లక్ష్యంలో సగం కూడా లేకపోవడం గమనార్హం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా రెండు నెలలు మాత్రమే మిగిలి ఉంది. ఇలా ఉండగా, వ్యవసాయ రంగానికి స్వల్పకాల, దీర్ఘకాల రుణాలు రూ.62,859 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటివరకు రూ.45,665 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఇది వార్షిక లక్ష్యంలో 73 శాతమే. 56,21,001 మంది రైతులకు ఈ రుణాలు చేరాల్సి ఉండగా, 41,28,801 మందికే అందడం గమనార్హం. కాగా, మొత్తం 21 బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించగా, ఒక్క బ్యాంకు మాత్రమే వంద శాతం లక్ష్యాన్ని అధిగమించగా, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర, సిండికేట్ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకులు లక్ష్య సాధనలో సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి.

అక్షయగోల్డ్ డైరెక్టర్ రిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజలను మోసం చేసి, సుమారు ఐదేళ్లుగా పరారీలో ఉన్న అక్షయ గోల్డ్ డైరెక్టర్ ఎట్టకేలకు శుక్రవారం పోలీసుల చేతికి చిక్కాడు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు జిల్లా కోర్టు న్యాయమూర్తి నిందితుడికి ఫిబ్రవరి 4 వరకూ రిమాండ్ విధించారు. ఏలూరు టూ టౌన్ పోలీసుల కథనం ప్రకారం కూకట్ల శ్రీనివాస్ అక్షయ గోల్డ్ పేరుతో మోసం చేశారని 30 కేసులు, అభయ గోల్డ్ పేరుతో మరో 20 కేసులు ఉన్నాయి. సిఐడి పోలీసులు 2013లో కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన శ్రీనివాస్, అప్పటి నుంచీ పరారీలో ఉన్నాడు. అతనిపై పలు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి. నిందితుడిని శుక్రవారం విజయవాడలో పోలీసులు అరెస్టు చేసి, ఏలూరు జిల్లా కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి ఫిబ్రవరి 4 వరకూ జిల్లా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. దీంతో శ్రీనివాస్‌ను ఏలూరు జిల్లా జైలుకు తరలించారు.

మరింత తోడ్పాటివ్వండి

బ్యాంకర్లకు సిఎస్ విజ్ఞప్తి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మరింత తోడ్పాటును అందించాలని బ్యాంకర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ కోరారు. సచివాలయంలో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో మెరుగైన ఫలితాలు సాధించగలిగామని. బ్యాంకర్ల సహకారం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో మంచి ఫలితాలు రావడంతో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు గుర్తించి అనేక అవార్డులు ఇస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కౌలు రైతులకు రూ.5 వేల కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. బ్యాంకుల సహకారం లేనిదే అభివృద్ధి సాధ్యం కాదని, రానున్న రోజుల్లో ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు మరింత సమన్వయంతో పని చేయాలన్నారు. బ్యాంకులు ఎదుర్కొంటున్న సమస్యలను సబ్‌కమిటీ సమావేశంలో చర్చించి వారి పరిష్కారానికై ఎస్‌ఎల్‌బిసి సమావేశం దృష్టికి తీసుకుకావాలని సూచించారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ అధ్యక్షులు, ఆంధ్రాబ్యాంక్ ఎండి, సిఇఒ జె.పకిరిసమి మాట్లాడుతూ 2018-19 వార్షిక రుణ ప్రణాళిక అమల్లో గత సెప్టెంబరు నాటికి 75.73 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు చెప్పారు. ఆర్‌బిఐ హైదరాబాదు ప్రాంతీయ సంచాలకులు సుబ్రతదాస్ మాట్లాడుతూ ఈ ఏడాది 11 శాతం వృద్ధి సాధనకు కృషి జరుగుతోందన్నారు. అమరావతి సహా అన్ని ప్రాంతాల్లో కరెన్సీ చెస్ట్‌లలో సరిపడినంత నగదు అందుబాటులో ఉంచేందుకు ఆర్‌బిఐ తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు కుటుంబరావు, నాబార్డు సిజిఎం సరేష్‌కుమార్ ప్రసంగించారు. అంతకు ముందు బ్యాంకర్లు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. వార్షిక రుణప్రణాళిక లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయనకు వివరించారు.

రూ.1.47 లక్షల కోట్ల రుణాలిచ్చాం

ఈ ఆర్థిక సంవత్సరంలో రుణ ప్రణాళికలో భాగంగా వివిధ బ్యాంకులు 1,94,220 కోట్లు రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా సెప్టెంబరు 30 నాటికి రూ.1,47,075 కోట్ల రుణాలు అందించినట్లు ఎస్‌ఎల్‌బిసి కన్వీనర్ కెఎస్‌డిఎస్ వరప్రసాద్ చెప్పారు. 75.73 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. వ్యవసాయ రంగంలో రూ.1,01,564 కోట్లు రుణాలందించాలని లక్ష్యంగా ఉండగా రూ.63,314 కోట్లు అదించినట్లు, ఎంఎస్‌ఎంఇలకు రూ.28,261 కోట్లుకు గాను రూ.20,521కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మొత్తం ప్రాధాన్యతా రంగంలో రూ.1,44,220 కోట్లుకు గాను రూ.87చ286 కోట్లు రుణాలు అదించినట్లు, ప్రాధాన్యేతర రంగాల్లో రూ.50,000 కోట్ల లక్ష్యానికి గాను 59,789 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. వివిధ రంగాల్లో సెప్టెంబరు 30 నాటికి బ్యాంకులు సాధించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు

జాబ్‌మేళాలో 10,061 మందికి ఉద్యోగాలు

ఎపిఎస్ఎస్‌డిసి ఎమ్‌డి కృతికా శుక్లా

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి) అడ్వాంటేజ్ ఎపి కెరీర్ ఎక్స్‌పో పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులు (23, 24 తేదీల్లో) నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 10,061 మందికి ఉద్యోగాలు కల్పించినట్టు సంస్థ ఎమ్‌డి, సిఇఒ కృతికా శుక్లా శుక్రవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాకు రాష్ట్రవ్యాప్తంగా 37,671 మంది నిరుద్యోగులు హాజరయ్యారని, వారిలో 10,061 మందికి వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు నియామక పత్రాలు అందజేశారని ఆమె తెలిపారు. దీంట్లో అమెరికన్ ఎక్స్‌ప్రెస్, టెక్ మహీంద్రా, టాటా బిజినెస్ సపోర్టు సర్వీసెస్ తదితర కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయని వివరించారు. దీంట్లో యువనేస్తం లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు పొందటం మంచి పరిణామమని అన్నారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి యువనేస్తం లబ్ధిదారులకు మూడు విడతలుగా శిక్షణ ఇచ్చామని, నాలుగో విడత గురువారం నుంచి ప్రారంభమైందని, దీన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సిఎం సహాయనిధికి విరాళమిచ్చిన నాబార్డ్ ఉద్యోగులు

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

సిఎం సహాయనిధికి నాబార్డ్ ఉద్యోగులు రూ.14.50 లక్షలు విరాళమిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబును శుక్రవారం నాబార్డ్ ఉద్యోగులు ఉండవల్లిలోని ప్రజావేదికలో కలిశారు. తర్వాత సిఎం సహాయనిధికి విరాళంగా రూ.14.50 లక్షల విలువైన చెక్‌ను నాబార్డ్ సిజిఎం కె.సురేష్ కుమార్ చంద్రబాబుకు అందజేశారు. దీంట్లో నాబార్డ్ ఇతర అధికారులూ పాల్గొన్నారు.

కోస్తా, సీమల్లో వర్ష సూచన

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో



మహారాష్ట్ర నుంచి కర్నాటక వరకు ద్రోణి కొనసాగుతోందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు దక్షిణ మధ్య మహారాష్ట్రపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొంది. వీటి ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన జల్లులు పడతాయని తెలిపింది. హిందూ మహాసముద్రంలో భూ మధ్య రేఖా ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఇది దక్షిణ మధ్య బంగాళాఖాతానికి ఆనుకుని స్థిరంగా ఉన్నట్లు తెలిపింది. ఇది ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనానికి అనుబంధంగా కొనసాగుతోందని పేర్కొంది.

గెలిపిస్తే ఫోనిస్తా



ప్రజాశక్తి-గుంటూరు/కడప/విశాఖ బ్యూరో ప్రతినిధులు

డ్వాక్రా మహిళలకు, వెలుగు ఉద్యోగులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వరాలు ప్రకటించారు. ముఖ్యమంత్రి శుక్రవారం గుంటూరు జిల్లా నేలపాడు, కడప, విశాఖల్లో జరిగిన డ్వాక్రా గూపు సభ్యుల విస్తృత సమావేశాల్లో మాట్లాడుతూ భవిష్యత్తులో డ్వాక్రా మహిళలందరికీ స్మార్టు ఫోన్లు అందిస్తామని ప్రకటించారు. గత నాలుగేళ్లలో ఒక్కొక్కరికి రూ.10 వేలు సాయం చేశానని, రానున్న మూడు నెలల్లో మరో రూ.10 వేలు సాయం చేస్తానని చెప్పారు. ఈ నిధులు మూడు చెక్కుల రూపంలో ఫిబ్రవరిలో రూ.2500, మార్చిలో రూ.3500, ఏప్రిల్‌లో రూ.4 వేలు చొప్పున చెక్కుల రూపంలో నేరుగా మహిళల పేరున అందిస్తామని వివరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నేలపాడులో సిఎం మాట్లాడుతూ అభివృద్ధి కొనసాగించాలంటే తనను మళ్లీ ఎన్నికల్లో గెలిపించాలన్నారు. రాష్ట్రంలో 93,81,118 మంది డ్వాక్రా మహిళలు ఉన్నారని, ఇంతమంది సైన్యం తనకు అండగా ఉండగా తనను ఎవ్వరూ ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేశారు. అంచెలంచెలుగా డ్వాక్రా మహిళలను అభివృద్ధి చేశామన్న సిఎం ఇప్పటికే పసుపు కింద కింద రూ.10 వేలు చొప్పున రూ.8604 కోట్లు రుణ మాఫీ కింద ఇచ్చామని, అసలు, వడ్డీ కలిపి రూ.11,118 కోట్లు మహిళల ఖాతాల్లో జమచేశామని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా అప్పు చేసి ఈ సొమ్ము చెల్లించామన్నారు. ప్రతి మండల కేంద్రంలో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల స్థాపనలో డ్వాక్రా మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని, వెలుగు ఉద్యోగులకు 30 శాతం వేతనం పెంచుతున్నామని సిఎం ప్రకటించారు. గతంలో రెండు సార్లు పెంచిన 20 శాతంతో పాటు తాజాగా మరో 10 శాతం వేతనం పెంచుతామని చెప్పారు. వెలుగు ఉద్యోగులకు ఎన్‌టిఆర్ ఆరోగ్య కార్డులు, 10 లక్షల ప్రమాద బీమా సదుపాయం, 10 రోజుల మెడికల్ లీవ్ సదుపాయం కల్పిస్తామన్నారు. టిడిపి గెలుపు చారిత్రక అవసరమని, స్థిరమైన ప్రభుత్వం ఏర్పడాలంటే 25 మంది ఎంపీలను, 150 మందికి పైగా ఎమ్మెల్యేలను గెలిపించాలని కోరారు. కొంతమంది కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని, తాము అందర్నీ ఆదుకుంటున్నామని చెప్పారు. సభ ప్రారంభంలో మా తెలుగుతల్లి గీతాలాపన అనంతరం అహో అహో అమరావతి సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. వృద్ధాప్య పింఛన్‌ను రూ.200 నుంచి రూ.2,000 పెంచి ప్రతి ఇంటికీ పెద్ద కొడుకును అవుతాననే హామీని నిలబెట్టుకున్నానని తెలిపారు. రాయలసీమ జిల్లాలకు హంద్రీ-నీవా ద్వారా నీళ్లు ఇస్తున్నానన్నారు. జూన్‌లో పోలవరం నీటిని గ్రావిటీ ద్వారా విడుదల చేస్తామన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ, పొరుగున తెలంగాణ మోడీ, సొంత రాష్ట్రంలో పులివెందులకు చెందిన మరో మోడీ వైఎస్ జగన్ రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. డ్వాక్రా మహిళలదీ, తనదీ అన్నా చెల్లెళ్ల అనుబంధమని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానిం చారు. తాను ఏ పని చేపట్టినా విజయవంతం చేసేది డ్వాక్రా మహిళలేనన్నారు. మహిళలు తనకు అండగా ఉంటే వారికి ఏం కావాలన్నా చేస్తానన్నారు. ప్రపంచంలో ఎక్కడా 94 లక్షల మందితో కూడిన వ్యవస్థ లేదని, ఏపీలో మాత్రమే ఉందని చెప్పారు. వీరితో పాటు, 54 లక్షల మంది పింఛనుదారులు ఓట్లేస్తే 25 ఎంపీ సీట్లు మనం గెలుచుకోలేమా? అని చెప్పారు. కెసిఆర్ గిఫ్ట్ ఇస్తామంటున్నారని, ఆయనకు ఐదు గిఫ్టులివ్వడానికి సిద్ధంగా ఉన్నామని మహిళలంతా సిద్ధంగా ఉండాలని అన్నారు. ఆయా జిల్లాల్లో రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు,ఎస్పీలు పాల్గొన్నారు.

30న మంత్రివర్గ సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం ఈ నెల 30వ తేదీన నిర్వహించ నున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. సచివాలయంలోని ఒకటవ బ్లాక్‌లోని క్యాబినెట్ మీటింగ్ హాలులో మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ సమావేశం జరుగుతోందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశానికి అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

పురుషోత్తపట్నం కేసు వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పురుషోత్తపట్నం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంపై దాఖలైన పిటిషన్ విచారణ వాయిదా పడింది. అనుమతులు లేకుండానే పురుషోత్తపట్నం ఎత్తిపోతల ప్రాజెక్టు చేపట్టారని మడిచర్ల సత్యనారాయణ, మడిచర్ల రామకృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) ఈ ప్రాజెక్టుపై విచారణలో ఉన్న ఇతర పిటిషన్లకు జత చేసింది. శుక్రవారం జస్టిస్ రఘువేంద్ర ఎస్.రాథోడ్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ దీనిపై విచారణ జరిపింది. పర్యావరణ అనుమతులు వచ్చాకే పురుషోత్తపట్నం పనులు చేపట్టాలంటూ పిటిషన్‌దారులు తరపు న్యాయవాది శ్రావణ్ కుమార్ ట్రిబ్యునల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై జమ్ముల చౌదరయ్య, ఇందుకూరి సూర్యనారాయణరాజుల వ్యాజ్యం విచారణలో ఉందని, అనుమతుల అంశం తేల్చాలని కేంద్ర పర్యావరణ శాఖను ఇప్పటికే ఆదేశించామని ట్రిబ్యునల్ పేర్కొంది. ఒకే అంశమైనందున ఆ వ్యాజ్యానికి దీనిని జత చేసినట్లు ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. మార్చి ఆరున ఆ కేసుతో పాటే దీనిని ధర్మాసనం విచారించనుంది.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ల సదస్సు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రతి నెలా 28వ తేదీన నిర్వహించాల్సిన కలెక్టర్ల సదస్సును రద్దు చేసి.. ఆ స్థానంలో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించాలని నిర్ణయించారు. గత సదస్సు మాదిరిగానే తాజా వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా ఎన్నికలకు ఉపయోగపడే పథకాలపైనే చర్చించనున్నారు. దీనికి సంబంధించిన అజెండాను రెవెన్యూ అధికారులు ఖరారు చేశారు. ప్రధానంగా జన్మభూమిలో వచ్చిన ఫిర్యాదులు, వినతులను పరిష్కరించే దిశగా దిశా నిర్దేశం చేయనున్నారు. రేషన్ కార్డులు, పింఛన్లు, భూమికి సంబంధించిన వినతులు, ఇళ్ల పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు చర్చకు రానున్నాయి. అలాగే చంద్రన్న బీమా, చంద్రన్న పెళ్లికానుక, ముఖ్యమంత్రి యువ నేస్తం, హౌసింగ్, అన్న క్యాంటీన్లు, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఎన్టీయార్ వైద్య సేవ, వైద్య ఆరోగ్యం, వ్యక్తిగత, సామాజిక అంశాలు, వ్యవసాయం, కరవు, కనీస మద్దతు ధర, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అంశాలపై చర్చించనున్నారు.

21 మంది ఎపి పోలీసులకు రాష్ట్రపతి పతకాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గణతంత్ర దినోత్సవం సందర్భంగా 21 మందికి ఏపి పోలీసులకు వివిధ విభాగాల్లో మెడల్స్ లభించాయి. ఒకరికి విశిష్ట సేవ పురస్కారం, ఇద్దరికి ప్రతిభా పురస్కారం, ముగ్గురుకి రాష్ట్రపతి పోలీస్ మెడల్స్, 15 మందికి పోలీస్ ప్రతిభా సేవా పురస్కారాలు వరించాయి. వివరాలు :

కరెక్షనల్ సర్వీస్ మెడల్స్:

విశిష్ట సేవ పురస్కారం: వేమూరి వెంకట కోటి వీరా దుర్గా ప్రసాద్(హెడ్ వార్డెర్, సత్తెన పల్లి సబ్ జైల్, గుంటూరు)

ప్రతిభా పురస్కారం: పుట్టి గంగా సాయి రామ్ ప్రకాశ్ (సూపరింటెండెంట్, సెంట్రల్ జైల్, రాజమహేంద్రవరం), గెడ్డం జయవర్ధన్(ఐజి, కరెక్షనల్ సర్వీస్, విజయవాడ)

రాష్ట్రపతి పోలీస్ మెడల్స్

అడ్డాల వెంకట రత్నం(ఎస్పీ, ప్రత్యేక విచారణ శాఖ, పోరంకి), కింజరపు వెంకట రామక్రిష్ణ ప్రసాద్(డిఎస్పీ, విశాఖపట్నం), ఎన్. ప్రకాశ్ రావు(అసిస్టెంట్ డైరెక్టర్, విజయవాడ, హోం మంత్రిత్వ శాఖ)

పోలీస్ ప్రతిభా సేవ పతాకం

ఎస్. హరి కిషన్(ఇంటెలిజెన్స్ ఎస్పీ, విజయవాడ), వరుపుల సత్తిరాజు(ఎఆర్ డిఎస్పీ, రాజమహేంద్రవరం), కొత్తపల్లి శ్యాం వినోద్ కుమార్(డిఎస్పీ (ఎస్సీ, ఎస్టీ సెల్) కర్నూల్), కాళ్ల జనార్ధన్ నాయుడు(ఇంటెలిజెన్స్ డిఎస్పీ, తిరుపతి), పి. మోహన్ ప్రసాద్(అడిషినల్ కమాండెంట్ ఎపిఎస్పీ, విశాఖపట్నం), పి. కిరణ్ కుమార్ (కమాండర్ (గ్రేహౌండ్స్), వి.వేణు గోపాల్ రెడ్డి (ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ సిఐడి సెల్, విజయవాడ), బి. రాజ శేఖర్(పోలీస్ ట్రైనింగ్ కాలేజీ, ఒంగోలు),. ఎం.వెంకట గణేష్(ఎసిబి, విశాఖ పట్నం), ఎన్.గుణ శేఖర్ (ఎస్ఐ, బంగారుపాళ్యం), షేక్ అహ్మద్ బాషా(సిపిఎల్), జి.వెంకట రామారావు (హెడ్ కానిస్టేబుల్, విశాఖపట్నం), జి.సుబ్బారావు (హెడ్ కానిస్టేబుల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, విజయవాడ), వై. వీర వెంకట సత్యసాయి ప్రకాశ్(హెడ్ కానిస్టేబుల్, ఎఐబి, పోరంకి), బి.వెంకటేశ్వరరావు(రైల్వే పోలీస్ కానిస్టేబుల్, విజయవాడ).

అత్యాచార ఘటనలో మరో మలుపు

స్వీట్‌షాపులో పనిచేసే వ్యక్తులపైనా అనుమానం

కోలుకుంటున్న బాధితురాలు

ప్రజాశక్తి - నూజివీడు

కృష్ణాజిల్లా ఆగిరిపల్లిలో అత్యాచారానికి గురైన స్థానిక ఎంపిపిఎస్ మెయిన్ పాఠశాలలో రెండో తరగతి బాలిక కేసు శుక్రవారం మరో మలుపు తిరిగింది. ఒక స్వీట్‌షాపులో పనిచేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. వీరిలో ఒకరు ఆ బాలికకు స్వీట్స్ ఇచ్చి మచ్చిక చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ దిశగా పోలీసులు విచారణ చేస్తున్నారు. అలాగే అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న హెచ్‌ఎంపై ఐపిసి సెక్షన్ 354, 324 కింద బాలికల హక్కుల చట్టం, సెక్షన్ 10 కింద కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ వి.ఏసోబు తెలిపారు. బాధిత బాలిక విజయవాడలో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. అక్కడి ఆసుపత్రిలో బాలిక కోలుకుంటున్నట్లుగా డాక్టర్లు తెలిపారు. బాలికపై జరిగిన ఘోరాన్ని ఐద్వా నూజివీడు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.పద్మాంజలి, పి.కమల ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

ఎపిపిఎస్‌సి కార్యాలయం ముట్టడి

- విద్యార్థి, యువజన సంఘాల నేతల అరెస్టు
- ఈడ్చిపారేసిన పోలీసులు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రూప్ వన్ వాయిదా వేయాలని, జనరల్ కోటాలో రిజర్వుడు అభ్యర్థులను అనుమతించా లని, ఎపిపిఎస్‌సి ఛైర్మన్ ఉదయభాస్కర్‌ను తొలగించాలని కోరుతూ పలు విద్యార్థి, యువజన, దళిత సంఘాలు శుక్రవారం చేపట్టిన ఎపిపిఎస్‌సి కార్యాలయ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, కెవిపిఎస్, మాలమహానాడు, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలకు చెందిన పలువురు ఒక్కసారిగా ఎపిపిఎస్‌సి కార్యాలయంలోకి దూసుకెళ్లడానికి ప్రయత్నించారు. అక్కడే ఉన్న ఎస్‌పిఎఫ్ సిబ్బంది ప్రధాన గేటువద్దే వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు ఆయా సంఘాల నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు అశోక్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్ర, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు, అధ్యక్షులు రామన్న, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చరణ్‌సాయి, సుబ్బారావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అఫ్సర్ తదితరులను ఎస్‌పిఎఫ్ సిబ్బంది బలవంతంగా బయటకు నెట్టేశారు. నాయకులను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా మాట్లాడిన నేతలు పరీక్షలకు సమయం అతి తక్కువ ఇవ్వడం అవకాశాలను తిరస్కరించడమేనని అన్నారు. యుపిపిఎస్‌సి దాదాపు ఏడాదిపాటు అభ్యర్థులకు సమ యం ఇస్తోందని చెప్పారు. ఎపిపిఎస్‌సి ఛైర్మన్ నిరుద్యోగుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, మాన వత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మనోహర్, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నాయకులు శ్రీకాంత్, డివైఎఫ్ఐ నాయకులు సుందరయ్య, నాగేశ్వర రావు, కెవిపిఎస్ నాయకులు నటరాజు, క్రాంతి పాల్గొన్నారు.

పంచాయితీ కార్యదర్శి దరఖాస్తు గడుపు పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయితీ కార్యదర్శి పోస్టుల దరఖాస్తుకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) మరోసారి గడువు పొడిగించింది. ఈ నెల 19తో ముగిసిన గడువును 26వరకు పొడిగించిన విషయం తెలిసిందే. ఈ నెల 29వరకు ఈ గడువును పొడిగిస్తూ కమిషన్ కార్యదర్శి శుక్రవారం ఎపిపిఎస్‌సి వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ నెల 28 అర్ధరాత్రి వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

విశాఖ ఆర్జెడీ ఏర్పాటు

విశాఖపట్నం రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన జీవో 9ను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్య నాథ్ దాస్ శుక్రవారం విడుదల చేశారు. విశాఖపట్నం కేంద్రంగా విశాఖపట్నం-శ్రీకాకుళం-విజయనగరం జిల్లాల పాఠశాల విద్య పాలనా వ్యవహారాలు జరగనున్నాయి.

చిదంబరాన్ని కస్టడీకి అప్పగించండి

ఢిల్లీ హైకోర్టును కోరిన సిబిఐ, ఈడీ

న్యూఢిల్లీ : ఐఎన్ఎక్స్ మీడియా కేసును మరింత లోతుగా విచారించేందుకు మాజీ కేంద్ర మంత్రి చిదంబరంను కస్టడీకి అప్పగించాలని సిబిఐ, ఈడీ శుక్రవారం ఢిల్లీ హైకోర్టును కోరాయి. ఐఎన్ఎక్స్ మీడియాకు సంబంధించి మనీ ల్యాండరింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ చిదంబరం హైకోర్టును ఆశ్రయించారు.

'మా ఇంటి మాలక్ష్మి' ప్రశ్నార్థకం

- ఈ సారి బడ్జెట్‌లోనూ మొండి చెయ్యేనా!
- మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతిపాదనలు రూ. 3750 కోట్లు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆడపిల్లలున్న కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చే 'మా ఇంటి మాలక్ష్మి' పథకం పేరు మార్పుతోనే ఆగిపోయింది. గతంలో బంగారు తల్లి పథకం పేరును కాస్తా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా ఇంటి మాలక్ష్మిగా మార్చింది. కాని గత నాలుగేళ్ల బడ్జెట్‌లో ఈ పథకానికి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. ఇక ఈసారి బడ్జెట్‌లోనైనా దీనికి ప్రాధాన్యత ఇస్తారా అనేది ప్రశ్నార్థకంగానే ఉంది. 2015 - 16 బడ్జెట్ నుంచి 2017 వరకు బడ్జెట్‌లో మహిళా శిశుసంక్షేమ విభాగం కింద ఈ పథకానికి రూ 15 కోట్లు కేటాయించారు. అయితే అవి కేటాయింపులకే పరిమితమయ్యాయి. ఒక్క రూపాయైనా విడుదల కాలేదు. ఇక గతేడాది బడ్జెట్‌లో కనీసం ఈ పథకం పేరు కూడా ప్రస్తావించలేదు. 'పుట్టిన ప్రతి ఆడబిడ్డ పేరుతో మహాలక్ష్మి పథకం కింద అర్హులైన కుటుంబాలకు రూ.30 వేలు బ్యాంకులో డిపాజిట్ చేసి, యుక్త వయసు వచ్చే నాటికి రూ 2 లక్షలను అందజేస్తాం' అని టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. అయితే లబ్ధిదారుల పేర్లు నమోదై ఉన్నా ఇంతవరకు పథకం అమలుకు మార్గదర్శకాలే ప్రభుత్వం విడుదల చేయలేదని ఐసిడిఎస్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

వివిధ పథకాల అమలుకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఈ ఏడాది దాదాపు రూ. 3750 కోట్లు ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే అందులో ప్రధానంగా సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్), సమగ్ర శిశు సంరక్షణ పథకం (ఐసిపిఎస్) పథకాలకు ఎక్కువ కేటాయించాల్సిందిగా ఆ శాఖ అధికారులు ప్రతిపాదించినట్లు తెలిసింది. గతేడాది బడ్జెట్‌లో రూ. 3007.96 కోట్లు కేటాయించగా ఈసారి దానికి అదనంగా దాదాపు రూ. 750 కోట్లు ప్రతిపాదించారు.

పొల్లూరు జలపాతంలో పర్యాటకుడు గల్లంతు

ప్రజాశక్తి - మోతుగూడెం (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం శివారు పొల్లూరు జలపాతాన్ని సందర్శించేందుకు వచ్చిన ఓ పర్యాటకుడు శుక్రవారం సాయంత్రం జలపాతం వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి పడి గల్లంతయ్యారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురానికి చెందిన ఎన్.విజయకుమార్ (30) కాకినాడ సర్వశిక్షాభియాన్ కంప్యూటర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పొల్లూరు జలపాతం వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ కాలుజారి పడి గల్లంతైనట్లు ఎస్ఐ వాడపల్లి కిషోర్‌బాబు తెలిపారు. తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

పెత్తందార్ల దాడిలో గాయపడిన దళితులు



కత్తులు, కర్రలతో దళితులపై దాడి

8 మందికి గాయాలు - కడప జిల్లాలో పెత్తందారుల దాష్టీకం

ప్రజాశక్తి - బద్వేలు

కడప జిల్లాలో పెత్తందారుల దాష్టీకం. ఖాళీ స్థలంలో నివాసం ఏర్పరుచుకున్నారనే నెపంతో దళితులపై దాడికి పాల్పడ్డారు. కర్రలు, కత్తులతో విచక్షణారహింతగా దాడి చేశారు. 8 మంది గాయాలపాలయ్యారు. వారి గుడిసెలకు కూడా నిప్పుపెట్టారు. ఈ ఘటన కడప జిల్లా బద్వేలులోని సుందరయ్య కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది.

క్షతగాత్రుల సమాచారం మేరకు.. గోపవరం మండలంలోకి వచ్చే సుందరయ్య కాలనీలో 1008 సర్వే నెంబర్‌లో 72 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. ఇదే స్థలంలో కొంత మంది దళితులు నివాసాలు ఏర్పరుచుకున్నారు. విషయం తెలుసుకున్న పెత్తందార్లు ఈ స్థలం తమదేనంటూ అందుకు సంబంధించిన పత్రాలు ఉన్నాయని దూషించారు. దీంతో దళితులు పోలీసులను ఆశ్రయించారు. అర్బన్ పోలీసులు పత్రాల ధ్రువీకరణ కోసం గోపవరం మండల కార్యాలయానికి పంపారు. ఇదిలా ఉండగానే చింతపుట్టాయిపల్లెకు చెందిన రాజారెడ్డి, చెన్నారెడ్డి, మరో 70 మంది అనుచరులతో దళితులను కర్రలు, కత్తులతో భౌతిక దాదులకు పాల్పడ్డారు. ఈ దాడిలో బాబు, చిన్నయ్య, షంషాద్, మహబూబ్‌బాషా, సుబ్బరాయుడు, మోక్షమ్మ, మరియమ్మ, ఖాజాపీర్‌లకు గాయాలయ్యాయి.చిన్నయ్య, బాబు లకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి ఉంటే ఈ దాడి జరిగేది కాదని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బద్వేలు, కడప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని సిపిఎం నాయకులు పరామర్శించారు.

జనసేన, సిపిఎం, సిపిఐ

రౌండ్‌టేబుల్ సమావేశ తీర్మానం ఇదే

ప్రజాశక్తి - విశాఖ :

మన సహజసంపదను, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం చాలా ముఖ్యమని మేం భావిస్తున్నాం. ఆర్థిక పురోగమనం, అభివృద్ధి మనకు అవసరమే. అయితే అందుకు పర్యావరణాన్ని బలిపెట్టరాదు. చట్టవిరుద్ధంగా, బాధ్యతారాహిత్యంతో సాగిస్తున్న మైనింగ్ వల్ల సామాజిక ఘర్షణలు పెరుగుతున్నట్టు మేము గుర్తించాము. ప్రగతి అంటే పర్యావరణాన్ని రక్షించేది కూడా. బాక్సైట్, లాటరైట్ తవ్వకాలను బలంగా వ్యతిరేకిస్తూ తీర్మానిస్తున్నాం. జిఒ నెం.97ను తక్షణమే రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తున్నాం. గిరిజనులకు, నిర్వాసితులుగా మారుతున్న ఇతర తరగతుల ప్రజలకు పూర్తి పరిహారం చెల్లించాలి. వారి జీవనోపాధిని కాపాడాలి. ప్రభుత్వం గిరిజనులను, నిర్వాసితులుగా మారుతున్న ఇతర ప్రజలను సంప్రదించాలి. వారి ఆమోదం తీసుకోవాలి. వారికి నష్టపరిహారం చెల్లించాలి. వాయుకాలుష్యం ఆందోళనకరమైన స్థాయికి పెరుగుతోంది. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. అందరికీ రక్షిత తాగునీటిని అందించాలి. ముఖ్యంగా ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు అందించాలి.

భూసేకరణ

1.ఈ సమావేశం భూసేకరణకు సంబంధించి నష్టపరిహారం చెల్లింపు గురించి చర్చించింది. ముందు నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే భూసేకరణ చేపట్టాలి.

2. విచక్షణారహితంగా భూ సేకరణను అమలు చేస్తున్న ఫలితంగా తలెత్తుతున్న సామాజిక ఘర్షణల గురించి సమావేశం చర్చించింది. పారిశ్రామిక ప్రాంతాల ఏర్పాటు కోసం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూమిని సేకరించేటప్పుడు ముందస్తుగా నిర్వాసితులు కాబోయేవారి ఆమోదం తప్పనిసరిగా ఉండాలి. నిర్వాసితులయ్యే వారందరికీ తగినంత నష్టపరిహారం చెల్లించాలి. పునరావాస, సహాయ ప్యాకేజీ తు.చ. తప్పకుండా అమలు చేయాలి.

3. పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఇప్పటికే సేకరించిన భూముల్లో ఆర్థికంగా బలహీనవర్గాల ప్రజలకు గృహనిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చట్టానికి తెచ్చిన సవరణలు ఆ చట్టం స్ఫూర్తిని బలహీనపరిచేటట్టు ఉండడం దురదృష్టకరం. ఉదా: భూ యజమాని ఆమోదం తెలపడం విషయంలో గల హక్కు, సామాజిక ప్రభావం అంచనా, అధ్యయనం ప్రాధాన్యత.

4. పోలవరం, వంశధార ప్రాజెక్టులలో అమరావతి రాజధాని ప్రాంతంలో నిర్వాసితులవుతున్న గిరిజనుల, రైతులు, మత్స్యకారుల సమస్యల గురించి సమావేశంలో చర్చించాం. కనుక 2013 భూసేకరణ చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలని తీర్మానిస్తున్నాం.

ఆంధ్రప్రదేశ్ పట్ల వివక్షతపై

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టాన్ని అమలు జరిపే విషయంలో రాష్ట్ర ప్రజలను కేంద్రంలోని బిజెపి, దాని మిత్ర పక్షాలు ఘోరంగా మోసగించాయని ఈ సమావేశం భావించింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించేందుకు బలమైన పోరాటం చేపట్టాలని సమావేశం తీర్మానించింది. ఇందుకవసరమైన భవిష్యత్తు ప్రణాళికను ఈ పార్టీలు త్వరలో ఖరారు చేస్తాయి.

మానవ హక్కుల ఉల్లంఘన

దేశవ్యాప్తంగా మానవ హక్కులపై పెరుగుతున్న దాడులను అన్ని పార్టీలు తీవ్రంగా ఖండించాయి. మతసామరస్యాన్ని పరిరక్షించే నైతిక బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపైనా ఉంది. భావ ప్రకటనా స్వేచ్ఛ పట్ల పెరుగుతున్న అసహనం ఆందోళనకరమైన అంశం. ధనికులకు, పేదలకు నడుమ పెరుగుతున్న అంతరం ఆందోళన కలిగిస్తోంది. ఇది అవినీతి పెరుగుదలకు, మానవ హక్కుల ఉల్లంఘనకు కారణమౌతోంది. పాత్రికేయురాలు గౌరీలంకేష్ హత్య దురదృష్టకరం. దళితులను, మహిళలను, విభిన్న ప్రతిభావంతులను, ఎల్‌జిబిట్‌క్యు తరగతుల ప్రజలను వివక్షత నుండి కాపాడేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని సమావేశం తీర్మానిందింది.

రాజకీయ తీర్మానాలు

రానున్న సాధారణ ఎన్నికల్లో జనసేన పార్టీ, సిపిఐ, సిపిఐ (ఎం) ఎన్నికల పొత్తు కుదుర్చుకోడానికి అంగీకరించాయి. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ జనసేన పార్టీతో కలిసి పని చేయడానికి సిపిఎం తన సంసిద్ధతను వ్యక్తం చేసింది. జనసేన, సిపిఎంలతో ఆంధ్రప్రదేశ్‌లో కలిసి పని చేయడానికి సిపిఐ తన సంసిద్ధతను వెంటనే తెలియజేస్తూ తెలంగాణా రాష్ట్రంలో అవగాహన కుదుర్చుకునే విషయమై కొంత వ్యవధి కావాలని కోరింది. ఇ.వి.ఎం.లపై తలెత్తుతున్న సందేహాలను, ఆందోళనను పరిశీలించి పరిష్కరించేందుకు ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరాలని సమావేశం తీర్మానించింది. కనీసం 10 శాతం ఓట్ల మేరకు వివి పాట్‌ల ద్వారా తనిఖీకి వీలుండే విధంగా ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరాలని సమావేశం తీర్మానించింది.

అన్యాయంపై చర్చ

29న అన్ని పార్టీల అధ్యక్షులతో విజయవాడలో సమావేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర విభజన అనంతరం ఎపికి జరిగిన అన్యాయంపై చర్చించి రానున్న ఐదేళ్లలో రాష్ట్రాభివృద్ధికి కావాల్సిన కార్యాచరణపై చర్చించేందుకు ప్రధాన రాజకీయ పార్టీల అధ్యక్షులతో ఈనెల 29న ఉదయం 10 గంటలకు విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేశామని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనం రోటరీహాలులో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడ సమావేశం ఇన్‌కెమేరా మీటింగ్ అని, చర్చల సారాంశాన్ని విలేకరుల సమావేశంలో వివరిస్తామని తెలిపారు. సమావేశానికి టిడిపి హాజరవుతున్నందున తాము రావడంలేదని వైసిపి నాయకుడు వైవి సుబ్బారెడ్డి చెప్పారన్నారు. టిడిపి ఇంకా స్పందించలేదన్నారు. రానున్న ఎన్నికల్లో పోటీచేసి గెలిచే అవకాశం ఉన్న ఏడు పార్టీలను ఆహ్వానించానన్నారు. జనసేన తరపున పవన్ కల్యాణ్ హాజరవుతారని, మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్‌ను కూడా రావాలని కోరానన్నారు. సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు, కాంగ్రెస్, బిజెపి అధ్యక్షులు సమావేశానికి వస్తామని చెప్పారన్నారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకొచ్చినప్పటికీ అన్ని పార్టీలూ రాష్ట్రాభివృద్ధికి సహకరించుకోవాలనే అంశంపై చర్చించి, ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. మోడీ ప్రభుత్వానికి నాలుగేళ్ల పాటు టిడిపి, వైసిపి ఎంపీలు మద్దతు పలకడం వల్ల ఎపికి జరిగిన అన్యాయంపై పార్లమెంటులో చర్చ జరగాలని పట్టుపట్టలేదన్నారు. ఐదేళ్లపాటు రాష్ట్రానికి అన్యాయం జరిగినా ఏమీ చేయలేకపోయామని, పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధి కోసం గతంలో నిజనిర్ధారణ కమిటీని నియమించి వాస్తవాలు బయటపెట్టారని తెలిపారు. ఆ నివేదిక ఆధారం గా ఎంపీలు, ఎంఎల్ఏలు రాష్ట్రాభివృద్ధి కోసం పోరాడటంలో వెనుక బడ్డారన్నారు. ఆయా పార్టీల అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత కార్యాచరణ ఉంటుందన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జాస్తిచలమేశ్వర్ ఈ సమావేశానికి హాజరై న్యాయ సంబంధ సలహాలు ఇస్తారని, చట్టబద్ధంగా ఎలా పోరాడాలో వివరిస్తారని చెప్పారు.

ప్రియాంక రాక వల్ల కాంగ్రెస్‌కు బూస్ట్ వచ్చిందని, ఉత్తరప్రదేశ్‌లో ఆమె ప్రభావం ఉంటుందని అరుణ్‌కుమార్ చెప్పారు. అగ్రకులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఎన్నికల రిజర్వేషన్లని చెప్పారు. కాపులను బిసిల్లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానించి కేంద్రం ప్రకటించిన అగ్రకుల రిజర్వేషన్లలో ఐదు శాతం కాపులకు ఇస్తానని సిఎం చెప్పడం చూస్తుంటే కాపులు ఒసిలా? బిసిలా? అనే అనుమానం కలుగుతుందన్నారు.

ఎయు విసికి కల్నల్ హోదా ప్రదానం

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావుకు ఎన్‌సిసి హానరరీ కల్నల్ హోదా లభించింది. శుక్రవారం ఎయు ఇంజినీరింగ్ కళాశాల వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌సిసి డిడిజి ఎన్ఎన్.రెడ్డి కల్నల్ హోదాను విసి నాగేశ్వరరావుకు ప్రదానం చేశారు. అనం తరం నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను కల్నల్ హోదాను సాధించడం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి లభిం చిన గౌరవమన్నారు. నేడు త్రివిధ దళాల్లో ఆంధ్రవిశ్వవిద్యాలయం భాగంగా మారిందని తెలిపారు. రక్షణ రంగాలలో పని చేయాలనే తన ఆకాంక్ష నేడు ఈ విధంగా నెరవేరిందన్నారు. 1975-78 సంవత్సరాలలో తాను ఎన్‌సిసి క్యాడెట్‌గా పని చేసి సి సర్టిఫికెట్‌ను సైతం సాధించానని చెప్పారు. ఎస్ఎస్‌బిలో విజయం సాధించి సెకండ్ లెఫ్టినెంట్‌గా ఎంపికైనా కొన్ని కారణాల వల్ల తాను వెళ్లలేకపోయానని తెలిపారు.

సంపాదకీయం

కార్పొరేట్ అవినీతి

దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంకుగా పేరు గడించిన ఐసిఐసిఐ బ్యాంకులో వెలుగు చూసిన వందలాది కోట్ల క్విడ్ ప్రోకో కుంభకోణం సరళీకరణ విధానాల డొల్లతనానికి మరో తార్కాణంగా నిలుస్తోంది. 2016లో తెరపైకి వచ్చిన ఈ కుంభకోణం కేసులో ఐసిఐసిఐ మాజీ సారథి చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూపు ఎండీ వేణుగోపాల్ ఎన్ దూత్‌లపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) ఎట్టకేలకు కేసు నమోదు చేసింది. మోసం, అవినీతికి సంబంధించిన వివిధ సెక్షన్ల కింద అభియోగాలు మోపింది. ఈ కేసులో దోషులుగా తేలితే కొచ్చర్ దంపతులకు మహా అయితే ఏడేళ్ల జైలు శిక్ష పడవచ్చు. ఇలాంటి కేసుల ద్వారానైనా కార్పొరేట్ రంగ గోముఖం ముసుగు తొలగి భక్షించే వ్యాఘ్ర రూపం బహిర్గతమైతే కార్పొరేట్ మోసాల నుంచి ప్రజలకు కొంత వరకైనా ఉపశమనం దక్కుతుంది. ఒకవైపు అసమర్థ రంగంగా ప్రభుత్వ రంగాన్ని తులనాడుతూ మరోవైపు పోటీతత్వానికి, సమర్థతకు గీటురాయిగా కార్పొరేట్ రంగాన్ని కొనియాడే పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలను నోళ్లు మూయించే ఉదంతాల్లో ఐసిఐసిఐ ఒకటి.

మనదేశంలో సరళీకరణ ఆర్థిక విధానాల తొలినాళ్లలోనే 1992లో వెలుగులోకి వచ్చిన రూ.4 వేల కోట్ల హర్షద్ మెహతా స్టాక్‌మార్కెట్ కుంభకోణం ఈ విధానాలు ప్రజానుకూలం కాదని తేల్చింది. 1996 హవాలా కుంభకోణం, తర్వాత కేతన్ పరేఖ్ రూ.1000 కోట్ల కుంభకోణం, 1995లో సిఆర్ బన్సాలీ మ్యూచువల్ ఫండ్స్ స్కామ్, ఆ తర్వాతకార్పొరేట్ బ్యాంకుల నుంచి సంజయ్ అగర్వాల్ రూ.600 కోట్ల రుణం తీసుకొని చేతులెత్తేయడం వంటివి, సరళీకరణ విధానాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు చేరదీసిన సత్యం రామలింగరాజు అంకెల గారడీ కుంభకోణం, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ పార్టీకి నిధులు సమకూర్చిన శారదా చిట్‌ఫండ్ కంపెనీ డిపాజిట్ల కుంభకోణం, సహారా ఇండియా పరివార్ రూ.24 వేల కోట్ల గోల్‌మాల్ బాగోతం, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి చిదంబరం ప్రమేయమున్నట్లు ఆరోపణలున్న ఎయిర్‌సెల్ మాక్సిస్ కుంభకోణం, 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం, ఇలా రాసుకుంటే పోతే కార్పొరేట్ అవినీతికి, అక్రమాలకు ఆకాశమే హద్దు. సరళీకరణ, ప్రపంచీకరణ ఆర్థిక విధానాల మూలమైన పెట్టుబడిదారీ వ్యవస్థలోనే ఈ సంక్షోభ విషబీజాలున్నాయని మార్క్స్ మహాశయుడు ఏనాడో సెలవిచ్చారు.

కార్పొరేట్ రంగంలో వెల్లువలా వెలుగుచూస్తున్న ఈ కుంభకోణాలు పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పతానవస్థకు చేరువలో ఉందనీ, ఆ దిశలో అంత్య దశకు చేరిందనడానికి ఇవి నిదర్శనంగా నిలుస్తున్నాయని చెప్పకతప్పదు. 2007లో గృహ రుణాల గాలి బుడగ బద్దలైపోవడంతో అమెరికాలో మొదలైన సబ్‌ప్రైమ్ క్రైసిస్ అనతికాలంలోనే ప్రపంచ ఆర్థిక సంక్షోభంగా మారింది. అమెరికా స్టాక్స్ దిగ్గజం లేమన్ బ్రదర్స్ దివాలా ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా వేలాది బ్యాంకులు, ద్రవ్య సంస్థలు పతనమై ఆటో మొబైల్ తదితర రంగాలు చతికిలపడ్డాయి. ప్రపంచీకరణ, సరళీకరణ వినాశకర విధానాలను అవలంబిస్తున్న మనలాంటి అన్ని దేశాలలోనూ రాజకీయ, సామాజిక సంక్షోభాలకు, ఆర్థిక కుంభకోణాలకు దారితీశాయి. ప్రజల జీవనోపాధులపై సమ్మెట పోటయ్యాయి.

సంక్షోభ పరిష్కారం పేరుతో అమెరికా తదితర పెట్టుబడిదారీ దేశాలన్నీ స్వీయ రక్షణ చర్యలు, పొదుపు చర్యలు, అంతర్జాతీయ ఒప్పందాల ఉల్లంఘన వంటి విధానాలు చేపట్టినా అవి సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేశాయేకానీ ఇసుమంతైనా ఉపశమనం కల్పించలేకపోయాయి. ఉద్దీపన పథకాల ద్వారా, రుణాల ద్వారా కార్పొరేట్ కంపెనీలకు లక్షలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచిపెట్టడమే దీనికి ప్రధానకారణం.

మనదేశంలో నీరవ్ మోడీ, విజయ్ మాల్యా, సుబ్రతో రాయ్ ఇప్పుడు చందాకొచ్చర్ లాంటి కార్పొరేట్ దిగ్గజాలు అవనీతి, కుంభకోణాల్లో కూరుకుపోవడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకరణ ఆర్థిక విధానాలే మూలం. ఉద్దీపన, పొదుపు చర్యల ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభం నుంచి కొంతమేర కోలుకుంటోందని కనిపించినా అదంతా కేవలం కాగితాలకు, మీడియా కథనాలకు మాత్రమే పరిమితమైందని నయా ఉదారవాద ఆర్థిక నిపుణులే అంగీకరించే వాస్తవం. ఇక ఈ సమస్యను 'పెట్టుబడి' పరిష్కరించలేదని వాటికన్ చర్చితో సహా ప్రపంచ సమాజమంతా నిర్ధారణకు వచ్చింది. ఫలితంగానే అనేక దేశాల్లో ప్రభుత్వ రంగ రక్షణ కోసం ప్రజలంతా ఉద్యమాలు సాగిస్తున్నారు. కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు సామాన్యులపై పన్నుల రూపంలో పెనుభారాలు మోపుతున్న ఫ్రాన్సు లాంటి దేశాల్లో ప్రజలు పాలకులపై తిరగబడుతున్నారు. అమెరికాలో సంక్షోభ ప్రారంభ సమయంలోనే 'ఒక్క శాతం పెట్టుబడిదారుల కోసం 99 శాతం ప్రజలు బలి కావాలా?' అని నిలదీస్తూ మొదలైన ప్రజా ఉద్యమం వివిధ దేశాల్లో వివిధ రూపాల్లో ఇంకా కొనసాగుతూనే ఉందనడానికి ఫ్రాన్స్ పరిణామాలు ఉదాహరణ. వినాశకరమైన ఈ సరళీకరణ ఆర్థిక విధానాలను తరిమికొట్టి ప్రకృతి వనరులను, ప్రజల సంపదను పరిరక్షించే సామ్యవాద పాలన దిశగా ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాల కోసం ప్రజలు కొట్లాడాలి. కార్పొరేట్లూ, అవినీతీ కలిసేపుడతాయని, కలిసే పెరిగి ప్రజల్ని కొల్లగొడతాయని, అవినీతి లేని కార్పొరేట్ వ్యవస్థ ఎండమావేనని గ్రహించాలి.

ఇదీ విషయం



చచ్చిన రాజుల పుచ్చిన గాథల
మెచ్చే చచ్చు చరిత్రకారులను
ముక్కు చెవులు కోసి అడగాలనుంది
మానవ పరిణామం నేర్పిందేమని

- జ్వాలాముఖి


సందర్భం

రాజ్యాంగ పునాదులపై మోడీ దాడులు



గత ఐదేళ్లుగా సంఘ పరివార్ ఆలోచనకు అనుగుణంగా లౌకిక విధానంపై అనేక మంది కేంద్రమంత్రులు, బిజెపి పాలిత రాష్ట్రాలలోని మంత్రులు దాడులు చేస్తున్నారు. 'హిందూత్వ' ఆధిక్యత ఉండాలని వారు భావిస్తున్నారు.

నేడు గణతంత్ర దినోత్సవం



కె ఎస్ లక్ష్మణరావు

భారత రాజ్యాంగం అమలు ప్రారంభమై 70వ సంవత్సరంలో ప్రవేశించాం. డా॥ బి ఆర్ అంబేద్కర్ నాయకత్వంలో ముసాయిదా కమిటీ రూపొందించిన రాజ్యాంగం కాలపరీక్షకు తట్టుకొని నిలబడటమే కాక, అభివృద్ధి చెందుతున్న దేశాలలో సమున్నతమైన రాజ్యాంగంగా కొనసాగుతున్నది. భారతదేశ భిన్నత్వాన్ని, బహుళత్వాన్ని పరిరక్షిస్తున్నది. భారతదేశ ఐక్యతకు రాజ్యాంగం ఒక ఆలంబనగా ఉన్నది. 1973లో కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు, 'భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని' కాపాడుకోవాలని చెప్పింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానం, స్వతంత్ర న్యాయ వ్యవస్థ, లౌకిక విధానం మొదలగు అంశాలను మౌలిక స్వరూపంగా సుప్రీంకోర్టు వివరించింది. గత ఐదేళ్లుగా నరేంద్ర మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం, భారతీయ జనతాపార్టీ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే విధంగా అనేక నిర్ణయాలు చేయడమే కాక, రాజ్యాంగ లక్ష్యాలకు విఘాతం కలిగించే చర్యలను చేపట్టింది. దాంతో ఇప్పుడు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడుకోవలసిన అవసరం ఏర్పడింది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం

భారత రాజ్యాంగం దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ప్రవేశ పెట్టింది. పార్లమెంటరీ విధానంలో ప్రధానమంత్రి నాయకత్వాన మంత్రిమండలి సమిష్టి బాధ్యతతో వ్యవహరిస్తూ సమిష్టి నిర్ణయాలు చేయాలి. మోడీ నాయకత్వంలో మంత్రి మండలి ఏక వ్యక్తి మండలిగా మారిపోయింది. కీలక శాఖలైన విదేశాంగ శాఖామంత్రి సుష్మాస్వరాజ్, హోంశాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ వంటి వారంతా 'నిర్ణయాధికారంలో' భాగస్వాములుగా లేరు. పెద్ద నోట్ల రద్దుతో సహా అనేక కీలక నిర్ణయాలలో మంత్రుల భాగస్వామ్యం సందేహాస్పదమే. నరేంద్ర మోడీ పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానాన్ని క్రమంగా 'అధ్యక్ష తరహా' విధానంలోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేయడం నియంతృత్వ విధానానికి దారితీస్తుంది.

సమాఖ్య విధానానికి విఘాతం

భారత రాజ్యాంగంలో ఒకటవ నిబంధన భారతదేశాన్ని 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' అని వర్ణించింది. డా॥ బిఆర్ అంబేద్కర్ భారతదేశం, ఆచరణలో సమాఖ్య విధానాన్ని అనుసరిస్తుందని పేర్కొన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జాతీయ ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి 'నీతి ఆయోగ్'ను ఏర్పాటు చేయడంలో రాష్ట్రాలను సంప్రదించలేదు. దేశ వ్యాప్త ప్రభావాన్ని కలిగించే పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి వంటి వాటిలో రాష్ట్రాల భాగస్వామ్యం లేదు. కేంద్రానికి ఇష్టం లేని కేరళ వంటి రాష్ట్రాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఉదాహరణకు శబరిమల దేవస్థానంలో మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టు తీర్పు అమలులో కేరళ ప్రభుత్వానికి సహకరించకుండా, ఇబ్బందులకు గురి చేయడం గత రెండు నెలలుగా జరుగుతున్నది. 15వ ఆర్థిక సంఘం నిధుల పంపిణీకి 2011 జనాభా లెక్కలను ప్రాతిపది కగా తీసుకోవాలని నిర్ణయంచడంతో అనేక రాష్ట్రాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతు న్నాయి. రాష్ట్రాల విజ్ఞప్తులను మోడీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం.

రాష్ట్రానికి సంబంధించి మోడీ ప్రభుత్వం ఐదు కోట్ల ఆంధ్రులకు అన్యాయం చేసింది. పార్లమెంట్ సాక్షిగా ఆనాటి ప్రధానమంత్రి ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని అమలు పరచలేదు. రాష్ట్ర విభజన చట్టంలోని పోలవరం నిర్మాణం, రాజధాని నిర్మాణానికి నిధులు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్, కడప ఉక్కు కర్మాగారం, దుగ్గరాజపట్నం ఓడరేవు నిర్మాణం మొదలగు వాటిని అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ పట్ల మోడీ ప్రభుత్వం పూర్తి వివక్ష చూపింది. రాజకీయ కారణాలతో ఈవిధంగా చేయడంలో సమాఖ్య విధానంలోని ఒక రాష్ట్రానికి అన్యాయం చేయడమే. అనేక రాష్ట్రాల పట్ల మోడీ ప్రభుత్వం వివక్షతో వ్యవహరిస్తున్నది.

న్యాయ వ్యవస్థలో జోక్యం

ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వర్గం, శాసన నిర్మాణ శాఖ స్వతంత్రంగా వ్యవహరించాలి. భారత న్యాయ వ్యవస్థ పని తీరుపై అనేక విమర్శలు రావడమే కాక, కేంద్ర జోక్యం ఎక్కువగా ఉందని స్వయంగా సీనియర్ న్యాయ మూర్తులే గళం విప్పటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. గత సంవత్సరం నలుగురు న్యాయమూర్తులు జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ కురియన్ జోసఫ్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ లోకూర్‌లు ప్రధాన న్యాయమూర్తి పని తీరుపై పత్రికా సమావేశంలో వెల్లడించిన అంశాలు న్యాయ వ్యవస్థలో జోక్యానికి అద్దం పట్టాయి. జస్టిస్ జోసఫ్ కురియన్ 2018 డిసెంబరులో పదవీ విరమణ సందర్భంలో 'మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా 'ఓ బయట వ్యక్తి ఒత్తిళ్లకు లోనై పని చేశార'ని చెప్పటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. కొలీజియం పని తీరు, సిఫార్సులు, న్యాయమూర్తుల నియామకం మొదలగు వన్నీ న్యాయ వ్యవస్థ స్వతంత్రతలో ప్రభుత్వ జోక్యానికి అద్దం పడుతున్నది.

లౌకిక విధానంపై దాడులు

భిన్న మతాలు, బహుళత్వం గల భారత దేశంలో రాజ్యాంగం 25 నుండి 28 వరకు గల నిబంధనలు పౌరుడికి మత స్వేచ్ఛను కల్పించాయి. రాజ్యాంగ నిర్మాతలు దేశంలో 'లౌకిక విధానం' ఉండాలని భావించారు. రాజ్యాంగ పీఠికలో 'లౌకిక' పదాన్ని చేర్చారు. గత ఐదేళ్లుగా సంఘ పరివార్ ఆలోచనకు అనుగుణంగా లౌకిక విధానంపై అనేక మంది కేంద్రమంత్రులు, బిజెపి పాలిత రాష్ట్రాలలోని మంత్రులు దాడులు చేస్తున్నారు. 'హిందూత్వ' ఆధిక్యత ఉండాలని వారు భావిస్తున్నారు. దేశంలో అనేక ప్రాంతాలలో గోరక్షక దళాల పేరుతో దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తున్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్ మొదలైన రాష్ట్రాలలో అనేక చోట్ల గొడ్డు మాంసం తింటున్నారనే పుకార్లను ప్రచారంలో పెట్టి ముస్లింలపై భౌతిక దాడులు చేసి మత విభజన తేవడానికి ప్రయత్నిస్తున్నారు. దాద్రిలో యాభై ఏళ్ల మహమ్మద్ అఖ్లాక్‌ను గొడ్డు మాంసం తింటున్నారనే తప్పుడు ఆరోపణలతో చంపివేయడం అత్యంత విషాదకరం. బిజెపి ఉత్తరప్రదేశ్ శాసనసభా ఎన్నికలలో 403 స్థానాలలో ముస్లింలకు ఒక్క సీటు కూడా కేటాయించక పోవడం వారి ఆలోచనా ధోరణిని తెలుపుతుంది. గోరక్షక దళాల దాడులకు సంబంధించి నరేంద్ర మోడీ ఒక్క దానిని కూడా ఖండించక పోవడం వాస్తవ పరిస్థితికి అద్దం పడుతోంది.

భావ ప్రకటనా స్వేచ్ఛ

రాజ్యాంగంలో 3వ భాగంలో గల ప్రాథమిక హక్కులు పౌరుడికి అనేక రక్షణలు కల్పించాయి. 19(ఎ) నిబంధన పౌరులందరికీ 'భావ ప్రకటనా స్వేచ్ఛ'ను కల్పించింది. కానీ గత ఐదేళ్లుగా భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసిన వారిపై భౌతికంగా దాడులు చేయడమేగాక, అనేక మందిని కిరాతకంగా హత్య చేశారు. సోషల్ మీడియా ద్వారా దాడులు చేస్తున్నారు. మహారాష్ట్రలో నరేంద్ర దభోల్కర్‌ను, ప్రజా ఉద్యమ నాయకుడు గోవింద పన్సారేను హిందూత్వ సనాతన సంస్థలు చంపివేశాయి. కన్నడ సాహితీవేత్త ఎంఎం కల్బుర్గిని ధార్వాడ్‌లో ఆయన ఇంటిలోనే హత్య చేశారు. కన్నడ పాత్రికేయురాలు, రచయిత్రి గౌరీ లంకేశ్‌ను చంపటం విషాదకరం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా భావాలు వ్యక్తం చేస్తున్న కవులు, కళాకారులు, సాహితీవేత్తలను బెదిరిస్తున్నారు.

ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో కన్నయ్య కుమార్‌పై కేసులు, ఇతర విద్యార్థులను వేధించడం, ప్రజాస్వామ్యయుత వాతావరణం లేకుండా చేయడం సంఘపరివార్ కుట్రలో భాగమే. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో రోహిత్ వేముల ఆత్మహత్య యూనివర్శిటీలలోని నియంతృత్వ వాతావరణాన్ని తెలుపుతుంది. భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడులు చేయడమంటే ప్రాథమిక హక్కులను హరించడమే.


పై వాటితో పాటు మోడీ పాలనలో రాజ్యాంగ, ప్రభుత్వ సంస్థల ధ్వంసం జరుగుతున్నది. ఆర్‌బిఐ స్వయం ప్రతిపత్తిపై దాడి, సిబిఐ పని తీరులో జోక్యం, యుజిసి రద్దుకు ప్రయత్నం మొదలగునవన్నీ దీనిలో భాగమే.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా పౌర సమాజంలోని మేధావులు, ప్రజాస్వామ్య వాదులు, లౌకిక వాదులు, అభ్యుదయ వాదులుగా మనమందరం రాజ్యాంగ మౌలిక స్వరూపంపై జరుగుతున్న దాడులను ఎదుర్కొందాం! రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం.

(రచయిత శాసనమండలి మాజీ సభ్యులు)


చర్చ

గోదావరి-పెన్నా అనుసంధానం, ప్రత్యామ్నాయాలు



గద్దె చలమయ్య

గోదావరి-పెన్నా అనుసంధానం పేరుతో గుంటూరు జిల్లా నకరికల్లులో గతేడాది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లిఫ్టు ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంలో ఈ పథకం ద్వారా నాగార్జున సాగర్ కుడి కాలువ కింద గుంటూరు జిల్లాలో 5,12,150 ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 4,49,081 ఎకరాలు స్వీకరించబడతాయని ప్రకటించారు. దీనికోసం గోదావరి నుంచి వరద వచ్చే కాలంలో పోలవరం కుడి కాలువ ద్వారా 7 వేల క్యూసెక్కుల నీళ్ళు కృష్ణా నదికి, అంటే ప్రకాశం బ్యారేజీ వద్దకు తరలిస్తారు. ప్రకాశం బ్యారేజీకి 21 కిలోమీటర్ల దూరంలో ఉన్న హరిశ్చంద్రపురం వద్ద నుంచి నకరికల్లు వద్ద లిఫ్టు ద్వారా సాగర్ కుడి మెయిన్ కాలువకు 7 వేల క్యూసెక్కుల నీటిని తరలించాలన్నదే పథక ఉద్దేశంగా పేర్కొన్నారు. అయితే కాలువ పొడవు 56.35 కిలోమీటర్లు. పైపుల పొడవు 10.25 కిలోమీటర్ల చొప్పున మొత్తం 66.60 కిలోమీటర్లు నీటిని తీసుకెళ్ళాల్సి ఉంటుంది. దీని కోసం ఐదు చోట్ల అంటే హరిశ్చంద్రపురం, లింగాపురం, తాళ్ళూరు, గంగిరెడ్డి పాలెం, నకరికల్లు వద్ద మోటార్లు ఏర్పాటు చేసి మొత్తం 146.66 మీటర్ల మట్టానికి పంపు చేయాల్సి వుంది. అంటే కాలువలు, పంపుల ఏర్పాటుకు 3,541 ఎకరాల భూమిని సేకరించాల్సి వుంది. మొత్తం పథకానికి అయ్యే ఖర్చు రూ.6020.16 కోట్లని అంచనా వేశారు.



200 మీటర్ల నుండి 800 మీటర్ల వెడల్పున అసాధారణమైన రీతిలో భూసేకరణ జరపాలని నిర్ణయించారు. ఇప్పటికే ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసి కాంట్రాక్టర్లకు పనిని అప్పగించింది. అయితే భూ సేకరణకు సంబంధించి చట్టపరమైన ప్రాథమిక చర్యలేమీ అనుసరించకుండానే కాంట్రాక్టు సిబ్బంది, రెవిన్యూ అధికారులు, రైతుల భూముల్లో పెగ్ మార్కింగ్ చేసి రాళ్ళు పాతారు. తమకు ఏ సమాచారం ఇవ్వకుండానే తమ పొలాల్లో ప్రవేశించి గుర్తులు పెట్టి రాళ్ళు పాతటాన్ని రైతులు అంగీకరించటం లేదు. పాతిన రాళ్ళను పీకి వేసి నకరికల్లు రైతులు రాస్తారోకోలు చేశారు. రాజుపాలెం, క్రోసూరు, పెదకూరపాడు, అమరావతి ప్రాంతాలలో, సర్వే కోసం వచ్చిన సిబ్బందిని సర్వే చేయనివ్వకుండా తిప్పి పంపించారు. ఈ సర్వేలో కొంతమంది రైతులు తమకు ఉన్న భూవసతిని కోల్పోవటాన్ని చూసి అసమ్మతిని వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 4వ తేదీన క్రోసూరు మండలం ఎర్రపాలెంలో భూమి కోల్పోతున్న రైతులంతా రాజకీయాలకు అతీతంగా సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో కొంత మంది రైతులు భూమి కోల్పోతున్న పరిస్థితిని వివరిస్తూ కంటతడిపెట్టారు. కొంత మంది రైతులు భూమిని ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. రాజధాని దగ్గరలోని గ్రామాలలోని రైతులు పూలింగ్‌లో మాత్రమే భూములు ఇస్తామని, బదులుగా రాజధాని ప్రాంతంలో నివాసం ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గన్నవరం ప్రాంతం విమానాశ్రయం కోసం భూములు కోల్పోయిన రైతులకు రాజధాని ప్రాంతంలో ప్లాట్లు కేటాయించటాన్ని వారు ఎత్తి చూపారు. జిల్లా కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించకుండా, తమ అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోకుండా భూసేకరణ చేస్తే సహించబోమని అన్నారు.

2013 భూసేకరణ చట్టంలోని సెక్షన్ 12 ప్రకారం ప్రాథమిక సర్వే జరపాలంటే సాగుదారులకు 60 రోజుల ముందస్తు నోటీసు ఇవ్వాలి. ఆ నిబంధనను పాటించకుండా పెగ్గింగ్ చేయటాన్ని అంగీకరించమని రైతులు చెప్తున్నారు. 2013 భూసేకరణ చట్టం, 'సాంఘిక ప్రభావం అంచనా, గ్రామ సభలు నిర్వహించటం, రైతుల అభ్యంతరాలను ఆహ్వానిస్తూ ప్రకటనలు చేయటం, నష్ట పరిహారం నిర్ణయించే అవార్డు విచారణలో రైతుల అభ్యంతరాలను ఆహ్వానిస్తూ నోటీసు ఇవ్వటం, రైతులకు నష్టపరిహారం పూర్తిగా ముట్టినట్లు సమ్మతి లేకుండా భూమి స్వాధీనం చేసుకోకూడదని, అందులో పనులు ప్రారంభించకూడద'ని నిర్దేశిస్తుంది. కానీ చట్టాన్ని అమలు జరపాల్సిన ప్రభుత్వం, అధికారులు బలవంతంగానైనా భూములు తీసుకుంటామని, ఎదురు తిరిగితే ఏమీ ఇవ్వకుండానే తీసుకుంటామని రైతులను బెదిరిస్తున్నారు. ఈ వైఖరి ప్రభుత్వానికి తగదు.

ఈ పథకానికి ప్రత్యామ్నాయం

వరద కాలంలో గోదావరి నుంచి వచ్చే నీటికి ప్రకాశం బ్యారేజీ వద్ద నిల్వ చేసే వసతి లేదు. ముందు పోలవరం కుడి కాలువను 27500 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా చూడాలి. ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరిన నీటిని పులిచింతల రిజర్వాయర్‌కు తరలించాలి. పులిచింతలలో 45 టిఎంసి నీళ్ళను నిల్వ చేసుకునే అవకాశం ఉన్నందున పంట కాలానికి అవసరమయ్యేలా అక్టోబర్, నవంబర్ మాసాలలో కూడా నీరు నిల్వ చేసుకోవడానికి పులిచింతల రిజర్వాయర్ తోడ్పడుతుంది. పులిచింతల రిజర్వాయర్ నుంచి బ్యాక్ వాటర్‌ను తంగెడ వద్ద లిఫ్టు పెట్టి 32 కిలోమీటర్ల దూరంలో ఉన్న కారంపూడి వద్ద సాగర్ కుడి మెయిన్ కాలువకు తరలించవచ్చు. ఈ ప్రత్యామ్నాయం వలన నాగులేరు కూడా ఉపయోగపడుతుంది. సేకరించాల్సిన భూమి తగ్గుతుంది. పల్నాడులో కుడికాలువ కలిసే చోట రెగ్యులేటర్ నిర్మిస్తే పల్నాడుతో సహా సాగర్ కుడి కాలువ కింద ఉన్న గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 11 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. పులిచింతల రిజర్వాయర్ నుంచి 10 వేల క్యూసెక్కుల నీటిని 90 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోయాల్సి ఉంటుంది. ఇది ఈ పథకానికి ఉత్తమమైన ప్రత్యామ్నాయం అవుతుంది.

1.ఇప్పటికే సాగర్ కుడి కాలువకు 132 టిఎంసిల నికర జలాల కేటాయింపు హక్కు ఉండగా సాగర్‌లో నీరు అందుబాటులో లేనప్పుడు మాత్రమే గోదావరి నీరు ఇస్తారా? 2.లేక 132 టిఎంసిల హక్కును రద్దు చేసి అత్యంత వ్యయప్రయాసాలతో కూడిన సాగర్ రైతులను ఆధారపడమంటారా? 3.ఇప్పుడు ఎకరాకు 200 రూపాయల నీటి తీరువాతో సాగర్ నీళ్ళు లభిస్తున్నప్పుడు అదే పన్నుతో గోదావరి నీళ్లు లభిస్తాయా? ఈ సందేహాలను ప్రభుత్వం తీర్చవలసిన అవసరం ఉంది. 4.గోదావరి-పెన్నా అనుసంధానం పథకాన్ని 2016 అక్టోబరులో అధ్యయనం చేసిన కేంద్ర ప్రభుత్వ సంస్థ వాప్కోస్ నివేదిక ప్రకారం వారు సూచించిన నాలుగు ప్రత్యామ్నాయాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకం లేనే లేదు. ఈ నేపథ్యంలో గోదావరి-పెన్నా అనుసంధానం జరుగుతుందని ప్రభుత్వం చెప్పే కథనాలు అనేక అనుమానాలను కలుగజేస్తున్నాయి. గత మూడేళ్ళుగా సాగర్‌కు నీళ్ళు లేనప్పుడు ఒక్కసారి కూడా సమీక్ష జరపని ప్రభుత్వం పాలనా కాలంలోని ఆఖరి అంకంలో ఈ పథకాన్ని రంగం మీదకి తేవటంలోని ఆంతర్యాన్ని పరిశీలించాల్సి ఉంది.

(రచయిత రైతుసంఘం పశ్చిమ గుంటూరు జిల్లా అధ్యక్షులు, సెల్ : 9490098652)

కామెంట్

గణతంత్ర స్ఫూర్తిని కాపాడుకుందాం

హిందూత్వ అజెండాతో పెచ్చరిల్లుతున్న నియంతృత్వ ధోరణి రాజ్యాంగం లోని ఏ కోణాన్నీ, ఆ పరిధిలోని వ్యవస్థలను వదిలి పెట్టటం లేదు. అన్ని వ్యవస్థలు కునారిల్లిపోతున్నాయి. గణతంత్ర దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో మన దేశంలో అల్లుకున్న తాజా పరిస్థితులు అందరినీ ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ లౌకిక వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక, ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉధృత పోరాటం చేసేందుకు మనం కృతనిశ్చయులం కావాలి. 2020 గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రస్తుత ప్రభుత్వ ఆధ్వర్యంలో కాక లౌకిక ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుపుకుందాం.

నేటి గణతంత్ర దినోత్సవ వేడుకలకు భారత్ సిద్ధమవుతోంది. 1950లో సరిగ్గా ఇదే రోజున భారత్‌ను సర్వసత్తాక ప్రజాస్వామిక వ్యవస్థ (రిపబ్లిక్)గా ప్రకటించిన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. రిపబ్లిక్ అంటే రాచరిక వ్యవస్థ కాదు. ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థ. అంటే ప్రజలే పాలకులు. రాజ్యాంగం భారత్‌ను లౌకిక ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా ప్రకటించింది. అయితే ఐదేళ్ల క్రితం 2014లో మోడీ సర్కారు అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుండి రాజ్యాంగం, రాజ్యాంగ వ్యవస్థలు అనేక దాడులకు గురవుతున్నాయి. ప్రస్తుతం రాజ్యాసభ ముంగిట వున్న పౌరసత్వ (సవరణ) చట్ట బిల్లును ఇందుకు తాజా ఉదాహరణగా చెప్పవచ్చు. నిర్దిష్ట మత ప్రమేయం ఆధారంగా పౌరసత్వాన్ని కల్పించే ఈ సవరణ బిల్లు పౌరసత్వ మౌలిక భావననే సమూలంగా మార్చివేస్తోంది. అందువల్లే ఈ బిల్లుకు అసోంతో పాటు ఈశాన్య రాష్ట్రాలన్నింటిలో తీవ్ర స్థాయిలో ప్రజా వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. చట్టంలో ప్రతిపాదిస్తున్న ఈ మార్పుతో ఇక్కడ స్థానిక కమ్యూనిటీల గుర్తింపు ప్రమాదంలో పడుతోంది.

రాజ్యాంగం స్వతంత్ర న్యాయ వ్యవస్థను మనకు ప్రసాదించింది. ఉన్నత న్యాయ వ్యవస్థ అత్యంత సమగ్రమైనది. కానీ ప్రస్తుత మోడీ సర్కారు న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని తుంగలో తొక్కుతూ వ్యవస్థ వెన్నెముక విరిచేస్తోంది. ఇందుకు మోడీ సర్కారు రెండు మార్గాలను ఎంచుకుంది. మొదటిది సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకంలో జోక్యం చేసుకోవటం. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన నియామక సిఫార్సులను తిరస్కరించటం లేదా జాప్యం చేయటం వంటి చర్యలపై మోడీ సర్కారు కన్నేసింది. ఇక రెండోది కోర్టులు వెలువరించిన తీర్పులు తమకు అనుకూలంగా లేకపోతే వాటిని అమలు చేయబోమని ప్రకటించింది. ఇందుకు శబరిమల తీర్పు తాజా ఉదాహరణ. అయోధ్య లోని వివాదాస్పద భూమికి సంబంధించి తమకు సానుకూల నిర్ణయం తీసుకోవాలంటూ ఆరెస్సెస్-బిజెపి కూటమి, పలువురు కేంద్ర మంత్రులు సుప్రీంకోర్టుపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజ్యాంగ వ్యవస్థ పరిధిలో సైనికులు రాజకీయాలలో జోక్యం చేసుకోవటం నిషిద్ధం. అయితే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం సైనిక దళాలను సైతం తన రాజకీయ అజెండా లోకి లాగేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకు సంబంధించి ప్రస్తుత సైన్యాధిపతి అనేక రాజకీయ ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఇందులో జమ్మూ కాశ్మీర్, లేదా ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించిన అంశాలు కూడా వుంటున్నాయి. ఈ ధోరణిని కనుక ప్రోత్సహిస్తే ఇది అత్యంత ప్రమాదకర పరిణామాలకు దారి తీస్తుంది. అంతేకాదు సైనిక దళాల సమగ్రతను దెబ్బతీస్తుంది.

ప్రజాస్వామిక రాజ్యాంగానికి ప్రధాన మైన లౌకిక ఛత్రంపై తీవ్ర స్థాయిలో దాడి జరుగుతోంది. రాజ్యాంగ సవరణ గురించి మాట్లాడటంతో పాటు రాజ్యాంగంలో పొందుపర్చిన మౌలిక సూత్రాలను కూడా తుంగలో తొక్కేందుకు బిజెపి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. ఇటీవల ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలు ఆవును 'దేశ మాత'గా ప్రకటించాలంటూ తీర్మానాలు ఆమోదించాయి. మత విశ్వాసాల ప్రకారం గోవుకు వున్న పవిత్ర స్థానంతో ఇప్పుడు దేశ మాతగా మారుతోంది. ఆరెస్సెస్-హిందూత్వ శక్తులు ఇదే మార్గంలో పయనిస్తే ఆవుకు



రాజ్యాంగంలో సాధారణ పౌరులకన్నా అత్యుత్తమ హోదా లభించటం ఖాయం.

దేశంలో వున్న ప్రకృతి వనరులను ప్రైవేటీకరించి బడా వ్యాపార సంస్థలకు ప్రయోజనం చేకూర్చేందుకు మోడీ సర్కారు విపరీత చర్యలకు పూనుకుం టోంది. ఇది దాదాపుగా రిపబ్లిక్ దేశాన్ని ప్రైవేటీకరించటమే అవుతుంది. దేశ ప్రజల కష్టార్జితాన్ని పణంగా పెట్టి కొద్దిమందిని ధనవంతులను చేసే ప్రక్రియ ఇటీవలి కాలంలో పతాక స్థాయికి చేరుకుంది. దేశంలో సంపద, అసమానతలపై ఆక్స్‌ఫామ్ సంస్థ వెల్లడించిన తాజా నివేదిక ప్రకారం దేశం లోని 9 మంది శత కోటీశ్వరుల చేతుల్లో సగం సంపద కేంద్రీకృతమైంది. జాతీయ సంపదలో 77.4 శాతం మేర సంపద టాప్ టెన్ ధనవంతుల జేబుల్లో వుంది. దేశం లోని 119 మంది శత కోటీశ్వరుల రోజువారీ ఆదాయం రు.2,200 కోట్ల పైమాటేనని ఆక్స్‌ఫామ్ నివేదిక చెబుతోంది. ఇది రాజ్యాంగంలో పొందుపర్చిన ఆదేశిక సూత్రాలను నీరుకారుస్తోంది. దేశంలో ప్రజల సంపద, వనరులపై అజమాయిషీ, అదుపుతో దానిని ఉమ్మడి ప్రయోజనాలకు వినియోగించాలని ఆదేశిక సూత్రాలు చెబుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ నిర్వహణ కారణంగా సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతం కారాదన్నది రాజ్యాంగ మౌలిక సూత్రం. సంపద కేవలం కొందరి చేతుల్లో మాత్రమే కేంద్రీకృతం కావటం ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో భాగమే. ఇది రాఫెల్ ఒప్పందం విషయంలో తేటతెల్లమైంది. ఈ ఒప్పందంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుందన్న విషయాన్ని మోడీ సర్కారు పలుమార్లు తోసిపుచ్చినా, వెలుగులోకి వచ్చిన ఆధారాలు ఈ విషయాన్ని గట్టిగా మన కళ్లకు కడుతు న్నాయి. హిందూ పత్రిక ఇటీవల వెలువ రించిన కథనం ఇందుకు సజీవ సాక్ష్యం. పటిష్టమైన జాతీయ సార్వభౌమత్వం, స్వాతంత్ర్యం, స్వాతంత్ర్యోద్యమం మనకిచ్చి న బలమైన వారసత్వం. మోడీ సర్కారు అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించుకున్న తరువాత మన దేశ సార్వభౌమత్వానికి తీవ్ర స్థాయిలో గండి పడింది. దేశ స్వాతంత్ర్య పోరాటం కానీ, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట చరిత్ర కానీ లేని ఒక రాజకీయ పార్టీ తన సిద్ధాంతాల పేరుతో భారత సైనిక దళాలు, వ్యూహాత్మక ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడు తోంది. అమెరికా యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలను భారత స్థావరాల నుండి ఆపరేట్ చేయటానికి అనుమతించటంలో మోడీ సర్కారు ఎటువంటి సంకోచం లేకుండా వ్యవహరిస్తోంది.

హిందూత్వ అజెండాతో పెచ్చరిల్లు తున్న నియంతృత్వ ధోరణి రాజ్యాంగం లోని ఏ కోణాన్నీ, ఆ పరిధిలోని వ్యవస్థలను వదిలి పెట్టటం లేదు. అన్ని వ్యవస్థలు కునారిల్లిపోతున్నాయి. గవర్నర్ల వంటి రాజ్యాంగ పదవుల్లో వున్న వ్యక్తులు రాజ్యాంగ వ్యతిరేక ధోరణులతో వ్యవహరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర యూనివర్శిటీలకు చెందిన కొందరు వైస్ ఛాన్స్‌లర్లు లౌకిక, ప్రజాస్వామిక వ్యతిరేక ధోరణతో వ్యవహరిస్తున్నారు. హిందూత్వ అనుకూల అభిప్రాయాల రికార్డుతో వున్న సిబిఐ ప్రస్తుత తాత్కాలిక అధిపతి ఇందుకు తాజా ఉదాహరణ. ఇంకా చెప్పుకుంటూ పోతే ఈ జాబితా కొండవీటి చాంతాడంత వుంటుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొంతు విప్పిన మేధావులను జాతి వ్యతిరేకులని ముద్ర వేయటం, దేశద్రోహ నేరాలు బనాయించటం వంటి చర్యలతో ప్రజల ప్రాథమిక హక్కులపై దాడులు నిరంతరాయంగా కొనసాగుతూనే వున్నా యి. గో గూండాయిజం, మూక హత్యల ఘటనలు చట్టం నుండి తప్పించుకుంటు న్నాయి. గణతంత్ర దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో మన దేశంలో అల్లుకున్న తాజా పరిస్థితులు అందరినీ ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ లౌకిక వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక, ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉధృత పోరాటం చేసేందుకు మనం కృతనిశ్చయులం కావాలి. ప్రజాస్వామ్య, రాజ్యాంగ, లౌకిక విలువలను కోరుకునే ప్రజలకందరికీ ఇది అనివార్యం. 2020 గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రస్తుత ప్రభుత్వ ఆధ్వర్యంలో కాక లౌకిక ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుపుకుందాం.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)



ప్రవేశిక దాటని గణతంత్రం!

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి ఈ రోజు 64వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. కానీ, మనల్ని మనం పరిపాలించుకోవడమనే .. గణతంత్ర భావన ఆచరణాత్మకంగా రాజ్యాంగ ప్రవేశిక దాటి ముందుకు కదలడం లేదు. రాజ్యాంగానికి హృదయం ప్రవేశిక. ఆ హృదయాన్ని పాలకులు, పెట్టుబడిదారులు, మతతత్వశక్తులు తమ అప్రజాస్వామిక విధానాలతో తునాతునకలు చేసేస్తుంటే... ఆవేదనతో తల్లడిల్లే పరిస్థితులు అడుగడుగునా ఎదురవుతూనే ఉన్నాయి. ఎంతోమంది త్యాగధనులు తమ జీవితాలను తృణప్రాయంగా త్యజించి, సాధించిన స్వరాజ్యం.. కొద్దిమందికే ఫలితమిస్తూ, అసంఖ్యాక ప్రజలకు కష్టాలెందుకు అన్న అంశంపై నేటి 'జీవన' ఫోకస్.

ఆరున్నర దశాబ్దాలకు చేరువవుతున్న ఈ గణతంత్రం నాటికీ మహిళలు, దళిత, బహుజనులు, మైనార్టీలు ఇంటా బయటా ఎదుర్కొంటున్న సమస్యలకు అంతులేకుండా పోతోంది. రాజ్యాంగ స్ఫూర్తిని, సగటు భారతీయుడి ఆర్తినీ పట్టించుకోని పాలకుల వల్లే ఇంకా కనీస అవసరాలు కూడా తీరని దుస్థితిలో అనేకమంది కునారిల్లుతున్న పరిస్థితి! గద్దెనెక్కిన పెద్దలు రాజ్యాంగాన్ని చెత్తబుట్టలోకి విసిరేసి, తమ సొంత లాభాలార్జిస్తూ మత, కుల భావాలతో ముందుకు సాగుతున్నారు. అందుకే స్వాతంత్ర్యం పొందిననాటికి ఉన్న సమస్యలెన్నింటినో అలాగే ఉంచి, స్వార్థ ప్రయోజనాలు పొందడంలో పాలకులు పోటీపడుతున్నారు.

అడుగడుగునా అసమానత్వం

'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, గణతంత్రం' అనే పదాలు చెప్పుకోవడానికీ.. వినడానికీ.. చాలా బాగుంటాయి. వీటికి విస్తృత అర్థాలను రాజ్యాంగం ఇస్తోంది. సుప్రీం కోర్టు ఈ భావనలకు ప్రాధాన్యతనిస్తోంది. ఇటీవల పురుషులతో పాటూ మహిళలకూ కేరళ శబరిమల ఆలయంలోకి అడుగుపెట్టొచ్చంది. సమానత్వం అనే భావనకు అది నిదర్శనమంటూ స్పష్టమైన తీర్పుని ప్రకటించింది. కేరళ రాష్ట్రప్రభుత్వమూ లింగవివక్షకు వ్యతిరేకంగా సమానత్వాన్ని అమలు చేస్తోంది. అంతే... దేశవ్యాప్తంగా ఉన్న కొన్ని మతశక్తులు దీనిని అవకాశంగా ఉపయోగించుకుని, మహిళలపై ఎన్నో రకాల దాడులకు పాల్పడ్డాయి. అయినా సరే వారి దాడులకు భయపడకుండా ఇప్పటివరకూ 51 మంది మహిళలు వెళ్లొచ్చారు. అయినా, మహిళలను, హేతువాదుల్ని లక్ష్యంగా చేసుకుని పాలకుల అండతో జరుగుతున్న దౌర్జన్యాలు, దాడులు ఏమాత్రం తగ్గలేదు. గౌరీలంకేష్, దబోల్కర్, కల్బుర్గీ వంటి హేతువాద, ప్రజాస్వామ్యశక్తులపై హత్యాకాండలు ఇది రాజ్యాంగబద్ధ పాలన కాదనే నిజాన్ని స్పష్టం చేస్తున్నాయి.

చతికిలబడిన సార్వభౌమత్వం


'ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజలే ప్రభువులు' అని ఎన్నో ఏళ్ల నుంచీ వింటున్నాం. కానీ పాలకులు తమకు పెట్టుబడులు సమకూర్చే కార్పొరేట్ పెద్దల్నే ప్రభువులుగా పరిగణిస్తున్నారు. ప్రజలకోసమని ముసుగేసి తీసుకొచ్చే చట్టాలు, చేసే సంస్కరణలన్నీ కార్పొరేట్ శక్తులు మరింత బలాన్ని పుంజుకోవడానికే ఉపకరిస్తున్నాయి. గడచిన నాలుగున్నరేళ్లలో దేశం మొత్తం ప్రజల సంపద తొమ్మిదిమంది సంపన్నుల దగ్గరే పోగుపడిందన్నది చేదు వాస్తవం. ఈ దేశంలో సార్వభౌమత్వం అనే భావనకు ఇది సవాల్‌గా మారింది. దేశ రక్షణకు అవసరమయ్యే యుద్ధ విమానాల తయారీ దేశ, విదేశీ కార్పొరేట్‌శక్తుల చేతుల్లోకి వెళ్లడమే అందుకు నిదర్శనం. సార్వభౌమత్వమనే 'సర్వోన్నత అధికారం' దేశ పౌరుల చేతుల్లోంచి ఎప్పుడో దూరమైపోయింది. 'దేశం అంతర్లీనంగా సర్వోన్నత అధికారాన్ని, బాహ్యంగా విదేశీ, దౌత్యవిధానాల్లో స్వేచ్ఛను కలిగి ఉంటుంది. ఏ బాహ్యశక్తి మన విదేశాంగ విధానాన్ని నియంత్రించలేదు' అనే ఉదాత్తభావాన్ని పాలకులు నీరు కార్చుతున్నారు.

ఓటు ప్రజలది.. అధికారం వేరొకరిది

రాజ్యాంగ నిర్మాతలు ప్రవేశికలో గొప్ప భావజాలాన్ని ప్రయోగించారు. 'భారత ప్రజలమైన మేము' అని ప్రవేశిక ప్రారంభమవుతుంది. ప్రజలే రాజకీయ అధికారానికి మూలం, వారే రాజ్యాంగాన్ని రచించుకున్నారనే అర్థంతో దీన్ని ప్రయోగించారు. భారతదేశం ఏ తరహా రాజకీయవ్యవస్థను ఏర్పరచుకుంటుందో, దాని స్వభావం ఏమిటో కొన్ని ప్రత్యేక పదాల ద్వారా స్పష్టంగా పేర్కొన్నారు. అయితే కేవలం ఓట్లేసే హక్కు మాత్రమే ప్రజల దగ్గర ఉంది. దానినీ కులం, మతం, మద్యం, డబ్బు, హామీల ఎరలు వేసి, విచ్చలవిడిగా కొనుగోళ్లు చేస్తూనే ఉన్నారు. చట్టసభల్లోనూ ఎక్కువశాతం మంది నేరచరితులు, కోటీశ్వరులు మాత్రమే అడుగుపెడుతున్నారు. సామాన్య జనానికి పోలింగ్‌బూత్ వరకూ వెళ్లిరావడానికి, స్వేచ్ఛగా ఓటేయడానికి ఎన్నో ప్రతిబంధకాలు ఎదురయ్యే నేటి పరిస్థితుల్లో సామాన్యులు, ప్రజాహితులు చట్టసభలకు వెళ్లడమన్నది కలగానే మిగిలిపోతోంది.

సమసమాజం.. అదెంతదూరమో?

42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976లో సామ్యవాదం అనే పదాన్ని ప్రవేశికలో చేర్చారు. దీని ధ్యేయం సమసమాజ స్థాపన. ప్రజల మధ్య ఆర్థిక అంతరా లను క్రమం గా తగ్గించడం. ఉత్పత్తి శక్తులను ప్రభుత్వం నియంత్రించడం ద్వారా సంపద కొద్ది మంది వ్యక్తుల చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా సాధ్యమైనంతవరకూ జాతీయం చేయడం. ఈ విధంగా ప్రజలకు సమాన అవకాశాలతోపాటు వాటిని అందిపుచ్చుకోవడానికి అవసరమైన తోడ్పాటును కలిగించాలి. కానీ పాలకులు దీనికి వ్యతిరేకమైన విధానాలతో ప్రజలందరి సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమయ్యేలా కృషిచేస్తూ తమ ఫలితాలను పొందుతున్నారు. ప్రపంచీకరణ, ఆర్థిక ఉదారవాదం, ప్రైవేటీకరణ నేపథ్యంలో సామ్యవాదతత్వం మసకబారుతోంది. కోట్లాది రూపాయల సంపాదన అంబానీలు, అదానీలు వంటి వాళ్ల గుప్పిట్లోకి చేరుకుంటోంది.



మాయమవుతున్న లౌకికతత్వం

పాలకులు, రాజకీయపార్టీలు ఓట్ల వ్యామోహాల్లో కుల, మత అజెండాలతో లౌకితత్వాన్ని కూకటివేళ్లతో పెకలించేస్తున్నాయి. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 'లౌకికతత్వం' అనే భావనని ప్రవేశికలో చేర్చారు. లౌకికరాజ్యం అంటే మత ప్రమేయం లేని రాజ్యం. పాలకులకు అధికార మతం ఉండకూడదు. మతవివక్ష ఉండకూడదు. మతం విషయంలో పౌరులకు స్వేచ్ఛ, సమానత్వం ఉండాలి. మతపరంగా ఎవరికీ ఎలాంటి ప్రత్యేక ప్రయోజనం కానీ, నష్టం కానీ వాటిల్లదు. కానీ ఈ భావనని ఎన్నో ఏళ్ల నుంచీ పాలకులు, రాజకీయపక్షాలు భ్రష్టు పట్టించేసి 'అన్ని మతాలనీ సమానంగా ఆదరించడమే లౌకికతత్వం'గా తప్పుడు నిర్వచనాల్చి వాటిని ప్రచారంలో పెట్టాయి. లౌకిక అంటే 'మతరహిత' అనే భావనకు బదులు 'మతసహిత' అనే తప్పుడు అర్థాన్ని జనంలోకి తీసుకెళ్లాయి. వామపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు మినహా మిగిలిన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాన్ని ఆదర్శంగా తీసుకుని, మత అజెండాలతోనే పాలిస్తూ లౌకికతత్వాన్ని పరిహసిస్తున్నాయి.

ప్రజల చేతుల్లో లేని అధికారం

"ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఏర్పాటు చేసుకునే పాలనే ప్రజాస్వామ్యం" అని అబ్రహం లింకన్ నిర్వచించిన ప్రజాస్వామ్యం అనే

భావననీ రాజ్యాంగ ప్రవేశికలోనే పేర్కొన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా కేవలం నిర్ణీత వయసు పౌరులందరికీ ఓటుహక్కు, ప్రభుత్వ పదవులకు పోటీ చేసే హక్కును కల్పించారు. పాలన చట్టబద్ధంగా ఉంటుంది. చట్టబద్ధత లేకుండా ఏ చర్యా చెల్లుబాటు కాదు. ఏ వ్యక్తికీ ప్రత్యేకహోదా లేదా మినహాయింపు ఉండదు.. అనేది ఇందులో కీలకం. అయితే రాజ్యాంగ పదవులు, రాజకీయాలు వంటివాటిని వారసత్వంగా కొద్దిమందికి మాత్రమే పరిమితం కావడం, వారి చేతుల్లో పోగుపడిన సంపదలు, మద్యం వంటి ప్రలోభాలతో ప్రజల దగ్గర ఓట్లు కొనుగోలు చేయడం.. గెలిచిన తర్వాత బాగా సొమ్ము ముట్టజెప్పే పార్టీకి అమ్ముడుపోవడం ప్రజాప్రతినిధులకు నిత్యకృత్యమైంది. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యం అనే భావనకు ప్రహసనంగా మారింది.

గడ్డుపరిస్థితుల్లో గణతంత్రం


'గణం' అంటే ప్రజలు, 'తంత్రం' అంటే పాలన. ఇదే ప్రజాపాలన. వారసత్వ అధికారాలు ఉండవు. భారత రాష్ట్రపతి తదితరులను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నిర్ణీత కాలానికి ప్రజలే ఎన్నుకుంటారు. బ్రిటిష్ రాణి లేదా రాజుకు ఉన్నట్లు వారసత్వ అధికారం ఉండదు. కానీ దానికి భిన్నంగా ఇప్పటి పాలకులు వారసత్వ రాజకీయాలను అమలు చేస్తుండడంతో గణతంత్ర భావనకు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ధనం, కులం, మతం వంటి బలాలు లేని సామన్యజనం పార్లమెంటులోకి కాదు కదా, పంచాయతీ వరండాలోకీ వెళ్లలేకపోతున్నారు.

ఈ పరిస్థితి మారి.. గణతంత్రం అనే అసలు అర్థం ఆచరణలోకి రావాలంటే- ప్రజాచైతన్యం వెల్లువెత్తాలి. ఉదాత్తమైన రాజ్యాంగ విలువలూ, సమానత్వ భావన, ప్రజలకు అధికారం ... అందుబాట్లోకి రావాలి. ఈ విలువలకు గండి గొడుతున్న శక్తులను నిలువరించాలి. జనచైతన్యం తప్ప దానికి మరో దారి లేదు.

- బెండాళం క్రిష్ణారావు

ఉదాత్త ఆశయాల కోసం నిలబడితే సంకెళ్లా?

ప్రవేశికలో పొందుపర్చిన కొన్ని ఉదాత్తమైన ఆశయాలను రాజ్యాంగం ద్వారా సాకారం చేసుకోవడానికి రాజ్యాంగ నిర్మాతలు రూపకల్పన చేశారు. వాటిలో మొదటిది రాజకీయ న్యాయం. పౌరులంతా ఎలాంటి వివక్ష లేకుండా రాజ్య కార్యకలాపాల్లో పాల్గొనవచ్చు. సార్వజనీన ఓటు హక్కు, పోటీచేసే హక్కు, ప్రభుత్వ పదవులు చేపట్టే హక్కు, ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు, విజ్ఞాపన హక్కు మొదలైనవాటిని రాజకీయ న్యాయ సాధనకు ప్రాతిపదికలుగా పేర్కొన్నారు. అయితే ధనస్వామ్య రాజకీయాల్లో ఆ పరిస్థితి తారుమారైంది. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి వంటి వారి పర్యటనలు ఎక్కడైనా జరిగితే ముందస్తుగానే ప్రగతిశీల, ప్రజాస్వామ్య వాదుల నోళ్లని బలవంతంగా నొక్కేస్తున్నారు. గృహనిర్బంధాలకు, రహస్య ప్రదేశాల్లో నిర్బంధించడానికి రకరకాల కొత్త చట్టాలనూ, తప్పుడు కేసుల్నీ తెరమీదకు తీసుకొచ్చి వాటితో రాజకీయ వివక్షని నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు. రెండోదైన సామాజిక న్యాయంలో సమాజంలో పౌరులందరూ సమానులే. జాతి, మత, కుల, లింగ వివక్ష లేకుండా అందరికీ సమాన హోదా, గౌరవాన్ని కల్పించాలి. అన్నిరకాల సామాజిక వివక్షలను రద్దు చేసి, సామాజికంగా వెనుకబడిన వర్గాలు, కులాలు, తెగల అభ్యున్నతికి పాలకులు కృషి చేయాలని చెప్పారు. దీనికి భిన్నంగా అన్నిరకాల వివక్షలనూ పాలకులు ఎగదోస్తుండడం సహజమైన అంశంగా మారింది. దీనిని ప్రశ్నించే వారిపై అక్రమ నిర్బంధాలు, దౌర్జన్యాలు, హత్యలు సర్వసాధారణం అయిపోయాయి.



ఆర్థిక అంతరాలను తగ్గించడానికి పేర్కొన్న భావనే ఆర్థిక న్యాయం. సంపద ఉత్పత్తి, పంపిణీ, వృత్తి, ఉద్యోగాల్లో అందరికీ సమాన అవకాశాలుండాలి. పేదరికాన్ని నిర్మూలించి, ప్రజలను ఆకలి నుంచి విముక్తి చేయాలి. జీవించడానికి అనువైన పరిస్థితులు కల్పించడమే ఆర్థిక న్యాయం ఆదర్శమని ప్రకటించారు. కానీ ప్రభుత్వాలు ఆశ్రిత పెట్టుబడిదారులకు తప్పా ప్రజలకు ఆర్థిక పరిపుష్టి కలిగించే పరిస్థితిలో లేవు. అందువల్ల కోట్లాదిరూపాయల ప్రజాధనం కొద్దిమంది కార్పొరేట్ పెట్టుబడిదారుల పరమైంది. అసంఖ్యాక ప్రజలు పేదరికంలో మగ్గిపోతున్నారు. దీనిపై నిలదీసేవారిని అర్బన్ నక్సలైట్‌గా ముద్రవేసి, పాలకులు అక్రమంగా నిర్బంధించి.. రాజ్యాంగ స్ఫూర్తినే సమాధి చేసేశారు.




మా కోడలు మారదా?

సైకాలజీ

నన్ను మా కోడలు ఇంట్లో ఉండటానికి వీల్లేదంటోంది. నేనుంటే తను వెళ్లిపోతానంటోంది. నా కొడుకూ ఎన్నో విధాలా చెప్పి చూశాడు. మా అమ్మ ఇక్కడే ఉంటుందనేసరికి, మా కోడలు బ్యాగు సర్దుకుని బస్టాండ్‌కి వెళ్లిపోయింది. నా కూతురు నన్ను చూసుకుంటానంటోంది గానీ, నాకు వాళ్ల దగ్గర ఉండటం ఇష్టం లేదు. నా పెన్షన్‌తో వేసే చిట్టీ డబ్బులు మాత్రం పాడగానే తీసుకుంటారు. నేను మాత్రం అక్కర్లేదు. నేనేం చేయాలి?

- భారతి, శ్రీకాకుళం



మీకు, కోడలికి మొదటి నుంచి సత్సంబంధాలు ఉన్నాయా? లేదా? వాళ్ల పెళ్లయినప్పటి నుంచి మీరంతా కలిసి ఉంటున్నారా? విడిగి ఉంటున్నారా? మీ ఇద్దరి మధ్యా అనుబంధంలో ఏమాత్రం స్థిరత్వం ఉన్నది? ఇలాంటి విషయాలేవీ మీ ఉత్తరం సూచించట్లేదు. ఇకపోతే పెళ్లయినప్పటి నుంచి మీ ఇద్దరి మధ్యా జరిగిన గొడవలుగానీ, పరస్పర సహకారంకానీ ఎలా ఉందనేది ఉత్తరంలో సూచించలేదు. తన వ్యవహారశైలి మీకు కచ్చితంగా తెలిసి ఉంటే మీరు తీసుకున్న జాగ్రత్తలు ఏమిటి?ఒకవేళ ఇలాంటి పరిస్థితే వస్తే ఏవిధంగా పరిష్కారం పొందవచ్చో విడివిడిగా కానీ, ఎప్పుడైనా కలిసి కానీ, ఆలోచించుకున్నారా? మీరు అక్కర్లేదు అనుకునే వ్యక్తి ఉన్నట్టుండి మీతో తిరిగి కలిసి ఉండడం అనేది త్వరలో జరగకపోవచ్చనేది మీకు ఈపాటికి అవగాహన అయి ఉండొచ్చు. అలాంటప్పుడు మీకు అటు రక్షణ కలిగించేదిగానూ, మరొకవైపు మీ స్వతంత్ర జీవనానికి అడ్డు కలగకుండానూ, ఉండే మధ్యమార్గమేదో మీరు ఆలోచించుకోండి. ఇందులో బాధ్యత వహించే పిల్లలిద్దరూ అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకోండి. మీ ఆత్మాభిమానం దెబ్బతినకుండా మధ్యమార్గంగా వీరు ఏం చేయగలరు అనేది ఆలోచించి చూడండి. అలాగే బాధ్యత వద్దు అనుకున్నప్పుడు మీ ఆర్థిక స్వతంత్రం తాలుకూ హక్కుల్నీ వాళ్లు అనుభవించలేరనే విషయాన్ని ఇద్దరు పిల్లలకు, వారి కుటుంబానికి స్పష్టం చేయండి. మీ అవసరాలకు, మీ ఆర్థిక స్వావలంబనని ఉపయోగించుకుంటూ భవిష్యత్తవసరాలకు తగ్గట్టు కొంతమేర సేవింగ్స్ కూడా చేసుకుంటూ కొడుకూ, కూతురు.. వారి వారి బాధ్యతలు మీ పట్ల నిర్వహించడానికి మీ మనసు తలుపు తెరవండి. అదే సమయంలో మీకు నచ్చిన వ్యాపకాలలో, ఇష్టమైన కాలక్షేపాలలో మీ మనసుని లగ్నం చేసుకోండి. మీరు ఇతరులకు ఎంత సహాయం చేయగలరో మీ పరిధిలో మీరు చేసుకోండి. మీ స్వతంత్ర ప్రతిపత్తికి లోటు రాకుండా చూసుకోండి.. ఉద్వేగం స్థానంలో తర్కాన్ని నిలిపి, మీకున్న వనరులతో మీరు ఏవిధమైన సహాయాన్ని ఎవరి వద్ద నుండి పొందగలరో ఆలోచించుకోండి. మీరు కేవలం వారి మీదనే ఆధారపడి లేరనే విషయాన్ని ముందు మీకు మీరు రుజువు చేసుకోండి. అటుపై అది కుటుంబసభ్యులకీ తేటతెల్లం అవుతుంది. అనంతరం మీరు తనకి భారం కాదు అనే విషయం వాళ్లకి అర్థమైతే.. వాళ్లల్లో మార్పు వస్తే.. అటుపై వారిని క్షమించడానికి మీ మనసులో ఎంతమటుకు సంసిద్ధత ఉందో.. ఆలోచించుకోండి.


డాక్టర్ పద్మజ, సైకాలజిస్టు



మీకోసం

ప్రతిరోజూ నీటిలో తులసి ఆకుల్ని వేసుకుని తాగితే గొంతు ఇన్ఫెక్షన్ తగ్గుతుంది.

జీవన సౌరభం

కోరిక కొన్నాళ్లు బతికిస్తుంది. ఆశ చచ్చేదాక బతికిస్తుంది. కానీ ఆశయం మాత్రం చావే లేకుండా చేస్తుంది.

సెన్సెక్స్ ⬇ 170
36,025

నిఫ్టీ ⬇ 69
10,780

రూపాయి ⬇ 10 పై
అమెరికా డాలరుకు రూ.
71.17

టూల్ టెక్ ఎక్స్‌పో..

మెషీన్ టూల్ మానుఫాక్చర్స్ అసోసియేషన్ (ఐఎంటిఎంఎ) టూల్‌టెక్ 2019 ఎడిషన్ ఎక్స్‌పోను బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసింది. అదే విధంగా ఇక్కడ ఐఎంటిఇఎక్స్ తన 50 ఏళ్ల వేడుకను జరుపుకుంటుంది. ఈ సందర్భంగా కర్నాటక సిఎం హెచ్‌డి కుమారస్వామి దీన్ని లాంచనంగా ప్రారంభించారు. ఇక్కడ 26 దేశాల నుంచి 1200కి పైగా ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు.



జోరు నుంచి నష్టాల్లోకి..

సెన్సెక్స్ 169 పాయింట్ల పతనం

ముంబయి : దేశీయ మార్కెట్లు వారాంతాన నష్టాలతో ముగిశాయి. మీడియా, ఆటోమొబైల్ రంగ షేర్లలో అమ్మకాలు మార్కెట్ విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఫలితంగా ఆరంభంలో జోరు మీదున్న సూచీలు క్రమంగా అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకున్నాయి. వివిధ కంపెనీల ప్రోత్సాహకర త్రైమాసిక ఫలితాలు, కొనుగోళ్ల అండతో శుక్రమవారం ఉదయం దేశీయ స్టాక్ మార్కెట్లు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మార్కెట్ ఆరంభంలో సెన్సెక్స్ 250 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడ్ అయ్యింది. నిఫ్టీ కూడా 10,900 మార్క్ పైన కదలాడింది. యస్ బ్యాంక్, రిలయన్స్ లాంటి షేర్లు రాణించడంతో తొలి సెషన్‌లో సూచీలు జోరుగా సాగాయి. అయితే ఆ తర్వాత మారుతీ సుజుకీ, జీ ఎంటర్‌టైన్‌మెంట్, డిష్ టీవీ వంటి భారీ షేర్ల కౌంటర్లలో అమ్మకాలు వెల్లువెత్తడం మార్కెట్‌పై ప్రభావాన్ని చూపింది. దీంతో ఒత్తిడికి గురైన సూచీలు మెల్లగా లాభాలను కోల్పోయి నష్టాల్లోకి జారుకున్నాయి. ఫలితంగా శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 169 పాయింట్లు దిగజారి 36,025 పాయింట్లకు పడిపోయింది. మరోవైపు ఎన్ఎస్ఇ సూచీ నిఫ్టీ 69 పాయింట్ల నష్టంతో 10,780 పాయింట్ల వద్ద ముగిసింది. బిఎస్ఇలో 698 షేర్లు లాభాల్లో నడవగా.. 1854 స్టాక్స్ నష్టాలలో కదలాడాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 71.19గా కొనసాగింది.

ఎయిరిండియా రిపబ్లిక్ డే ఆఫర్



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఎయిరిండియా భారత రిపబ్లిక్ డేను పురస్కరించుకొని చౌకగా విమాన ప్రయాణం అందించనున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత ఏడాది సెప్టెంబరు 30వ తేదీలోగా ప్రయాణాల కోసం జనవరి 26 నుంచి 28వ తేదీ వరకూ ఈ రాయితీ టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపింది. ఈ సమయంలో భారీ తగ్గింపును పొందవచ్చని ఎయిరిండియా ప్రతినిధి పేర్కొన్నారు. దేశీయంగా, అంతర్జాతీయంగా నడిచే విమాన టికెట్లను ఈ మూడు రోజుల్లో తక్కువ ధరలకు విక్రయించనున్నామని పేర్కొన్నారు. దేశీయంగా నడిచే విమానంలో ఒకవైపు ప్రయాణానికి కనిష్ఠంగా అన్ని ఛార్జీలు కలిసి ఎకనామిక్ క్లాస్‌లో రూ.979 నుంచి బిజినెస్ క్లాస్ టికెట్ల ధర రూ.6,965 వరకూ నిర్ణయించామన్నారు. అంతర్జాతీయంగా ఎకానమీ క్లాస్‌లో రూ.55,000కే అమెరికా ప్రయాణం కోసం టికెట్ బుక్ చేసుకోవచ్చన్నారు. బ్రిటన్, యూరప్ దేశాలకు రూ.32వేలు, ఆస్ట్రేలియాకు ఎకానమీ క్లాస్‌లో రూ.50,000కే ప్రయాణం చేయొచ్చన్నారు. రూ.11వేలకే దక్షిణాసియా దేశాలకు ప్రయాణం అందిస్తున్నామన్నారు. తొలుత వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యం ఆధారంగా టికెట్ల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు.

వొడాఫోన్ ఐడియా కనీస ఛార్జీ..



ముంబయి : టెలికం పరిశ్రమలో నెట్‌వర్క్ కంపెనీలు కొత్తగా కనీస చార్జీలను అమల్లోకి తెస్తున్నాయి. తాజాగా వోడాఫోన్ ఐడియా రూ.24 ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఖాతా కాలపరిమితి ముగిసిపోకముందే.. ఈ మొత్తాన్ని రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. లేనిచో సేవలు నిలిపివేయనున్నట్లు ఆ టెలికం కంపెనీలు వెల్లడించాయి. ఈ ప్లాన్ వొడాఫోన్, ఐడియా యూజర్లు ఇద్దరికీ వర్తిస్తుందని ఆ కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్లాన్ గడువు 28 రోజులుగా నిర్ణయించింది. కాగా ఇందులో రాత్రి 11 గంటలనుంచి ఉదయం 6 గంటలవరకు 100 ఉచిత కాల్స్‌ను ఆఫర్ చేస్తోంది. ఇప్పటికే భారతీ ఎయిర్‌టెల్ కనీస రీఛార్జిని ప్రకటించిన విషయం తెలిసిందే.

చతికిలపడిన మారుతి సుజుకి

క్యూ3 లాభాల్లో 17% పతనం
2014 మార్చి తర్వాత అత్యంత పేలవం
కుంగిన షేర్ విలువ



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీదారు మారుతి సుజుకి లాభాలు, వాహన అమ్మకాలు చతికిలపడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 17.21 శాతం పతనంతో రూ.1,489.30 కోట్ల లాభాలు నమోదు చేసింది. వరుసగా రెండో త్రైమాసికంలోనూ ప్రతికూల ఫలితాలను చవి చూసింది. 2017-18 ఇదే క్యూ3లో రూ.1,800 కోట్ల లాభాలు సాధించింది. ఈ త్రైమాసికంలో రూ.19,283.2 కోట్లుగా ఉన్న అమ్మకాలు.. క్రితం క్యూ3లో రూ.19,668.3 కోట్లకు పెరిగాయి. 2018 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలోనూ కంపెనీ లాభాలు 9.82 శాతం తగ్గాయి. కాగా 2014 మార్చి త్రైమాసికం ఫలితాల తర్వాత అత్యంత పేలవమైన ఆర్థిక ఫలితాలు క్రితం డిసెంబర్ త్రైమాసికంలో నమోదయ్యాయి. మారుతి సుజుకి శుక్రవారం ఆర్థిక ఫలితాలు ప్రకటించన తర్వాత మార్కెట్‌లో ఆ సూచీ తీవ్ర ఒత్తిడికి గురైంది. బిఎస్ఇలో మారుతి సుజుకి షేర్ 7.40 శాతం పతనమై రూ.6,516.35కి పడిపోయింది.


2018 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం కంపెనీ అమ్మకాలు 0.10 శాతం తగ్గి రూ.18,926.40 కోట్లకు పడిపోయాయి. క్రితం మూడు త్రైమాసి కాల నుంచి కూడా ఈ కంపెనీ అమ్మకాల్లో పెద్ద పురోగతి లేకపోగా.. యథాతథంగా నమోద వుతున్నాయి. 2014 మార్చి త్రైమాసికంలో అమ్మకాలు అత్యధికంగా 9.48 శాతం తగ్గాయి. 19 త్రైమాసికాల తర్వాత మళ్లీ క్రితం క్యూ3 అమ్మకాల్లో తగ్గుదలను చవి చూసింది. క్రితం డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ ప్యాసింజర్ వాహన అమ్మకాలు 0.4 శాతం తగ్గాయి. క్రితం మూడు త్రైమాసికాల్లో సగటు అమ్మకాల్లో 7.2 శాతం పెరుగుదల ఉంది. గత త్రైమాసికంలో కంపెనీ ఎగుమతులు 8.5 శాతం పడిపోయాయి. ఈ త్రైమాసికంలో అంతర్జాతీయ మార్కెట్లలో పరిస్థితులు బాగోలేకపోవడమే ప్రధాన కారణమని పేర్కొంది. ఆటోమొబైల్ పరిశ్రమ బాడీ సియోమ్ ప్రస్తుత ఏడాదిలో దేశీయ అమ్మకాలు 8-10 శాతం పెరుగొచ్చని తొలుత అంచనా వేసిందని.. దానికి భిన్నంగా క్రితం మూడు త్రైమాసికంలో ఈ పరిశ్రమ అమ్మకాలు 4.4 శాతం పెరిగాయి. మూడో త్రైమాసికంలో విక్రయాల్లో 0.8 శాతం తగ్గుదల నమోదయ్యిందని మారుతి పేర్కొంది. కొన్ని దేశాలు దిగుమతులను కట్టడి చేయడం కూడా తమ విక్రయాలపై ప్రభావితం చూపాయని తెలిపింది.

ఎల్అండ్‌టి ఫలితాలు ఆకర్షణీయం..



న్యూఢిల్లీ : ప్రముఖ ఇంజనీరింగ్ కంపెనీ లర్సన్ అండ్ టర్బో (ఎల్అండ్‌టి) 2018-19 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో 37 శాతం వృద్ధితో రూ.2,042 కోట్ల లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.1,490 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ 24 శాతం పెరిగి రూ.35,709 కోట్లకు చేరింది. పలు ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా తమ రెవెన్యూలో పెరుగుదల చోటు చేసుకుందని ఆ కంపెనీ స్టాక్ ఎక్సేంజీలకు తెలిపింది. మొత్తం రెవెన్యూలో అంతర్జాతీయ వాటా 32 శాతంతో రూ.11,476 కోట్లుగా నమోదయ్యింది. శుక్రవారం బిఎస్ఇలో ఎల్అండ్‌టి షేర్ 0.47 తగ్గి రూ.1,285.55 వద్ద ముగిసింది.

డిహెచ్‌ఎఫ్‌ఎల్ లాభాలు 37% పతనం




ముంబయి : ప్రముఖ గృహ రుణాల జారీ సంస్థ డిహెచ్‌ఎఫ్‌ఎల్ 2018 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.314 కోట్ల లాభాలతో సరిపెట్టుకుంది. క్రితం ఏడాది ఇదే అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో రూ.495 కోట్ల నికర లాభాలు సాధించింది. దీంతో పోల్చితే క్రితం త్రైమాసికం లాభాల్లో 37 శాతం పతనం చోటు చేసుకుంది. ఇదే సమయంలో కంపెనీ నికర వడ్డీపై ఆదాయం మాత్రం 20 శాతం పెరిగి రూ.752 కోట్లకు చేరింది. కాగా మొండి బాకీల కోసం కేటాయింపులు 70 శాతం పెరిగి రూ.132 కోట్లకు ఎగిశాయి. శుక్రవారం బిఎస్ఇలో డిహెచ్‌ఎఫ్‌ఎల్ షేర్ 1.31 శాతం పెరిగి రూ.209.20 వద్ద ముగిసింది.

జెట్ ఎయిర్‌వేస్ 50% డిస్కౌంట్ ఆఫర్

న్యూఢిల్లీ : భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెట్ ఎయిర్‌వేస్ విమానయానంపై ప్రత్యేక డిస్కౌంట్ ప్రకటించింది. దేశీయ, అంతర్జాతీయ విమాన టికెట్లను సగం ధరకే విక్రయించనున్నట్లు శుక్రవారం పేర్కొంది. జనవరి 30 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని తెలిపింది. ప్రీమియం, ఎకానమీ క్లాసుల్లో ఇరువైపుల ప్రయాణానికి ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపింది. ఫిబ్రవరి 8 తర్వాత ప్రయాణాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. మస్కట్, షార్జా తప్ప గల్ఫ్‌లోని అన్ని దేశాలతోపాటు బ్యాంకాక్, సింగపూర్, హాంకాంగ్, ఖాట్మాండు, కొలంబో, ఢాకా వెళ్లే ప్రయాణికులకు ఈ డిస్కౌంట్ వర్తిస్తుందని పేర్కొంది.

బిఎస్ఎన్ఎల్ గణతంత్ర దినోత్సవ ఆఫర్



ముంబయి : ప్రభుత్వ రంగ టెలికం కంపెనీ బిఎస్ఎన్ఎల్ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించు కుని తమ వినియోగ దారుల కోసం ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ప్రీపెయిడ్ ఖాతాదారుల కోసం ఎస్‌టివి-269 పేరుతో కొత్త ప్యాక్‌ను ఆవిష్కరించింది. 70వ రిపబ్లిక్ డే సందర్భంగా వినియోగదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఈ ఆఫర్‌ను ప్రకటించారు. 26 రోజుల ఈ ప్లాన్‌లో ఏ నెట్‌వర్క్‌కు అయినా 2600 నిమిషాల టాక్‌టైం, 260 మెసేజ్‌లు, 2.6 జిబి డేటాను అందిస్తున్నట్లు బిఎస్ఎన్ఎల్ తెలిపింది. అన్ని సర్కిళ్లలో ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు ఈ ప్లాన్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

మరో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - హనుమాన్‌జంక్షన్/కంచిలి (శ్రీకాకుళం జిల్లా)

కలకత్తా-చెన్నై జాతీయ రహదారిపై ఇన్నోవా కారు, లారీని ఢీకొన్న సంఘటనలో ముగ్గురు మృతిచెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. కృష్ణాజిల్లా బాపులపాడులోని కోడూరుపాడు వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... రాజమండ్రి నుండి విజయవాడ వైపు వెళ్తున్న ఇన్నోవా కారు కోడూరుపాడు వద్ద జాతీయ రహదారిపై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డు అవతల విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న లారీని ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ముగ్గు రు తీవ్రంగా గాయపడ్డారు. మృతిచెందిన వారిలో తూర్పుగోదావరి జిల్లా రాజవరంకు చెందిన డ్రైవర్ బట్టి వెంకటేశ్వరరావు అలియాస్ శ్రీను (22), డ్రైవర్ స్నేహితుడు బొడ్డు రాంబాబు (27), నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన గుంతక్ సంఘమేశ్వర్(59) ఉన్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు వీరవల్లి ఎస్ఐ చంటిబాబు తెలిపారు.

శ్రీకాకుళంలో దంపతులు మృతి

శ్రీకాకుళం జిల్లా సోంపేట చెందిన భార్యాభర్తలు వైశ్యరాజు వెంకటరమణ అలియాస్ కన్నా (54), శ్రీలత (45) వెంకటరమణ బరంపురంలోని తన అత్తవారింటికి భార్య శ్రీలతతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కంచిలి దాటాక పలాస వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ వెనుక నుంచి వారి వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంతోపాటు వారిద్దరూ లారీ చక్రాల కింద పడిపోయారు. వెంకటరమణ, శ్రీలత అక్కడికక్కడే మృతి చెందారు. లారీ అదుపుతప్పి బోల్తా పడింది.

వైసిపిలో చేరిన కనుమూరు సోదరులు

ప్రజాశక్తి-గూడూరు

గూడూరుకు చెందిన కనుమూరు హరిశ్చంద్రారెడ్డి ఆయన సోదరుడు రాజకీయ విశ్లేషకులు రవిచంద్రారెడ్డి జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. శుక్రవారం లోటస్‌పాండ్‌లో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. పారిశ్రామిక వేత్త కనుమూరు హరిశ్చంద్రారెడ్డి ట్రస్టు పేరుతో సామాజిక సేవలు చేసేవారు. బిజెపి అభిమా నిగా ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు అనుచరుడుగా కొనసాగారు. రవిచంద్రారెడ్డి రాజకీయ విశ్లేషకులుగా పేరుంది.

వెలవెలబోతున్న ఫుడ్‌పార్కులు

- సౌకర్యాలున్నా పెట్టుబడులు శూన్యం
- మల్లవల్లిలో 100 ఎకరాల్లో మెగా ఫుడ్ పార్కు
- రూ.125 కోట్లతో మౌలిక సదుపాయాలు
- జాడలేని ప్రాసెసింగ్ యూనిట్లు



ప్లాట్లన్నీ ఖాళీనే

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనా సంస్థ (ఎపిఐఐసి) కృష్ణాజిల్లా బాపులపాడులో రెండు మెగా ఫుడ్‌పార్కులకు రూ. కోట్లు వెచ్చించి మౌలిక వసతులు కల్పించినా పెట్టుబడులు మాత్రం రావడం లేదు. లే అవుట్‌లు వేసి రెండు సంవత్సరాలైనా ఇప్పటికి ఒక్క పరిశ్రమ కూడా పూర్తి కాలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కామన్ ప్రాసెసింగ్ యూనిట్ (సిపిసి) మినహా మల్లవల్లి ఫుడ్ పార్కులో మిగిలిన భూములన్నీ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ధర అధికంగా ఉండటంతో భూములు కొని పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

100 ఎకరాల్లో రెండు ఫుడ్‌పార్కులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు ఫుడ్ పార్కుల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు కేటాయించాయి. 57.45 ఎకరాల్లో ఫుడ్‌పార్కుకు మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లు నిధులు విడుదల చేసింది. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం 42.55 ఎకరాల్లో మరో ఫుడ్ పార్కును ఏర్పాటు చేసింది. కేంద్రం నిధులతో ఏర్పాటు చేసిన ఫుడ్ పార్కులో 33 ప్లాట్‌లతో లే అవుట్‌లు, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన ప్రాంతంలోని లే అవుట్‌లో 25 వరకు ప్లాట్లను ఏర్పాటు చేశారు.

రూ.125 కోట్ల వరకు నిధులు వ్యయం

రెండు ఫుడ్ పార్కులకు ఉపయోగపడేలా రూ.70 కోట్ల వరకు వెచ్చించి ఉద్యానవన శాఖ నర్సరీ భవనం స్థలంలో కామన్ ప్రాసెసింగ్ యూనిట్ (సిపిసి) నిర్మిస్తున్నారు. సిపిసి నిర్మాణం మరో నెల రోజుల్లో పూర్తి కానుంది. దీనిలో ఏర్పాటు చేయాల్సిన యంత్ర పరికరాలు సైతం ఇప్పటికే షెడ్‌లోకి చేరుకున్నాయి. 300 మెట్రిక్ టన్నుల నిల్వకు అవసరమైన కోల్డ్ స్టోరేజీ, 4000 మెట్రిక్ టన్నులు నిల్వ ఉండేలా డ్రైవేర్ హౌస్, గంటకు 1 మెట్రిక్ టన్ను ప్యాకింగ్ చేసే సామర్థ్యం ఉండే వెట్, డ్రై యూనిట్, 200 మిల్లీ లీటర్ల ప్యాకెట్లు గంటకు తొమ్మిదివేలు తయారు చేసే సౌకర్యాలను సిపిసిలో కల్పించారు. దీనితో పాటు టెస్టింగ్ ల్యాబ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు కోటి రూపాయలతో ప్రహరీ నిర్మించారు. రూ.6 కోట్లుకు పైగా వెచ్చించి రహదారులు, డ్రెయిన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్, విద్యుత్ వీధి దీపాలుసైతం ఏర్పాటు చేశారు.

ఇన్ని సౌకర్యాలు కల్పించడంతో ఫుడ్ ప్రోసిసింగ్ యూనిట్లు భారీ సంఖ్యలో వస్తాయని ఎపిఐఐసి ఆశించింది. ఈ నేపథ్యంలో 33 ప్లాట్లుగా విభజించి భూములను 99 సంవత్సరాలు లీజుకు ఇచ్చేందుకు ఎకరం రూ.42 కోట్ల విలువను నిర్ధారించింది. వీటిని లీజుకు ఇచ్చేందుకు ధర నిర్ణయించి రెండేళ్లయినా ఇప్పటికి ఒకటి రెండు ఎకరాలు మినహా మిగిలిన ప్లాట్లన్నీ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఈ స్థలాలను కొనేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు.


చౌకగా మోడల్ ఇండస్ట్రీ పార్కులో భూములు

ఏపీఐఐసి 1200 ఎకరాల్లో మోడల్ ఇండస్ట్రీ పార్కు ఏర్పాటు చేసింది. ఈ భూముల విలువ ఎకరం రూ.16.50 లక్షలకు విక్రయిస్తోంది. ఇప్పటికే అశోక్ లేలాండ్, మోహన్ స్పిన్‌టెక్, హెరిటేజ్‌లు భారీ విస్తీర్ణంలో ఈ భూములు కొనుగోలు చేశాయి. దీనికి సమీపంలోనే ఉన్న ఫుడ్ పార్కు భూముల ధరను మాత్రం ఎకరం రూ.42 లక్షలు నిర్ణయించింది. ఈ భూములు కొని పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

విజయనగరంలో ఓటర్ల సర్వే కలకలం

అడ్డుకున్న వైసిపి నాయకుల అరెస్ట్

ప్రజాశక్తి- విజయనగరం, పూసపాటిరేగ/అమరావతి బ్యూరో



విజయనగరం జిల్లాలో పలువురు వైసిపి నాయకులను పోలీసులు అరెస్టు చేయడం కలకలం రేపింది. జిల్లాలోని పూసపాటిరేగ మండలం కుమిలి, రెల్లివలస గ్రామాల్లో గురువారం కొందరు వ్యక్తులు పీపుల్స్ సర్వే సంస్థ పేరుతో ఓటర్ల సర్వే చేశారు. వైసిపి నాయకులు వారిని అడ్డుకున్నారు. వారి నుంచి ట్యాబ్‌లు లాక్కున్నారు. సర్వే చేస్తున్న ఆ యువకులను పోలీసులకు అప్పగించారు. విచారణ అనంతరం వారిని పోలీసులు వదిలేశారు. తమ నుంచి వైసిపి నాయకులు లాక్కున్న ల్యాప్‌టాప్‌లను తిరిగి తమకు ఇప్పించాలని పీపుల్స్ సర్వే సంస్థకు చెందిన వ్యక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పలువురు వైసిపి నాయకులను పోలీసులు గురువారం అర్ధరాత్రి అరెస్టు చేసి జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. శుక్రవారం ఉదయం వైసిపి జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావును పోలీసులు అదుపులోకి తీసుకొని జామి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. దీంతో, అరెస్టు చేసిన వారందరినీ పోలీసులు సొంత పూచీకత్తుపై సాయంత్రం విడుదల చేశారు. సర్వే చేస్తున్న వారు టిడిపి వ్యతిరేకుల ఓట్లను తొలగిస్తున్నారంటూ అమరావతిలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి, డిజిపి, వైసిపి రాష్ట్ర నాయకులు బొత్స సత్యనారాయణతోపాటు ఆ పార్టీ నాయకుల పలువురు ఫిర్యాదు చేశారు.

అనంతరం వైసిపి నేత బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. ఓటమి భయంతోనే టిడిపి ఇలాంటి దొంగచాటు చర్యలకు పాల్పడు తోందన్నారు.

రచ్చకెక్కిన విభేదాలు

తెలుగుదేశం, బిజెపి కౌన్సిల్లో పరస్పర విమర్శలు
ప్రజా సమస్యలు పక్కదారి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


మున్సిపల్ కౌన్సిల్ సమావేశం టిడిపి, బిజెపి బాహాబాహీకి వేదికైంది. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యుని హోదాలో ఎంఎల్ఎ పైడికొండల మాణిక్యాలరావు హాజరయ్యారు. అజెండాలో భాగంగా టెండరు వర్కులు, భవనాల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై చర్చ సాగింది. దీనిపై పలువురు కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ బాలస్వామి సమాధానమిచ్చారు. పలు పనులు జరుగుతున్న తీరు, ఆధునికీకరణ తదితర అంశాలపై కమిషనర్‌ను ఎంఎల్ఎ పైడికొండల మాణిక్యాలరావు వివరణ కోరారు. దీనిపై కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధిపర్చామని, అవుట్‌లెట్స్‌కు అనుసంధానం చేసి పనులు చేస్తున్నామని చెబుతుండగా, మధ్యలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కిలాడి ప్రసాద్ కలుగజేసుకుని నాలుగున్నరేళ్లు మున్సిపాల్టీ అభివృద్ధిని పట్టించుకోకుండా ఇప్పుడు అధికారులను ఆరా తీయడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో ఎంఎల్ఎ, ప్రసాద్ మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రధాని మోడీ మోసం చేస్తే నియోజకవర్గాన్ని మీరు మోసం చేశారని ప్రసాద్ ఆరోపించారు. సుమారు రూ.156 కోట్లతో విజ్జేశ్వరం నుంచి తాడేపల్లిగూడేనికి గోదావరి జలాలు పైపులైన్ ద్వారా రప్పిస్తానని హామీనిచ్చినా ఇప్పటి వరకే నెరవేరలేదని, మీరు చేసిన అభివృద్ధి ఏమిటో కౌన్సిల్ ముందు చెప్పాలని ఎంఎల్ఎతో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ వాగ్వివాదానికి దిగారు. ఎంఎల్ఎ మాణిక్యాలరావు మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు చేసిన అవినీతి గురించి మాట్లాడతాననే భయంతో తన ప్రసంగాన్ని అడ్డుకున్నారన్నారు. ఒక్కసారిగా కౌన్సిలర్లు పోడియం వద్దకు చేరుకున్నారు. తెలుగుదేశం, బిజెపి నాయకులు ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు బాహాబాహీకి సిద్ధపడ్డారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరుపక్షాలను సముదాయించారు. గొడవ జరుగుతుండగానే మైక్ పట్టుకుని ఎంఎల్ఎ మాట్లాడే ప్రయత్నం చేస్తుండగా మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ కలుగజేసుకుని ఎంఎల్ఎ మాట్లాడటానికి అధ్యక్షునిగా అనుమతి ఇచ్చే ప్రసక్తి లేదని, సమావేశం ముగిసిందని ప్రకటించారు. ప్రజాసమస్యలపై చర్చ లేకుండానే సమావేశం అర్ధాంతరంగా ముగిసింది.

ప్రత్యామ్నాయం కోసం లోక్‌సత్తా కృషి

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

మూస రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా లోక్ సత్తా పార్టీ మేనిఫెస్టోలో రాష్ట్రంలోని కొన్ని కీలక సమస్యలకు నిర్దిష్టమైన పరిష్కారాలు ప్రకటిస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డివివిఎస్.వర్మ అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంప్రదాయ పార్టీలు ప్రలోభ ఉచితాలను వరదలాగా పారిస్తున్నాయని వాటిని సూత్రబద్ధ వైఖరితో ప్రలోభ ఉచితాలను వేరు చేసి స్వస్తి పలుకుతామని చెప్పారు. ఓటు బ్యాంకుల కోసం కులాలను చీల్చడానికి బదులు ఐక్యతతో సాధించుకుని ఉమ్మడి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. స్థానిక ప్రభుత్వాల సాధికారత, యువతకు ఉపాధి కల్పించే పారిశ్రామిక విధానం రూపొందించి అమలు చేస్తామని చెప్పారు. ప్రాంతీయ అసమానతలు తొలగించేలా మేనిఫెస్టో తీసుకువస్తామని వివరించారు. ఈ సమావేశంలో లోక్‌సత్తా వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్.వజీర్, వైస్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీధర్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి



ప్రజాశక్తి-పిఎం.పాలెం, విశాఖ

విశాఖలోని మారికవలస సమీపంలోని శ్రీ చైతన్య కళాశాల భగీరథ భవన్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బైపురెడ్డి అయ్యప్ప హేమంత్ (16) శుక్రవారం ఉదయం అనుమానాస్పదస్థితిలో కళాశాల హాస్టల్‌లో ఉరి వేసుకొని మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. హాస్టల్ రూమ్‌లో అయ్యప్ప హేమంత్‌లో సహా ఆరుగురు విద్యార్థులు ఉంటున్నారు. ప్రతి రోజులాగే ఉదయం 5 గంటలకు ఇన్‌ఛార్జ్ రమణ విద్యార్థులను నిద్రలేపాడు. రూమ్‌లో ఉన్న ఇతర విద్యార్థులు లేచి చూడగా అయ్యప్ప హేమంత్ ఉరికి వేలాడుతూ ఉండడాన్ని గమనించి కిందకు దించారు. కొనఊపిరితో ఉండటంతో కళాశాల యాజమాన్యం ఎవరికీ తెలియకుండా కెజిహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని పిఎం.పాలెం ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

జీవో 151 ప్రకారం జీతాలు పెంచాలి

మున్సిపల్ కార్మికుల డిమాండ్

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

విజయవాడ నగర పాలక సంస్థ పారిశుధ్యం, మలేరియా, పార్కులు, ఇంజనీరింగ్ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీవో 151 ప్రకారం వేతనాలు పెంచాలని కోరుతూ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. విజయవాడ ధర్నా చౌక్ వద్ద శుక్రవారం జరిగిన ధర్నాలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.డేవిడ్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విజయవాడ, విశాఖపట్నం నగరాలకు 010 పద్దు కింద జీతాలు, హెల్త్ కార్డు, జిపిఎఫ్ ఖాతాలు తక్షణమే ప్రారంభించాలన్నారు. కార్మికులకు 50 శాతం ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎస్.జ్యోతిబసు, సిఐటియు పశ్చిమ సిటీ ప్రధాన కార్యదర్శి బోయి సత్యబాబు, ఉపాధ్యక్షులు సిహెచ్.సాయి, నగర నాయకులు వి.కె.కుమార్, టి.తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ

శ్రీకాకుళం జిల్లా పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్తున్న గిరిజనులు



'తిత్లీ' బాధితులకు పరిహారం చెల్లించాలి

ఐటిడిఎ వద్ద గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి- పార్వతీపురం (విజయనగరం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు శుక్రవారం ఆందోళనకు దిగారు. తిత్లీ తుపానులో నష్టపోయిన పంటలకు, అటవీ ఉత్పత్తులకు పరిహారం చెల్లించాలని, ఉపాధి పనులు చేసిన కూలీలకు బకాయిలు చెల్లించాలని, కొత్తగా ఉపాధి పనులను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోని నవిరి నిర్వాసిత కాలనీ నుంచి గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన వందలాది మంది గిరిజనులు ర్యాలీగా ఐటిడిఎ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ ఆందోళన చేపట్టారు. ఒక్కసారిగా తరలివచ్చిన గిరిజనులను, సిపిఎం నాయకులను పోలీసులు ఐటిడిఎ కార్యాలయం గేటు వద్దే అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. శాంతియుతంగా ఆందోళన చేపడుతున్నామని చెప్పడంతో ఆవరణలోకి అనుమతించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా (పార్వతీపురం) కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలక లక్ష్మణమూర్తి మాట్లాడారు. తిత్లీ తుపానుతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన గిరిజన మండలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. గిరిజనులు తమ పంటలను, గృహాలను కోల్పోయి దిక్కులేనివారయ్యారని తెలిపారు. జీడి, మామాడి, టేకు, చింత చెట్లతోపాటు జొన్న, కంది పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. బాధితులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

హెల్త్ అసిస్టెంట్ల రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు రూరల్ (విశాఖపట్నం)

విశాఖ ఏజెన్సీలో విధుల నుంచి తొలగించిన 86 మంది కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాడేరు ఐటిడిఎ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు పాల్గొని మాట్లాడారు. 388 జిఒ ప్రకారం 2015లో కాంట్రాక్టు ప్రాతిపదికన ఏజెన్సీలోని పిహెచ్‌సి సబ్ సెంటర్లలో పని చేయడానికి హెల్త్ అసిస్టెంట్లను ప్రభుత్వం నియమించిందని చెప్పారు. మొదట ఆరు నెలల కాలపరిమితతో నియమించిన ప్రభుత్వం ప్రతి ఏటా రెన్యూవల్ చేస్తూ వచ్చిందని తెలిపారు. ఈ ఏడాది రెన్యూవల్ చేయకుండా 86 మందిని తొలగించిందన్నారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని వైసిపి పాడేరు, అరకు నియోజకవర్గం నాయకులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, శెట్టి ఫాల్గుణ, ఆర్.మత్స్యలింగం సందర్శించి హెల్త్ అసిస్టెంట్ల ఆందోళనకు మద్దతు తెలిపారు.

అంగన్వాడీ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్

అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మచిలీపట్నం రూరల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని స్థానిక రూరల్ సిడిపిఒ కార్యాలయం వద్ద చేసిన ధర్నాలో మచిలీపట్నం సిఐటియు కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం మాట్లాడారు. మూడు నెలలుగా అంగన్‌వాడీలకు జీతాలు పెండింగ్‌లో ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.1500 వేతనం కూడా పెంచి అందించాలన్నారు. సెంటర్ అద్దెలు, టిఎ, గ్యాస్ బిల్లులు, ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు, అమృతహస్తం తదితర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఐసిడిఎస్ స్వచ్ఛంద సంస్థలకు అప్పగించొద్దని, ఐసిడిఎస్‌కు సంబంధం లేని అదనపు పనులు అంగన్‌వాడీలతో చేయించరాదని అన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రూరల్ సిడిపిఒ దీప్తికి అందజేశారు.

నాల్గో రోజు 104 ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి- యంత్రాంగం : తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా 104 చంద్రన్న సంచార చికిత్స ఉద్యోగులు చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి నాలుగో రోజులకు చేరింది. దీక్షలు చేస్తున్నా మొండి వైఖరి వీడని సర్వీసు ప్రొవైడర్లకు, ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని 104 చంద్రన్న సంచార చికిత్స ఉద్యోగులు కర్నూలులో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు. అనంతపురం జిల్లా కదిరిలో ఉద్యోగుల దీక్షలకు వైసిపి జిల్లా నాయకులు సిద్దారెడ్డి సంఘీభావం తెలిపారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు నగర కమిటీ నాయకులు రామకృష్ణ మాట్లాడారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మికి, మాజీ ఎమ్మెల్యే కన్నబాబుకు వినతిపత్రం అందించారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు సునీల్ కుమార్ మాట్లాడారు. శ్రీకాకుళంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద దీక్షా శిబిరం కొనసాగుతోంది. విజయనగరం కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తోన్న శిబిరంలో వంటావార్పు నిర్వహించారు. విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగిన దీక్షల్లో సిఐటియు రాష్ట్ర నాయకులు ఎవి నాగేశ్వరరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో నోటికి నల్ల రిబ్బన్లు ధరించి మౌన ప్రదర్శన నిర్వహించారు.

రక్షణరంగ ప్రైవేటీకరణ దేశానికి ముప్పు

- పరిరక్షణ, పెన్షన్ సాధన కోసం పోరాడదాం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు



సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రాఘవులు, చిత్రంలో రెడ్డి వెంకటరరావు, జగ్గునాయుడు

ప్రజాశక్తి- మల్కాపురం, విశాఖపట్నం

రక్షణరంగ పరిరక్షణ, పెన్షన్ సాధన కోసం ఐక్యంగా పోరాడదామని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పేర్కొన్నారు. మూడు రోజుల సమ్మె జయప్రదం చేసిన రక్షణరంగ కార్మికులు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. నేవల్ డాక్‌యార్డ్ విజయనగర్ గేట్, ఎన్ఎడి డిపో వద్ద శుక్రవారం అఖిలపక్ష కార్మిక సంఘాలు, యూనియన్ల ఆధ్వర్యాన జరిగిన సభల్లో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా రక్షణరంగం కార్మికులు చేస్తున్న పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. నిత్యం దేశభక్తి గురించి మాట్లాడే ప్రధాని మోడీ దేశాన్ని విదేశీ, స్వదేశీ బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. ఒకసారి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలుగా ఎన్నికైన వారు జీతాలు, పెన్సన్‌లను రూ.లక్షల్లో పెంచుకున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. ఎన్‌సిఇయు గౌరవాధ్యక్షులు, డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడారు. రక్షణ సంస్థలు ప్రైవేటీకరించడమంటే దేశ భద్రతకు ముప్పు తేవడమేనని పేర్కొన్నారు. ఐఎన్‌సిఇయు ప్రధాన కార్యదర్శి బిఎస్.రెడ్డి, ఎన్‌సిఇయు ప్రధాన కార్యదర్శి పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ సమ్మెను జయప్రదం చేసినందుకు యావత్తు రక్షణ రంగ కార్మికులకు అభినందనలు తెలిపారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు, బిపిఎంఎస్ నాయకులు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. బహిరంగ సభ అనంతరం విజయనగర్ నేవల్ డాక్‌యార్డు గేటు నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు వందలాది మంది కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

హెచ్‌ఎల్‌సి ఆయకట్టు రైతుల ఆగ్రహం

జాతీయ రహదారిపై బైఠాయింపు

ప్రజాశక్తి- గార్లదిన్నె

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం తుంగభద్ర హెచ్‌ఎల్‌సి ఆయకట్టుకు నీరు అందక వరిపైరు ఎండు ముఖంపట్టింది. దీంతో ఆగ్రహించిన రైతులు శుక్రవారం జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. రైతుల ఆందోళనతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాయదుర్గం, రాప్తాడు, ధర్మవరం, తాడిపత్రి నియోజకవర్గాలకు సాగునీరు ఇస్తున్నారని అన్నారు. కానీ శింగనమల నియోజకవర్గానికి మాత్రం నీరు అందడం లేదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 33 వేల ఎకరాల్లో పలు పంటలు సాగు చేశారన్నారు. ఆయకట్టుకు 120 రోజులు నీటిని అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారని, కానీ కేవలం 70 రోజులకే నీరు ఇచ్చి ఆపేశారన్నారు. అనంతపురం జిల్లాకు 14 టిఎంసిలు విడుదల అయినప్పుడు ఆయకట్టుకు 120 రోజులు నీరు అందేదని, ఇప్పుడు 22 టిఎంసిలు వస్తున్నా ఎందుకు నీరు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కలెక్టరు రైతులతో మాట్లాడి నీరు విడుదలకు ప్రయత్నిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కటకటాల్లోకి కీచక సోదరుడు

ప్రజాశక్తి - పిడుగురాళ (గుంటూరు జిల్లా)

ఇతరుల నుండి ఇబ్బంది ఎదురైతే అండగా నిలవాల్సిన అన్నే వేధింపులు మొదలెట్టాడు. నచ్చని పెళ్లి చేసుకుందనే కోపంతో చెల్లిపైనే సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో వెలుగు చూసిన ఘటన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన తాడేపల్లి సందీప్‌కు వరుసకు సోదరి అయిన యువతిని సందీప్ (యువతి చిన్నాన్న కుమారుడు) స్నేహితుడే ప్రేమించి ఇరు కుటుంబాల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాడు. ఇది నచ్చని సందీప్ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడంతో పాటు దంపతుల ఫోన్లకు అసభ్యకరంగా మెసేజ్‌లు పంపడం మొదలుపెట్టాడు. చివరికి యువతి భర్త ఆత్మహత్యకు పాల్పడే స్థాయికి వేధింపులు వెళ్లాయి. దీంతో ఊరు వదిలి వెళ్లారు, ఫోన్ నంబర్లు మార్చుకున్నారు. అయినా వేధింపులు ఆపకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పట్టణ ఎస్‌హెచ్‌ఒ పి.వీరేంద్రబాబు, పట్టణ ఎస్ఐ నారాయణస్వామి దర్యాప్తు చేపట్టారు. ఆ తర్వాత ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న నిజాలతో బాధిత కుటుంబీకులు నివ్వెరపోయారు. తనకు రెండేళ్లుగా నరకం చూపిన అతన్ని సోదరుడైనా క్షమించేది లేదని కఠినంగా శిక్షించాలని బాధిత యువతి కన్నీరు పెడుతూ పోలీసులను కోరింది.

హామీల పేరుతో బాబు మరో మోసం

- బహిరంగ సభలో సిపిఎం, సిపిఐ, జనసేన నాయకులు

ప్రజాశక్తి-చీరాల రూరల్

రాజకీయ లబ్ధికోసమే చంద్రబాబు ఇష్టారీతిన హామీలిచ్చి 2014లో అధికారంలోకి వచ్చాడని ఆ వెంటనే ఇచ్చిన హామీలన్నింటిని తుంగలో తొక్కి నేడు మరో నూతన హామీలతో ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తున్నాడనీ పలువురు వక్తలు విమర్శించారు. శుక్రవారం చీరాల నియోజకవర్గంలో నూతన ప్రత్యామ్నాయాన్ని బలపరచాలని, చీరాల అభివృద్ధికి తోడ్పడాలని కోరుతూ సిపిఎం, సిపిఐ, జనసేన ఆధ్వర్యంలో ప్రగఢ కోటయ్య విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. కరువు నేపథ్యంలో రైతులను ఆదుకోవాలని వామపక్షాలు పోరాటాలు చేస్తుంటే పోలీసులతో లాఠీ చార్జీలు, అరెస్టులు చేయించి జైల్లో పెట్టించిన ఘనత టిడిపికే దక్కుతుందని స్పష్టం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చంద్రశేఖర్ మాట్లాడుతూ తండ్రి రాజకీయ వారసత్వంలో తాను కూడా సిఎం కావాలనే ఆశతో ఉన్న వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష నాయకునిగా ఉండే అర్హత లేదన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయ విధానంతో ముందుకొస్తున్న వామపక్షాలను, జనసేనను ఆదరించాలని కోరారు. అనంతరం సిపిఎం, సిపిఐ, జనసేన చీరాల నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన మ్యానిఫెస్టోను విడుదల చేశారు. దీనికి ముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

సాగునీరందించాలని రోడ్డెక్కిన రైతులు

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

గుండ్లకమ్మ నుండి ఎడమ కాలువకు నీరివ్వాలని కోరుతూ నాగులుప్పలపాడు, మద్దిపాడు, కొరిశపాడు మండలాల రైతులు ఆందోళనకు దిగారు. ఒక్క తడైనా సాగునీరు అందించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రమైన నాగులుప్పలపాడు బస్టాండ్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పెంట్యాల హనుమంతరావు మాట్లాడారు. గుండ్లకమ్మలో ప్రస్తుతం 1.6 టిఎంసిల నీరు ఉన్నప్పటికీ, ప్రస్తుతం 0.3 టిఎంసిలు సరఫరా చేస్తే ఎండిపోతున్న పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు. నీరిచ్చే దాకా ఆందోళన విరమించబోమని రోడ్డుమీదనే వంటావార్పు నిర్వహించారు. తహశీల్దార్ రాఘవయ్య అక్కడకు చేరుకొని ఆర్‌డిఒతో సంప్రదించారు. ఆర్‌డిఒ పెంచల కిషోర్‌బాబు సమస్యను కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందిస్తూ శనివారం ఉదయం 10 గంటలకల్లా సాగునీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతాంగం రాస్తారోకోను విరమించారు.



గుంటూరు జిల్లా సాతులూరు వద్ద రైల్వే ట్రాక్ పక్కన బైఠాయించిన రైతులు

పరిహారమివ్వకుండా రైల్వే డబ్లింగ్ పనులు


రైతుల నిరసన

ప్రజాశక్తి - నాదెండ్ల (గుంటూరు జిల్లా)

నష్టపరిహారం ఇవ్వకుండా తమ భూముల్లో చేపట్టిన రైల్వే డబ్లింగ్ పనులను రైతులు అడ్డుకున్నారు. గుంటూరు జిల్లా నాదెండ్లలోని సాతులూరు సమీపంలోని గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ పనులు చేపట్టారు. ఇది తెలిసిన గొరిజవోలు, మెరిగపుడి, చందవరం, సాతులూరు గ్రామ రైతులు రైతు సంఘం ఆధ్వర్యంలో పనుల వద్దకు శుక్రవారం చేరుకున్నారు. పనులను అడ్డుకుని ట్రాక్ పక్కనే టెంటు వేసుకుని బైఠాయించారు. ఇది తెలిసిన స్థానిక విఆర్‌ఒలు అక్కడికి చేరుకుని ఆందోళన సమాచారాన్ని రైల్వే అధికారులకు తెలిపారు. అనంతరం ఇద్దరు అధికారులు అక్కడికి రావడంతో పలువురు రైతులు మాట్లాడుతూ తమకు నోటీసులు ఏమీ ఇవ్వకుండానే తమ పొలాల్లో పనులు చేపట్టారని, పైగా కల్వర్టులు సైతం నిర్మించారని వాపోయారు. తాము అధికారులను అడిగి ఆరు నెలలుగా మభ్యపెడుతున్నారని, ఎవరూ సరైన సమాధానం చెప్పడం లేదని ఆగ్రహానికి గురయ్యారు. రైతు సంఘం గుంటూరు పశ్చిమ జిల్లా కార్యదర్శి వై.రాధకృష్ణ మాట్లాడుతూ బాధిత రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా, నోటీసులైనా జారీ చేయకుండా పనులు ఎలా చేపట్టారని ప్రశ్నించారు. పొలం ఎంత తీసుకుంటున్నారు? ఎంత పరిహారంగా ఇస్తారు? తదితర వివరాలేమీ రైతులకు తెలీదని చెప్పారు. పరిహారం తేల్చే వరకూ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తామని పేర్కొన్న రైల్వే అధికారులు అక్కడి నుండి వెళ్లిపోయారు. ఆందోళనకు సిపిఎం నాయకులు బొల్లు శంకర్‌రావు, శ్రీనివాసరావు, టి.కోటేశ్వరరావు మద్దతు తెలిపారు.

టిడిపిలో సర్వే ప్రకంపనలు

- ఎమ్మెల్యేల పనితీరుపై ఫోన్ ద్వారా సమాచారం సేకరిస్తున్న అధిష్టానం
- నేతల్లో గందరగోళం



ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిల పనితీరుపై ఆ పార్టీ వివిధ రూపాల్లో సర్వేలు నిర్వహిస్తోంది. తాజాగా ఫోన్‌ల ద్వారా ఎమ్మెల్యేల నడవడికలపై సర్వే చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోని ఫోన్ నంబర్లు సేకరించిన ఒక బృందం రికార్డు వాయిస్ ద్వారా మీ నియోజకవర్గ ఎమ్మెల్యే మీకు అందుబాటులో ఉంటున్నారా? ఆయన ప్రజలతో కలసి మెలసి పనిచేస్తున్నారా? అందుబాటులో ఉండి కలసి మెలసి పనిచేస్తే నాలుగు నొక్కండి.. లేదంటే ఐదు నొక్కండని ఇటీవల కొన్ని వేల మందికి ఫోన్లు వస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై సర్వే చేస్తున్నట్లుగానే ఎమ్మెల్యేల గురించి వివరాల సేకరణ నాయకుల్లో కలకలం రేపుతోంది. టిక్కెట్లు ఇవ్వడం ఇష్టం లేని నేతలకు మీకు మీ నియోజకవర్గం ప్రజల నుంచి సానుకూలత రావడం లేదని సర్వే నివేదికలు వ్యతిరేకంగా వచ్చాయని చెప్పి టిక్కెట్లు నిరాకరిస్తారని పలువురు ఎమ్మెల్యేలు మదనపడుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఒక సామాజిక తరగతి వారు స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే, ఇన్‌ఛార్జికి వ్యతిరేకంగా జిల్లాలో పెద్ద ఎత్తున పావులు కదుపుతున్నారు. దీంతో అసమ్మతి కార్యకలాపాలూ ఊపందుకుంటున్నాయి. ఇదే సమయంలో అధిష్టానం నుంచి వచ్చిన ఫోన్లలో ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా సమాచారం ఇస్తున్నారని సమాచారం. కేవలం రెండు ప్రశ్నలతోనే పూర్తి వివరాలు ఎలా సేకరించగలుగుతారని టిడిపి ఎమ్మెల్యేలు తమ అనుయాయుల వద్ద నొచ్చుకుంటున్నారు. సామాజిక, ఆర్థిక పరమైన అంశాల ప్రాతిపదికన తమకే టిక్కెట్టు వస్తుందని కొంత మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ధీమాగా ఉన్నారు. మరోవైపు ఐదు నొక్కిన వారి వివరాలు తీసుకుని వారి పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగిస్తున్నారనీ రాజకీయంగా ప్రచారమవడంతో ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు ఎమ్మెల్యే పనితీరు బాగుందని నాలుగు నొక్కుతున్నారని తెలిసింది. టిడిపి ఎత్తుగడలకు విరుగుడుగా వైసిపి తన కార్యకర్తలను అభిమానులను అప్రమత్తం చేసి ఫోన్ ద్వారా ఏం అడిగినా ప్రభుత్వానికి అనుకూలంగా, ఎమ్మెల్యేల పనితీరు బాగుందని చెప్పండని వైసిపి నేతలు సంకేతాలిస్తున్నారు.

దీంతో వాస్తవ సమాచారం వచ్చే పరిస్థితి లేదని గ్రహించిన టిడిపి అధిష్టానం ఎంపిక చేసుకున్న కొన్ని నంబర్లకే ఫోన్‌లు చేయాలని గ్రామాల్లో తటస్తుల ద్వారా సమాచారం రాబడుతోంది. ఫోన్ల సర్వేతోపాటు పలు సర్వే సంస్థలూ గ్రామాల్లో తిరుగుతూ టిడిపి ఎమ్మెల్యేల పనితీరుపై వివిధ అంశాల ప్రాతిపదికన సర్వే చేయిస్తున్నట్టు సమాచారం. కూడలి ప్రదేశాలు, ఆర్‌టిసి బస్సులు, ప్యాసింజరు రైళ్లు, ఆటోల్లో ప్రయాణిస్తూ సర్వే అని ముందుగా చెప్పకుండా వివరాలు సేకరిస్తున్నారు. కొన్ని బృందాలు నియోజకవర్గ స్థాయి కొన్ని నమూనాలను తీసుకుని సర్వేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. కొంత మంది టిడిపి కార్యకర్తలే తమ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సిఎం చంద్రబాబుకు అనుకూలంగా సర్వేల్లో చెబుతున్న కొన్ని వ్యాఖ్యలు అధిష్టానాన్ని ఇరకాటంలో పడవేస్తున్నాయి.

ఒకే హౌసింగ్ పాలసీ ఉండాలి

28, 29 తేదీల్లో ఫెడరేషన్ రాష్ట్ర సభను జయప్రదం చేయాలి

ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా హౌసింగ్ పాలసీ ఒకే పద్ధతి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యగా ఉన్న ఇళ్లస్థలాల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అమరావతిలో ఉండే జర్నలిస్టులకు రాష్ట్ర క్యాబినెట్ 30 ఎకరాలు కేటాయించి, సొసైటీ ద్వారా ఇవ్వనున్నారని, మిగిలిన మండలాల్లో స్థలాలు ఇస్తుంటే, మరికొన్ని చోట్ల అపార్టుమెంట్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం చెబుతోందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాను వర్కింగ్ జర్నలిస్టుల చట్టంలో చేర్చాలని తమ సంఘం గత కొన్నేళ్లుగా పోరాటం చేస్తోందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. తిరుపతిలో ఈనెల 28,29 తేదీలలో రామతులసి కళ్యాణ మండపంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, జర్నలిస్టుల సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. మహాసభలను రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు ప్రారంభిస్తారని చెప్పారు. అలాగే రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి, సమాచార శాఖ మంత్రి కాలువ శ్రీనివాసులు, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల మనోహర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ, నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు అధ్యక్షులు ఎస్‌కె పాండె, కార్యదర్శి డబ్ల్యు చంద్రకాంత్ పాల్గొంటారని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఎన్ఎజె జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు, జాతీయ సభ్యులు మురళి, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వళిగళం గోపి, చిత్తూరు జిల్లా అక్రిడేషన్ కమిటి సభ్యులు ఎ.శేఖర్ పాల్గొన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు ఏర్పాట్లు

- టెండర్లు పూర్తి కాకుండా చేయడంపై స్థానికుల విస్మయం

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి



విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణాన్ని ప్రభుత్వం రాజకీయంగా వాడుకోవాలని చూస్తోంది. మరో రెండు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎయిర్‌పోర్టు శంకుస్థాపన చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎయిర్‌పోర్టు నిర్మాణ స్థలాన్ని జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ మౌఖిక ఆదేశాల మేరకే కలెక్టర్ ఈ ప్రకటన చేశారని సమాచారం. విజయనగరంలో వచ్చే నెల ఐదున జరిగే సంగీత కళాశాల శతజయంతి వేడుకలకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేయించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 2,700 ఎకరాల సేకరణ ఇంతవరకూ పూర్తయింది. మరో 460 ఎకరాలకు సంబంధించిన రైతులు హైకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నారు. 2016 జనవరి 25న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ జారీ చేసిన నోటిఫికేషన్ చెల్లదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అప్పటి నుంచి విచారణ కొనసాగుతోంది. మరోవైపు ఆర్డినెన్సుతో చేపట్టే భూసేకరణ చెల్లదని, ఇప్పటికే పలు కేసుల్లో తీర్పులు వెలువడ్డాయి. రాజధాని భూసేకరణలో డి-పట్టాకు జిరాయితీ ధర చెల్లించినట్లే, ఇక్కడ కూడా చెల్లించాలని భోగాపురం డి-పట్టా రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం కోర్టుకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం జరగాలంటే టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. గతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణ టెండర్ ప్రక్రియలో సుమారు 22 కంపెనీలు పాల్గొన్నాయి. ఆయా కంపెనీల ప్రతినిధులు ఎయిర్‌పోర్టు ప్రాంతాన్ని సందర్శించారు. కానీ, ఏ ఒక్కరూ నిర్మాణ బాధ్యత చేపట్టేందుకు ముందుకు రాలేదు. దీంతో, ఎయిర్‌పోర్టును ఎవరు నిర్మిస్తారనేది ఇంతవరకూ ఖరారు కాలేదు.

మభ్యపెట్టేందుకే

ఎయిర్‌పోర్టు శంకుస్థాపన అనేది ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రభుత్వం ఆడుతున్న డ్రామా తప్ప, మరొకటి కాదు. కోర్టులో కేసులు విచారణ జరుగుతుండగా, నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి కాకుండా శంకుస్థాపన ఎలా చేస్తారు. కేవలం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం చేస్తున్న హడావుడి ఇది.

-దాట్ల శ్రీదేవి, రైతు నాయకులు

కనీస పెన్షన్ కోసం ధర్నా

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

ఇపిఎస్-95 పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.7,500 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పెన్షనర్లు ధర్నా చేశారు. ఆల్ ఇండియా ఇపిఎస్-95 సంఘర్షణ సమితి జాతీయ కమిటీ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో జోనల్ కో-ఆర్డినేటర్ టి.సాయి భాస్కర ప్రసాద్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుననుసరించిన కోషియరి కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పింఛన్ కంటే కూడా చాలా తక్కువ పెన్షన్ వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగికి, జీవిత భాగస్వామికి వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. తమ వద్ద పింఛన్ కోసం ప్రభుత్వం వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి ఉద్యోగులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కారుణ్యమరణానికి అనుమతి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పింఛనుదారుల సంఘం సభ్యులు ఎల్.మురళీకృష్ణ, ఎన్.నారాయణ, జగన్నాథరావు, వెంకటరత్నం, సదాశివరావు, జి.పేరయ్య, ఉమామహేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సుస్థిరతకు ముప్పు లేదు

కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య

బెంగళూరు : ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వ సుస్థిరతకు ఎలాంటి ముప్పు లేదని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనవరి 18న జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ సమావేశానికి హాజరుకాని నలుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశామని వారిలో ఉమేష్ జాదవ్ తప్ప మిగతా వారు స్పందించినట్లు సిద్ధరామయ్య తెలిపారు. ఎమ్మెల్యేల స్పందనపై పార్టీలో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బిజెపి నేతలతో టచ్‌లో ఉన్నారని మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన తెలిపారు.



గణతంత్ర దినోత్సవ పెరేడ్‌కోసం రిహార్సల్ చేస్తున్న సైనికదళాలు

ప్రియనందన్‌పై హిందూత్వ మూకల దాడి

ఖండించిన విజయన్

తిరువనంతపురం : జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ దర్శకుడు టిఆర్. ప్రియనందన్‌పై శుక్రవారం ఉదయం కొందరు దుండగులు దాడి చేశారు. శబరిమల ఆలయంలోకి మహిళలు ప్రవేశించకుండా కొందరు ఉద్దేశపూర్వకంగానే విభేదిస్తున్నారంటూ ఇటీవల ప్రియనందన్ ఒక గేయాన్ని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. దీంతో ఆగ్రహించిన దుండగులు త్రిస్సూర్ జిల్లా వలచిరా పట్టణంలోని తన నివాసం వద్ద దాడి చేసినట్లు తెలిపారు. తన తలపై, ముఖంపై పిడిగుద్దులు కురిపించారని, అనంతరం పేడ నీళ్ల చల్లినట్లు నందన్ పేర్కొన్నారు. కాగా, సామాజిక న్యాయం, లౌకికవాదం కోసం పోరాడుతున్న మేధావులను లక్ష్యంగా చేసుకుని ఆర్ఎస్ఎస్ గూండాలు ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులను రాష్ట్రం సహించబోదని విజయన్ పేర్కొన్నారు.

శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంపై తన అభిప్రాయాలు వెల్లడించినందుకు కాషాయ మూక ప్రియనందన్‌పై దాడులకు పాల్పడిందని విజయన్ పేర్కొన్నారు. గతంలో కూడా ఆయన నివాసం ఎదుట హిందూత్వ మూకలు ఆందోళన నిర్వహించాయని, చంపుతామని బెదిరించినట్లు కూడా పేర్కొన్నారు. ఈ దాడిని తీవ్రంగా పరిగణించి నిందితులపై వెంటనే చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

ఆర్ఎస్ఎస్ కార్యకర్త అరెస్ట్

ప్రముఖ దర్శకుడు టిఆర్. ప్రియనందన్‌పై దాడి ఘటనలో నిందితుడైన ఆర్ఎస్ఎస్ కార్యకర్త సరోవరన్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. దర్శకుని ఫిర్యాదు మేరకు కొడంగల్లూర్‌కు చెందిన అతనిని ఐపిసిలోని ఉద్దేశ్య పూర్వకంగా దాడికి పాల్పడటం, అనుచితంగా ప్రవర్తించడం వంటి సెక్షన్ల కింద అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

వెనిజులా ప్రజలే పరిష్కరించుకోవాలి

స్పష్టం చేసిన భారత్

న్యూఢిల్లీ : వెనిజులా ప్రతిపక్ష నేత జువాన్ గెయిడోని తాత్కాలిక అధ్యక్షుడిగా గుర్తించాలంటూ అమెరికా చేసిన విజ్ఞప్తిని భారత్ తోసిపుచ్చింది. నిర్మాణాత్మకమైన చర్చల ద్వారా వెనిజులా ప్రజలే ఈ సంక్షోభాన్ని పరిష్కరించుకోవాలని వ్యాఖ్యానించింది. ఎలాంటి హింసకు పాల్పడకుండా కేవలం చర్చల ద్వారా తమ మధ్య విభేదాలకు రాజకీయ పరిష్కారాన్ని కనుగొనాల్సింది వెనిజులా ప్రజలేనని భారత్ గట్టిగా విశ్వసిస్తోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రవీష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెనిజులాలో శాంతి భద్రతలు, ప్రజాస్వామ్యం నెలకొనడం ఆ దేశ ప్రజల ప్రగతికి, సౌభాగ్యానికి చాలా ముఖ్యమైన అంశమని ఆ ప్రకటన పేర్కొంది. భారత్, వెనిజులా మధ్య సన్నిహిత, సుహృద్భావ సంబంధాలున్నాయని అన్నారు. వెనిజులా ప్రజలే వారి సమస్యను పరిష్కరించుకోవాలని, వారి భవిష్యత్‌ను నిర్ణయించుకోవాలని భారతదేశం గట్టిగా కోరుకుంటోందని అన్నారు. స్థానికంగా వుండే రాజకీయ నేతలెవరూ హింసకు దారితీసేలా ఏకపక్షంగా చర్యలు తీసుకోరాదన్నది తమ భావన అని,నిర్మాణాత్మకమైన చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని రవీష్ కుమార్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. కాగా వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోకి రష్యా, చైనా, భారత్‌లు సంపూర్ణ మద్దతు తెలిపాయి. రాజ్యాంగ చట్రపరిధిలో పరిష్కారం కనుగొనాల్సిందిగా పుతిన్ కోరారు. శాంతియుతమైన చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని కోరారు.

అమెరికా కుట్రలను వ్యతిరేకించండి

ప్రధానికి ఏచూరి లేఖ

ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో నేతృత్వంలోని ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించాలని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి ప్రధాని నరేంద్రమోడీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రధానికి ఒక లేఖ రాశారు. వెనిజులా ప్రతిపక్ష నేతను ఆ దేశ అధ్యక్షుడిగా గుర్తించినట్లు ప్రకటించటం ద్వారా అమెరికా ప్రజల తీర్పును కాలరాసిందని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో మదురో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికయ్యారని, ఈ ఎన్నికలు పారదర్శకంగా, న్యాయబద్ధంగా జరిగాయని వివిధ దేశాల నుండి వచ్చిన పరిశీలకులు నిర్ధారించారని ఏచూరి తన లేఖలో గుర్తు చేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన వెనిజులా ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలను భారత ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చాలని ఆయన కోరారు. అదే విధంగా వెనిజులాపై విధించిన ఆర్థిక ఆంక్షలను, సైనిక చర్య బెదిరింపులను ఖండించాలని ఏచూరి విజ్ఞప్తి చేశారు. అమెరికా చర్యలు ఐరాస ఛార్టర్‌కు పూర్తివిరుద్ధమైనవన్న విషయాన్ని ప్రధాని అంగీకరిస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం ప్రజాస్వామ్యం, స్వతంత్ర దేశాల సార్వభౌమత్వ పరిరక్షణకు కట్టుబడి వుందన్న విషయాన్ని ప్రపంచానికి స్పష్టం చేయాలని, వెనిజులా ప్రజలకు తమ ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు వుందన్న విషయాన్ని చాటి చెప్పాలని ఆయన ప్రధానిని కోరారు.

'కట్టుతప్పిన' పశువులు కాదు.. 'నిర్వాసిత' అనండి...!

భారత పశుసంక్షేమ బోర్డు ఆదేశం

న్యూఢిల్లీ: వట్టిపోయి రైతులు వదిలిపెట్టిన పశువులను 'కట్టుతప్పిన' పశువులని కాక 'నిర్వాసిత' పశువులని పిలవాలని భారత జంతు సంక్షేమ బోర్డు (ఎడబ్ల్యుఐబి) ఆదేశాలు జారీ చేసింది. అధికారిక కమ్యూనికేషన్లన్నింటిలోనూ ఈ విధంగా పేర్కొనాలని సూచించింది. ఆవులు, గేదెలు వంటి పాడి పశువులకు మాత్రమే కాక అన్ని రకాల జంతువులను ఇదే విధంగా పేర్కొనాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాల ద్వారా పశువులు ఇప్పుడు క్రీమీలేయర్ జాబితాలోకి చేరాయని, మనుషులకు అందని ప్రయోజనాలను పొందుతున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. కట్టుతప్పి విచ్చలవిడిగా తిరుగుతున్న పశువుల కోసం విద్యార్థులను ఖాళీ చేయించి స్కూళ్లను కేటాయిస్తున్నారు. తమ సాగుభూములపై పడి పంటలను ధ్వంసం చేస్తున్న ఈ పశువుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు వాటిని క్లాస్‌రూమ్‌ల్లోకి తోలేస్తున్నారు. దీనితో పాఠశాలలు ఇప్పుడు గోశాలలుగా మారిపోతున్నాయి. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా పశుశాలలుగా మారిపోతున్నాయి. దీంతో అక్కడి వైద్యులు రోగుల ఆరోగ్యంపై దృష్టి పెట్టలేకపోతున్నారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రైతులు తరిమి వేస్తున్న పశువులకు ఆశ్రయం కల్పించే వారికి ప్రత్యేక నిధులు కేటాయించేందుకు యుపి సర్కారు సిద్ధమవుతోంది. ఇందుకోసం మద్యంపై అదనపు సెస్సు విధించాలన్న ప్రతిపాదనకు యోగి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇటువంటి పశువులకు ఆశ్రయం కల్పించటంలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకుంటామని కూడా ప్రకటించేసింది.

రక్షణ రంగ ఉద్యోగులకు సిటూ అభినందనలు

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

దేశ రక్షణ ఉత్పత్తులు, సేవల రంగాన్ని పరిరక్షించుకునేందుకు మూడు రోజులు వీరోచిత పోరాటాన్ని విజయవంతంగా నిర్వహించిన రక్షణ రంగ సివిలియన్ ఉద్యోగులు, వారి సంఘాలకు సిఐటియు అభినందనలు తెలియచేసింది. రక్షణ రంగ ఉత్పత్తులు, సేవల రంగాన్ని ప్రైవేటీకరణ, ఔట్‌సోర్సింగ్ చేసేందుకు కేంద్రంలోని బిజెపి సర్కారు చేస్తున్న ప్రయత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టారని సిటూ తన ప్రకటనలో పేర్కొంది. రక్షణ ఉత్పత్తులు, సేవల రంగాన్ని ప్రమాదపుటంచుల్లోకి నెడుతున్న బిజెపి సర్కారు ప్రయత్నాలను ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌తో సహా రక్షణ రంగంలోని ఉద్యోగసంఘాలన్నీ ముక్తకంఠంతో వ్యతిరేకించాయని తెలిపింది. 42 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, డిఆర్‌డిఓ, మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ సెంటర్లు, ఆర్మీ స్టేషన్ వర్క్‌షాపుల వంటి వ్యవస్థలు దేశ సైన్యానికి అందిస్తున్న పరికరాలు సేవలను దేశ విదేశీ కంపెనీలకు అప్పగించేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నించటం సిగ్గుచేటని సిటూ తన ప్రకటనలో విమర్శించింది. ఇటీవలి కాలంలో హడావుడిగా కుదుర్చుకున్న అనేక రక్షణ కొనుగోళ్ల ఒప్పందాల వెనుక దాగిన భారీ కుంభకోణాలు దేశ ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టాన్ని మిగిల్చాయని ఆందోళన వ్యక్తం చేసింది. దేశ ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ఈ వినాశకర విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన రక్షణ రంగ ఉద్యోగులు, వారి సంఘాలకు సిటూ మరోసారి అభినందనలు తెలియచేసింది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యపోరాటాన్ని కొనసాగించాలని సూచించింది.


హర్యానా మాజీ సిఎం నివాసంలో సిబిఐ సోదాలు

రోహతక్ : భూ కేటాయింపుల్లో అక్రమాలకు పాల్పడిన కేసులో హర్యానా మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత భూపిందర్ సింగ్ హుడా నివాసంలో శుక్రవారం ఉదయం సిబిఐ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి చెందిన పలు ప్రాంతాల్లో ఉన్న సంస్థలపై కూడా ఈ దాడులు చేపట్టినట్లు సిబిఐ వెల్లడించింది. ఢిల్లీలోని హుడా నివాసంతో పాటు 30 ప్రాంతాలలో సోదాలు నిర్వహించినట్లు తెలిపింది.

హుడాతో పాటు అప్పటి హర్యానా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ ఐఎఎస్ అధికారి టి.సి.గుప్తా తదితరులు 2009-2012 మధ్య కాలంలో గురుగ్రామ్‌లోని 1,417 ఎకరాల భూమిని అక్రమంగా కేటాయించారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సిబిఐ కేసు నమోదు చేసింది. పంచకులలోని ఒక ప్లాట్‌ను జర్నల్స్ లిమిటెడ్‌కు అక్రమంగా కేటాయించడంతో పాటు గురుగ్రామ్‌లోని భూమిని రైతులకు నష్టం కలిగించే విధంగా కేటాయించినట్లు ఆయనపై కేసులు నమోదయ్యాయి.

నవ భారత నిర్మాణంలో చేతులు కలపండి

- వైవిధ్యం, ప్రజాస్వామ్యం, అభివృద్ధే పునాదులు
- బహుళత్వమే మన బలం
- రిపబ్లిక్ డే ప్రసంగంలో రాష్ట్రపతి ఉద్బోధ



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పవిత్రమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల్సిందిగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దేశ ప్రజలను కోరారు. ఈ ఏడాది ఎన్నికలను 21వ శతాబ్దంలో దేశానికి దిశానిర్దేశం చేసేందుకు లభించిన అద్భుత అవకాశంగా పరిగణించాలని పేర్కొన్నారు. ఎన్నికలు అంటే కేవలం రాజకీయ క్రమం కాదు, విజ్ఞత, వివేచన, కార్యాచరణకు ఇచ్చే ఉమ్మడి పిలుపు అని వ్యాఖ్యానించారు. మన ప్రజాస్వామ్య సిద్ధాంతాలు, ఆదర్శాలు 17వ లోక్‌సభను ఎన్నుకోవడంలో ప్రతిబింబించాలని అన్నారు. భారత 70వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. వైవిధ్యం, ప్రజాస్వామ్యం, అభివృద్ధి అనే మూడు అంశాలే పునాదిగా బహుళత్వంలో ఏకత్వం అన్న భావనతో భారత్ పరిఢవిల్లుతోందని అన్నారు. ఈ మూడు అంశాల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకుని ముందుకు సాగలేం. ఈ మూడింటితోటే మన పయనం సాగాలి అని రాష్ట్రపతి ఉద్బోధించారు. "ఈ దేశం మనందరిది. మనలో ప్రతి ఒక్కరిదీ. ప్రతి గ్రూపు, ప్రతి కమ్యూనిటీ, ప్రతి మతానిది, ప్రతి ఒక్క పౌరుడిది. బహుళత్వమే భారతదేశానికున్న అతి పెద్ద బలం, ప్రపంచానికి అతి గొప్ప ఉదాహరణ కూడా ఇదేనని అన్నారు. ప్రస్తుతం మన దేశం చాలా కీలకమైన దశలో వుంది. కొన్ని అంశాలకు సంబంధించి చాలా సంక్లిష్టమైన దశలో అంటే 1940 దశకం చివరిలో, 1950వ దశకం తొలినాళ్ళలోలా వుంది. ఈనాటి నిర్ణయాలు, చర్యలే రేపటి భారతాన్ని రూపుదిద్దుతాయి, నిర్దేశిస్తాయని అన్నారు. దేశ నిర్మాణంలో యువతరం పాత్ర చాలా కీలకమైందని అన్నారు. ఇందుకు సంబంధించి మనం చేయాల్సిన ప్రయాణం ఇంకా చాలా వుందని అన్నారు. "ఇంకా భర్తీ చేయాల్సిన అంతరాలు వున్నాయి. ఇంకా తుడవాల్సిన కన్నీళ్ళు వున్నాయని" ఆయన వ్యాఖ్యానించారు. మనం సాధించిన విజయాలకు సంబంధించిన ప్రమాణాలను సమీక్షించుకోవాల్సి వుందని అన్నారు. ఎన్ని విజయాలు సాధించామనే దానికన్నా ఆ విజయాలు ఎంత నాణ్యతతో కూడినవనే దానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అక్షరాస్యత పొందిన సమాజం నుండి విజ్ఞాన సమాజానికి పరివర్తన చెందాలన్నారు. ప్రతి ఒక్క వ్యక్తిలోని విశిష్టతను, శక్తి సామర్థ్యాలను ప్రోత్సహించగలగాలని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఇటీవల ఆర్థికంగా బలహీన వర్గాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకువచ్చిన రాజ్యాంగ సవరణను ప్రస్తావిస్తూ, మనం కన్న కలలు, గాంధీజీ కలలు సాకారం చేసే దిశగా ఇదొక అద్భుతమైన చర్య అని కొనియాడారు. వెనుకబడిన వర్గాలు లేదా గ్రూపులతో నిజాయితీగా చర్చలు జరగాలని, వారి సాధకబాధలు కూడా వినాలని, అటువంటి చర్చలు, సంభాషణలకు మంచి వేదికలను సృష్టించాల్సిన అవసరం కూడా వుందని అన్నారు. వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్న ప్రస్తుత సమాజంలో అటువంటి చర్చలకు మనం సన్నద్ధం కావాలని కోరారు. మనకన్నా వెనుకబడిన వారి పట్ల మనం ఎల్లప్పుడూ కరుణ, దయతో మెలగాల్సిన అవసరం వుందన్నారు. ప్రజాస్వామ్య లక్ష్యాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో, రాజ్యాంగపరమైన లక్ష్యాలను రాజ్యాంగపరమైన పద్ధతుల్లో చేరుకోవాలన్నది మన దేశ దార్శనికత అని కోవింద్ పేర్కొన్నారు. లింగ సమానత్వం, అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే భారతదేశంలో సామాజిక మార్పుకు ప్రధాన సూచిక అని ఆయన పేర్కొన్నారు. ఈనాడు దేశంలో యువ మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు, కళల నుండి కదన రంగం దాకా వారికి తిరుగు లేకుండా పోయిందని, ఈ ప్రయాణం ఆగకూడదని, ఈ క్రమంలో వారు వెనుతిరగరాదని అన్నారు. భారతదేశ భవితవ్యానికి ఇదే సరైన పంథా అని ఆయన పేర్కొన్నారు.

కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారం పెంపు

ఒప్పందంపై సంతకాలు చేసిన భారత్, దక్షిణాఫ్రికా



న్యూఢిల్లీ : మూడేళ్ళపాటు కొనసాగే వ్యూహాత్మక మార్పిడి కార్యక్రమానికి భారత్, దక్షిణాఫ్రికాలు శుక్రవారం ఆమోదముద్ర వేశాయి. కీలకమైన పలు రంగాల్లో సహకారాన్ని మరింత పెంచేందుకు ఈ కార్యక్రమం వూతమిస్తుంది. ప్రధాని నరేంద్ర మోడీ, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా మధ్య చర్చలు ముగిసిన అనంతరం మోడీ పత్రికా ప్రకటన చేస్తూ, భిన్నమైన రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకునే లక్ష్యంతో ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన అన్ని అంశాలను ఉభయ పక్షాలు చర్చించాయని చెప్పారు. రామఫోసా మాట్లాడుతూ, ఈ మూడేళ్ళ వ్యూహాత్మక కార్యక్రమాన్ని అమలు పరచడం ద్వారా భారత్‌తో ఫలితాన్నిచ్చే భాగస్వామ్యం కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, మత్స్య పరిశ్రమ, పర్యాటకం, ఐటి, వ్యవసాయం వంటి రంగాల్లో సహకారం పెంపునకు ఈ కార్యక్రమం ఉపయోపడుతుందన్నారు. శుక్రవారం ఉదయమే ఢిల్లీ చేరుకున్న రమఫోసా శనివారం భారత గణతంత్ర దినోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు.

గాంధీ సమాధిని సందర్శించిన దక్షిణాఫ్రికా నేత

భారత్‌లో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన రమఫోసాకు ఇక్కడ రాష్ట్రపతి భవన్ వద్ద ఘన స్వాగతం లభించింది. తర్వాత ఆయన మహాత్మా గాంధీ సమాధిని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్‌ను సందర్శించడం చాలా సంతోషంగా వుందన్నారు. మహాత్మాగాంధీ, నెల్సన్ మండేలా సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మానవ హక్కులు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం పట్ల ఇరువురు నేతలకు గొప్ప గౌరవం వుందన్నారు. మనందరికీ వారు ఒక మార్గనిర్దేశనం చేశారని కొనియాడారు. అధ్యక్షుడి వెంట ఫస్ట్ లేడీ డాక్టర్ షెపో మోసెప్, 9మంది మంత్రులు, సీనియర్ అధికారులు, 50మంది సభ్యులతో కూడిన వాణిజ్య ప్రతినిధి వర్గం వుంది.

కొత్త ధర్మాసనానికి అయోధ్య కేసు

ఈనెల 29 నుంచి విచారణ

న్యూఢిల్లీ: అయోధ్య వివాదంపై దాఖలైన పిటిషన్లను విచారించ డానికి సుప్రీం కోర్టులో ఐదుగురు సభ్యుల కొత్త ధర్మా సనం ఏర్పాటయ్యిం ది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నూతన ధర్మాసనాన్ని ప్రకటించారు. రంజన్ గొగోయ్ నేతృత్వం వహిస్తున్న ఈ బెంచ్‌లో జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ అశోక్ భూషణ్‌లను కొత్తగా తీసుకున్నారు. వీరితో పాటు జస్టిస్ ఎస్ఎ బోడ్గే, జస్టిస్ డివై చంద్రచూడ్‌లు ధర్మాసనంలో సభ్యులుగా ఉన్నారు. గతంలో ఐదుగురి బెంచ్‌లో సభ్యుడిగా ఉన్న జస్టిస్ ఎన్‌వి రమణను కొత్త బెంచ్ నుంచి పక్కనబెట్టారు. కాగా, ఈ కేసు విచారణ ఈనెల 29 నుంచి ప్రారంభం కానుంది. కేసు విచారణలో భాగంగా ఈనెల 11న అప్పటి ఐదుగురి సభ్యుల ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్న జస్టిస్ యు యు లలిత్.. ఈ కేసు నుంచి తప్పుకున్న విషయం విదితమే.

855 మంది పోలీసు అధికారులకు మెడల్స్

న్యూఢిల్లీ : గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ ఏడాది దాదాపు 855 మంది పోలీసులు మెడల్స్ అందుకోనున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వారికి మెడల్స్‌ను బహూకరిస్తారు. ముగ్గురు అధికారులు రాష్ట్రపతి శౌర్య పతకాలను అందుకోనుండగా, 146 మంది పోలీసు శౌర్య పతకాలు అందుకోనున్నారు. దాదాపు 74 మంది తామందించిన విశేష సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి పోలీసు మెడల్స్‌ను అందుకోనుండగా, ప్రతిభావంతమైన సేవలు అందించినందుకు గాను 632 మంది మెడల్స్ అందుకోనున్నారు. పోలీసుల సేవలను గుర్తిస్తూ అందించే మెడల్స్‌లో రాష్ట్రపతి శౌర్య పతకం (పిపిఎంజి) అత్యున్నతమైనది కాగా, రెండో అత్యున్నత మెడల్ పోలీసు శౌర్య పతకం (పిఎంజి). ఈ మూడు శౌర్య పతకాలను సెంట్రల్ రిజర్వు పోలీసు ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) సిబ్బందికి అందిస్తారు. మొత్తం 146 శౌర్య పతకాలలో సిఆర్‌పిఎఫ్‌కు 41, ఒడిషా పోలీసులకు 26, జమ్మూ కాశ్మీర్ పోలీసులకు 25, చత్తీస్‌గఢ్ పోలీసులకు 14, మేఘాలయ పోలీసులకు 13, ఉత్తరప్రదేశ్ పోలీసులకు 10, బిఎస్ఎఫ్‌కు 8, ఢిల్లీకి 4, జార్ఖండ్‌కు 3, అస్సాం రైఫిల్స్‌కు 1, ఐటిబిపికి 1 బహూకరిస్తారు.

ఆలీబాగ్‌లోని నీరవ్‌మోడీ అక్రమ కట్టడం కూల్చివేత

రాయ్‌గఢ్: పంజాబ్ నేషనల్ బ్యాంకులో రు.13 వేల కోట్ల రుణాన్ని ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ మహారాష్ట్రలోని ఆలీబాగ్ సముద్రతీరంలో నిర్మించిన నివాస భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. రు.100 కోట్ల వ్యయంతో 33 వేల చ.అడుగుల విస్తీర్ణంలో నిర్మితమైన ఈ విలాసభవనం అనేక హైప్రొఫైల్ విందులకు వేదికగా నిలిచింది. ఈ భవనాన్ని చట్ట నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని, తీర ప్రాంత నిర్మాణ నిబంధనలను అతిక్రమించారని రాయ్‌గఢ్ కలెక్టర్ సూర్యవంశి చెప్పారు.

ఇసి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు

న్యూఢిల్లీ : ఇవిఎంల ద్వారా ఎన్నికలలో రిగ్గింగ్‌కు పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలపై ఎలక్షన్ కమిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. 2014 లోక్‌సభ ఎన్నికలలో ఇవిఎంలను హాకింగ్ చేసి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని లండన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సైబర్ నిపుణుడుగా చెప్పుకుంటున్న సయ్యద్ షుజా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీంతో ఇసి ఫిర్యాదు మేరకు ఐపిసి సెక్షన్ 505 కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పుకార్లను వ్యాపింప చేయడంతో పాటు ప్రజల మనస్సులో సందేహాలు రేకెత్తించినందుకు తక్షణమే ఈ కేసులో దర్యాప్తు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మద్యం పై సుంకాలు తగ్గించండి

భారత్‌కు ట్రంప్ విజ్ఞప్తి

వాషింగ్టన్: తమ దేశం నుండి దిగుమతి చేసుకునే మద్యంపై విధిస్తున్న సుంకాలను తగ్గించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు విజ్ఞప్తి చేశారు. అమెరికా-భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఇప్పటికే అమెరికన్ తయారీ హార్లీ డేవిడ్‌సన్ మోటార్‌సైకిళ్లపై భారత్ దిగుమతి సుంకాలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు అమెరికన్ మద్యం దిగుమతులపై వసూలు చేస్తున్న సుంకాలు అత్యధికస్థాయిలో వున్నాయని, వాటిని కూడా రద్దు చేయాలని ట్రంప్ కోరారు.

పెళ్లి కూతురి 'కిడ్నాప్'

సాయుధ దుండగుల దుశ్చర్య, కేసు నమోదు

చండీగర్/ ముక్తసర్ : వివాహ అలంకరణ కోసం బ్యూటీ పార్లర్‌కు వెళ్లిన ఒక యువతిని ఇద్దరు సాయుధ దుండగులు అపహరించిన ఘటన పంజాబ్‌లో జరిగింది. వివరాల ప్రకారం ... ఫజిల్కా జిల్లాలోని ఒక గ్రామానికి చెందిన 30 ఏళ్ల యువతి తనపెళ్లికి ముస్తాబయ్యేందుకు తన సోదరులతో పాటు శుక్రవారం ఉదయం బ్యూటీ పార్లర్‌కు వెళ్లింది. అయితే వారు పార్లర్ వద్ద దింపి వెళ్లిన కొన్ని నిమిషాల అనంతరం రెండు కార్లలో వచ్చిన సాయుధ దుండగులు ఆమెను కిడ్నాప్ చేశారు. యువతి ప్రతిఘటించినా ఫలితం లేకపోయింది.

పౌరసత్వ బిల్లును ఉపసంహరించండి

- సిపిఎం డిమాండ్
- ఫిబ్రవరి 4న దేశ వ్యాప్త ఆందోళనలకు పిలుపు



ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ : జాతీయ పౌరసత్వ నమోదు (సవరణ) బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 4న దేశ వ్యాప్త నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు సిపిఎం పొలిట్ బ్యూరో శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొంది రాజ్యసభ ఆమోదానికై వేచిఉన్న ప్రతిపాదిత బిల్లుపై ఈశాన్య రాష్ట్రాలలో వెల్లువెత్తుతున్న నిరసనలపట్ల పొలిట్ బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జాతి, మత, కుల, సాంస్కృతిక వైవిధ్యాలకు అతీతంగా ప్రజలందరికీ పౌరసత్వం కల్పించాలన్న రాజ్యాంగ మూల సూత్రాన్ని ఈ పౌరసత్వ (సవరణ) బిల్లు ఉల్లంఘిస్తోందని పొలిట్ బ్యూరో పేర్కొంది. ఈ ప్రతిపాదిత బిల్లుతో భిన్నత్వంలో ఏకత్వమనే భావన దెబ్బతినే ప్రమాదముందన్నారు. ఈ బిల్లు మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని కల్పిస్తోందని పేర్కొంది. దేశంలో వైవిధ్యాలకు నిలయంగా ఈశాన్య రాష్ట్రాలున్నాయని తెలిపింది. ఈ ప్రాంతంలోని వివిధ తరగతులకు చెందిన భిన్నమైన ప్రజల మధ్య జీవనోపాధి విషయంలో అభద్రత కొనసాగుతున్నదని పేర్కొంది. ఈ మధ్యకాలంలోనే ఈ ప్రాంతంలో శాంతి నెలకొని ఉన్నది. ఈశాన్య ప్రాంతంలో పౌరసత్వ (సవరణ) బిల్లు అక్కడి స్థిరత్వాన్నిదెబ్బతీస్తున్నదని తెలిపింది. అస్సాంతో పాటు పలు ఈశాన్య రాష్ట్రాలలో ప్రజలు వీధుల్లోకి వచ్చి బిల్లుపై నిరసన తెలుపుతున్నారు. ప్రభుత్వం ప్రజలలో అభద్రతా భావాన్ని, ఉద్రిక్తతకు దారి తీస్తున్న పరిణామాలను గుర్తించి, పరిస్థితులు చేజారకముందే ప్రతిపాదిత బిల్లును ఉపసంహరించుకోవాలని పొలిట్ బ్యూరో పేర్కొంది. ఈ బిల్లును మరింత ముందుకు తీసుకెళ్ళకుండా, ఇంతటితో ఉపసంహరించుకోవాలని పొలిట్ బ్యూరో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలోనే ప్రతిపాదిత బిల్లును ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 4న దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని పార్టీ శాఖలన్నిటికీ పొలిట్ బ్యూరో పిలుపునిచ్చింది. మన దేశంలో నెలకొన్న భిన్నత్వంలోని ఏకత్వ భావన, దేశ పౌరసత్వానికి ఒకే ప్రాతి పదిక ఉండాలని భావిస్తున్న అన్ని పార్టీలు, సంఘాలు, ప్రజలు ఈ నిరసన ఆందోళనల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేసింది.

బిజెపివి విచ్ఛిన్న రాజకీయాలు : రాహుల్ ధ్వజం

బిజెపి రాజకీయ లబ్ది కోసం మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ విచ్ఛిన్న రాజకీయాలకు పాల్పడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ బిల్లు-2019పై ఈశాన్య రాష్ట్రాల్లో పెరుగుతున్న నిరసనలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాహుల్ శుక్రవారం ట్విట్టర్‌లో స్పందించారు. బిజెపి మతాన్ని అడ్డుపెట్టుకొని ఈశాన్యంలో చేస్తున్న విధ్వంసంపై ఆందోళన చెందుతున్నానన్నారు. ఇటువంటి చర్యలతో సోదరులుగా మెలిగే దేశ ప్రజల మధ్య విభేదాలు పెరుగుతాయని, బిజెపి తక్షణం మత రాజకీయాలకు స్వస్తి పలకాలని రాహుల్ డిమాండ్ చేశారు. పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాలు నుంచి భారత్‌కు వచ్చే ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించబడిందే ఈ బిల్లు. దీనిపై ఇప్పటికే లోక్‌సభ ఆమోదం తెలిపింది.

బిల్లు రద్దు చేయాల్సిందే...

లేదంటే..ఎన్డీయే నుంచి బయటకు : మిజోరాం సీఎం


పౌరసత్వ బిల్లు వెనెక్కి తీసుకోకపోతే, భారతీయ జనతా పార్టీతో సంబంధాలు తెగతెంపులు చేసుకుం టామని మిజోరాం సీఎం జోరంతంగా హెచ్చరిం చారు. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందకుండా తమ ప్రభుత్వం, తమ పార్టీ అన్నివిధాలా ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. శీతాకాలం పార్లమెంట్ సమావేశాల్లో పౌరసత్వ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపగా, బడ్జెట్ సమావేశాల్లో బిల్లు రాజ్యసభ ఆమోదానికి రానున్నది. ఈనేపథ్యంలో ఈశాన్య రాష్ట్రాల్లో అనేక పార్టీలు బిల్లుకు వ్యతిరేకంగా గళమెత్తాయి. దీనిపై తాజాగా మీడియాతో సీఎం జోరంతంగా మాట్లాడుతూ, "బిల్లును రద్దు చేయాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసింది. ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌ను కలిసి మా వ్యతిరేకత, నిరసనను తెలియజేశా"మని అన్నారు. గతేడాది డిసెంబరులో మిజోరాం అసెంబ్లీకి ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో 40 స్థానాలకుగాను 26స్థానాల్ని మిజో నేషనల్ ఫ్రంట్ కైవసం చేసుకొని అధికారాన్ని చేపట్టింది. ఈశాన్య రాష్ట్రాల్లోని వివిధ పార్టీలతో బీజేపీ 'నార్త్ ఈస్ట్ డెమొక్రటిక్ అలయెన్స్' కూటమిని ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఈ కూటమిలో మిజో నేషనల్ ఫ్రంట్ కూడా ఒక పార్టీగా కొనసాగుతోంది.

ఇండోనేషియాలో వరదలో చిక్కుకొని 59 మంది మృతి

జకార్తా : ఇండోనేషియాలో వరదలు పోటెత్తాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. వరదల్లో చిక్కుకొని 59 మంది మృతి చెందారు. 46 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రాణ భయంతో 3,400 మంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. సులవేసీ దీవిలో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. 9జిల్లాలోని నదులు పొంగిపొర్లుతున్నాయని దక్షిణ సులవేసీ డిజాస్టర్ మిటిగేషన్ ఏజెన్సీ చీఫ్ శ్యామ్‌సిబార్ తెలిపారు. గోవా జిల్లాలో అపార ప్రాణనష్టం జరిగిందని చెప్పారు. ఈ ప్రాంతంలో వరదల్లో చిక్కుకొని 44 మంది మృతిచెందారని అన్నారు. ప్రత్యేక బృందాలు ఈప్రాంతంలో సహాయక చర్యలు చేపట్టాయని అన్నారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమట్టం కావడంతో విద్యుత్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మకాసర్ ప్రాంతంలో రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. వరద ఉధృతి అధికంగా ఉన్న ప్రాంతాల ప్రజలు పాఠశాలల్లో, మసీదుల్లో , దేవాలయాల్లో తలదాచుకున్నారు. ఇండోనేషియా సైన్యం సహాయక చర్యల్లో పాల్గొంటున్నది.



ట్రంప్ కీలక అనుచరుని అరెస్ట్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రచార సభ్యుడు రోగర్ స్టోన్‌ను అరెస్ట్ చేసినట్టు ఎఫ్‌బీఐ వెల్లడించింది. ఫ్లోరిడా నగరంలో ఆయనను అదుపులోకి తీసుకున్నట్టు ధ్రువీకరించింది. ఆయనపై పలు క్రిమినల్ కేసులతో పాటు సాక్ష్యాలను తారుమారు చేసిన కేసును నమోదు చేశామని తెలిపింది. స్పెషల్ కౌన్సిల్ రాబర్ట్ ముల్లెర్ రోగర్ స్టోన్‌ను విచారించనున్నారు. కాగా,2016లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందనే ఆరోపణలు వచ్చాయి. డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి, అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్‌కు సంబంధించిన వ్యక్తిగత, రహస్య సమాచారం ఎన్నికలు సమీపించే ముందు లీకైంది. అయితే, ఈ లీకేజీ వెనుక రష్యా హస్తముందని డెమోక్రాటిక్ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.

స్వాజిలాండ్ కార్మిక సమ్మెకు కమ్యూనిస్టు పార్టీ సంఘీభావం

ఎంబబనె : స్వాజిలాండ్ ప్రభుత్వ రంగ కార్మికుల దేశ వ్యాపిత సమ్మెకు స్వాజిలాండ్ కమ్యూనిస్టు పార్టీ తన సంఘీభావాన్ని ప్రకటించింది.. వేతన పెంపు జరగాలన్నది అన్ని యూనియన్ల ప్రధాన డిమాండ్‌గా వున్నది. ఈ డిమాండ్ సాధనకై జనవరి 28న విధులను బహిష్కరించి సమ్మెకు దిగుతున్నారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించేవరకు సమ్మె తప్పదని హెచ్చరించారు. స్వాజిలాండ్ రాజు సమ్మెను విఫలం చేసేందుకు పలు ప్రయత్నాలు సాగిస్తున్నారని స్వాజిలాండ్ కమ్యూనిస్టు పార్టీ హెచ్చరించింది. స్వాజిలాండ్ ప్రభుత్వ రంగ కార్మికులకు ప్రపంచంలోకెల్లా అతి తక్కువ వేతనాలు చెల్లించబడుతున్నాయి. దేశంలోని 70శాతానికి పైగా జనాభా రోజుకు రెండు డాలర్ల కన్నా తక్కువ మొత్తంతోనే బతుకుతోంది.

ఇరాన్‌పై అమెరికా తాజా ఆంక్షలు

వాషింగ్టన్: సిరియా తరపున పోరాడుతున్న రెండు సంస్థలకు ఇరాన్ మద్దతు ఇస్తోందని ఆరోపిస్తూ, ఆ దేశంపై అమెరికా మరో విడత ఆంక్షలు విధించింది. ఇరాన్‌కుచెందిన రెండు వైమానిక సంస్థలపై ఆంక్షలు విధిస్తూ అమెరికా ఆర్థిక శాఖ గురువారం ఆదేశాలు జారీ చేసింది. సిరియా ఈ ఉగ్రవాద సంస్థల్లో ఆఫ్ఘన్, పాకిస్తానీ శరణార్థులను, ఇరాన్‌లో నివసిస్తున్న వలసవాసులను, ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషన్ గార్డ్స్ కార్ప్స్ నియమిస్తోందని, అందువల్లే ఈ ఉగ్రవాద సంస్థలపై తాము ఆంక్షలు విధిస్తున్నామని అమెరికా ఆర్థిక శాఖ తన ప్రకటనలో పేర్కొంది. దీనితో పాటు ఇరాన్‌కు చెందిన కెష్మ్ ఫార్స్ ఎయిర్, ఆర్మేనియాకు చెందిన విమానయాన సంస్థ ఎల్ఎల్‌సి పై కూడా అమెరికా ఆర్థికశాఖ ఆంక్షలు విధించింది. ఈ రెండు సంస్థలకు ఇరాన్‌లోని మహాన్ ఎయిర్ విమానయాన సంస్థతో సన్నిహిత సంబంధాలున్నాయని భావిస్తున్నందున వీటిపై కూడా ఆంక్షలు విధిస్తున్నామని తెలిపింది. ఇరాన్ సమర్థిస్తున్న మిలిటెంట్ సంస్థలతో పాటు ఇతర విదేశీ సంస్థలు ఉగ్రవాదాన్ని ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్నందునే ఈ సంస్థలపై ఆంక్షలు అమలులోకి తెచ్చామని అమెరికా ఆర్థిక మంత్రి స్టీవెన్ న్యూచిన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికాలో ఈ సంస్థలకు సంబంధించిన అన్ని ఆస్తులను బ్లాక్ చేస్తున్నామని, ఈ సంస్థలతో అమెరికన్ జాతీయులు లావాదేవీలు కొనసాగించటంపై నిషేధం విధిస్తున్నామని తెలిపింది. అమెరికా నేతృత్వంలోని ఆరుదేశాలతో ఇరాన్ కుదుర్చుకున్న అణు ఒప్పందం నుండి ఉపసంహరించుకున్న తరువాత ట్రంప్ సర్కారు ఆ దేశంపై ఇప్పటికే ఆంక్షలు అమలు చేస్తున్న విషయం తెలిసిందే. వాటికి అదనంగా ఇప్పుడు తాజా ఆంక్షలు అమలులోకి వచ్చాయి.



శరణార్థులను వెనక్కి పంపిన అమెరికా

వాషింగ్టన్ : సెంట్రల్ అమెరికన్ శరణార్థుల మొదటి బృందాన్ని అమెరికా మెక్సికోలోని తిజువానాకు పంపనుంది. అమెరికాలోకి అక్రమంగానైనా ప్రవేశించేందుకు నెలల తరబడి వేలాదిమంది శరణార్థులు తిజువానాలో వేచి వున్నారు. మెక్సికోకి తిప్పి పంపబడే ఈ శరణార్థులందరూ అమెరికాకు వెలుపలనే వేచి వుండి ఇమ్మిగ్రేషన్ కార్యకలాపాలు పూర్తి చేసుకోవాల్సి వుంటుందని శరణార్థుల రక్షణ ప్రొటోకాల్స్ (ఎంపిపి) తెలిపింది. కేవలం పిల్లలు మాత్రమే వున్నా, లేదా ఒడిదుడుకులు ఎదుర్కొనే కొంతమందిని మాత్రం ఏ కేసుకు ఆ కేసు ప్రాతిపదికన పరిశీలించనున్నారు. దక్షిణ సరిహద్దు ప్రాంతానికి వచ్చే సెంట్రల్ అమెరికన్ కుటుంబాల సంఖ్యను తగ్గించాలన్నది ఎంపిపి లక్ష్యమని అమెరికా హోం శాఖ తెలియచేసింది. అమెరికా చట్టాన్ని అవకాశంగా తీసుకుని తప్పుడు పత్రాలతో ఆశ్రయం కోరాలని వచ్చే వారి సంఖ్యను తగ్గించాల్సిందేనని అమెరికా దేశ భద్రతా వ్యవహారాల శాఖ తెలిపింది. అయితే, ప్రత్యేకంగా దృష్టి సారించాలనుకునే గ్రూపులకు చెందిన వారిని మాత్రం తాము ఆమోదించేది లేదని మెక్సికో విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఎల్ సాల్వడార్, హోండూరస్, గ్వాటెమాలాల నుండి ఇటీవలి సంవత్సరాల్లో అమెరికాకు వచ్చే శరణార్థుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది.

సూడాన్‌లో ఆరని నిరసన జ్వాలలు

29కి చేరిన మృతుల సంఖ్య

ఖర్తూమ్: సూడాన్‌లో అధ్యక్ష వ్యతిరేక నిరసన జ్వాలలు భగ్గుమంటున్నాయి. దీర్ఘకాలంగా అధ్యక్ష పీఠాన్ని అంటిపెట్టుకొని పీఠం వీడని ఒమర్–అల్–బషీర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సూడాన్‌లో నిరసనలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే, నిరసనకారులను అణచివేసేందుకు ఇక్కడి భద్రతాబలగాలు బలప్రయోగం చేపట్టాయి. బాష్పవాయుగోళాలు ప్రదర్శించాయి. పోలీసులకు, నిరసనకారులకు మధ్య ఘర్షణ వాతావరణం కొనసాగుతున్నది. గతేడాది డిసెంబర్‌లో నిరసనలు ప్రారంభమైనప్పటి నుంచి మృతిచెందిన వారి సంఖ్య శుక్రవారం నాటికి 29కి చేరుకుందని గవర్నమెంట్ ఇన్వెస్టిగేటరీ కమిటీ అధికార ప్రతినిధి ఆమెర్ మొహ్మద్ ఇబ్రహీమ్ తెలిపారు. రెండు రోజుల కిందట పోలీసుల లాఠీ దెబ్బలకు తీవ్రంగా గాయపడ్డ 24ఏండ్ల బషీర్ అనే యువకుడు శుక్రవారం మృతి చెందాడు. దీంతో, నిరసనలు ఉధృత రూపం దాల్చాయి. వేలాది మంది నిరసనకారులు రాజధాని వీధుల్లో చేరుకొని ప్రభుత్వ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒమర్‌అల్ బషర్... గో డౌన్ అంటూ నినాదాలు చేశారు. ధరల నియంత్రణలో ఆయన పూర్తిగా విఫలమయ్యారని, సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నిరసనకారులు నినదించారు.

కనుచూపు మేరలో కానరాని పరిష్కారం

● బిల్లులను ఆపిన సెనేట్ ● కొనసాగుతున్న 'షట్‌డౌన్' ● నిరుద్యోగ భృతి కోరిన 25వేల మంది ఉద్యోగులు

వాషింగ్టన్ : అమెరికా ఆర్థిక సంక్షోభానికి కనుచూపు మేరలో పరిష్కారం కానరావడం లేదు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఈ సంక్షోభాన్ని పరిష్కరించే ఉద్దేశ్యంతో, అధ్యక్షుడు ట్రంప్ మద్దతుతో రెండు బిల్లులను ప్రవేశపెట్టినా అవి సెనెట్ ఆమోదం పొందడంలో విఫలమయ్యాయి. దీంతో ఈ 'షట్‌డౌన్' ఎంత కాలం కొనసాగుతుందో తెలియని అగమ్య గోచర పరిస్థితి ఏర్పడింది. మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి అవసరమైన 570కోట్ల డాలర్ల నిధులు మంజూరు చేయని వ్యయ బిల్లును వీటో చేస్తానని ట్రంప్ పదే పదే పునరుద్ఘాటించిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. గురువారం వరకు స్పష్టమైన పరిష్కార మార్గం కానరాలేదు. కాగా మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణాన్ని డెమోక్రాట్లు తీవ్రంగా



వ్యతిరేకిస్తున్నారు. అమానవీయ చర్యగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇదిలావుండగా, నిరుద్యోగ భృతి కోరుతూ 25,419మంది ఫెడరల్ ఉద్యోగులు అమెరికా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. జనవరి 12తో ముగిసిన వారానికి ఈ సంఖ్య నమోదు కాగా, అంతకుముందు వారం ఈ సంఖ్య 10,454గా వుందని కార్మిక శాఖ అధికారులు తెలిపారు. గతేడాది ఇదే కాలంలో కేవలం 1658మంది మాత్రమే నిరుద్యోగ ప్రయోజనాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెగ్యులర్ ప్రభుత్వ కార్యక్రమాల కింద కాకుండా ప్రత్యేక కార్యక్రమం కింద వీరు ఈ పిటిషన్లు పెట్టారు. ప్రభుత్వ ఆర్థిక సంక్షోభం కారణంగా విధులకు హాజరు కాకుండా ఇంట్లో కూర్చున్నవారు ఈ నిరుద్యోగ భృతిని పొందవచ్చు. అయితే వేతనాలు అందకపోయినా విధులకు హాజరు కావాల్సినవారు, షట్‌డౌన్ ముగిసిన తర్వాత వేతనాలు అందుకునే అవకాశం వున్నవారికి మాత్రం ఈ నిరుద్యోగ భృతి వర్తించదని కార్మిక శాఖ అధికారులు స్పష్టం చేశారు.

ఫ్రాన్స్ బాటలో ఇరాక్...!

ఎల్లోవెస్ట్ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకున్న మహిళలు

బాగ్దాద్ : ఇరాక్‌లో బాస్రా నగరంలోని మహిళలు ఉద్యమ బాట పట్టారు. ఇరాక్‌లో అవినీతి పెరిగిపోయిందని, పౌర సేవల్లోనూ నాణ్యత లోపించిందంటూ విమర్శించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా తామంతా ఉద్యమించాలని నిర్ణయించుకున్నామంటూ నిరసనకారులు నినదించారు. ప్లకార్డులు, బ్యానర్లు చేబూని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఫ్రాన్స్‌లో ఇంధన ధరలు పెరిగినప్పుడు అక్కడి యువత ఎల్లో వెస్ట్ ఉద్యమాన్ని చేపట్టి సఫలీకృతమైంది. ఫ్రాన్స్‌ను స్ఫూర్తిగా తీసుకొని తాము కూడా ఉద్యమబాట పట్టామని అన్నారు. ఫ్రాన్స్‌లో నిరసనకారులు ధరించిన ఎల్లో వెస్ట్స్ ధరించి మహిళలు నిరసన తెలపడం గమనార్హం.

మొదటి పేజీ తరువాయి

సమ్మెకు ఎన్ఎంయు సై

సవరణతో పాటు, పలు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్‌యూనియన్ (ఇయు), ఎస్‌డబ్ల్యుఎఫ్ తదితర సంఘాలతో కూడిన జెఎసి ఫిబ్రవరి ఆరవ తేది నుండి సమ్మెఉ దిగుతున్నట్లు ఇప్పటికే నోటీస్ ఇచ్చి ఉన్న సంగతి తెలిసిందే. ఈ మేరకు సమ్మె సన్నాహక కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా 8వ తేది తరువాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని నోటీస్ ఇచ్చిన ఎన్ఎంయు ఫిబ్రవరి ఒకటవ తేదిన చలో ఆర్ఎం కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య మాట్లాడుతూ శుక్రవారం ఎన్ఎంయు సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహించామని, సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు సమ్మె నోటీసు ఇచ్చామని చెప్పారు. 28న అన్ని డిపోల కమిటీ నాయకులతో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గతంలో అంగీకరించిన మేరకు ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ఇప్పటి వరకూ ఉన్న అప్పులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఈక్విటీగా మార్చాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి డిమాండ్ల బ్యాడ్జీలతో విధులకు : జెఎసి

సమ్మె సన్నాహక చర్యల్లో భాగంగా శనివారం నుంచి డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలను ధరించి సిబ్బంది విధులకు హాజరవుతారని ఆర్టీసి కార్మిక సంఘాల జెఎసి కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు, కో–కన్వీనర్లు సిహెచ్ సుందరయ్య, వి వరహాల నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న అన్ని డిపోల్లో జెఎసి ఆధ్వర్యంలో సామూహిక నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు.

ఆ అర్హతా ప్రమాణాలను వ్యతిరేకిస్తున్నాం

ప్రయోజనాలను సామాజిక వెనుకబాటుకు గురైన వర్గాల వారికి కూడా విస్తరించటం ప్రధానమని పొలిట్‌బ్యూరో అభిప్రాయపడింది. తాజా రిజర్వేషన్ల కోసం ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లులో ఈ అర్హతా ప్రమాణాల ప్రతిపాదనను చేర్చకపోవటం, కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి అద్దంపడుతోందని విమర్శించింది. జనవరి 31న ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల కోసం ఎదురు చూడకుండా ఎగ్జిక్యూటివ్ ఆదేశాల ద్వారా అక్రమంగా, ఏకపక్షంగా అర్హతా ప్రమాణాల అమలును ప్రకటించటం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని దుయ్యబట్టింది. పార్లమెంట్ ఆమోదిత చట్టం లేకుండా ఎగ్జిక్యూటివ్ ఆదేశాల ద్వారా ప్రకటించిన అర్హతా ప్రమాణాలతో ఈ రిజర్వేషన్ల అమలును తాము అనుమతించబోమని పొలిట్‌బ్యూరో కేంద్రానికి స్పష్టం చేసింది.

సిఎం గణతంత్ర శుభాకాంక్షలు

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. ఎందరో మహనీయుల కృషి, పోరాటాల ఫలితంగానే భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, గణతంత్ర ప్రజాస్వామ్య రాజ్యాంగా అవతరించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.ప్రజాస్వామ్యానికి ఎప్పటికప్పుడు పెను సవాళ్లు ఎదురవుతున్నా దేశ ప్రజలు వాటిని ఎంతో సంయమనంతో, సమిష్టి భావనతో ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇప్పుడు ప్రజాస్వామ్యానికి మరోరూపంలో ప్రమాదం ఎదురైందని, పాలకుల నియంతృత్వ పోకడల వల్ల దేశంలోని అన్ని రాజ్యాంగ వ్యవస్థల మనుగడకు విఘాతం ఏర్పడిందన్నారు. ముఖ్యంగా కేంద్ర–రాష్ట్రాల మధ్య ఉండాల్సిన సమాఖ్య భావన కనిపించకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 17వ లోక్‌సభకు జరగనున్న ఎన్నికలు జాతి భవితను నిర్దేశించే ఎన్నికలు కానున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజల ఎన్నో ఆశలు, లక్ష్యాలకు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచిన నేపథ్యంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే వారికి పట్టం కట్టాల్సిన కీలక బాధ్యతను ఈ గణతంత్రం ప్రజల ముందు ఉంచిందన్నారు.

ప్రణబ్ ముఖర్జీకి భారతరత్న సముచిత గౌరం

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి భారతరత్న పురస్కారం లభించడం సముచితమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. భారత రాష్ట్రపతిగా, కేంద్ర ఆర్థిక, రక్షణ మంత్రిగా ప్రణబ్ దేశానికి అందించిన సేవలు అనితరసాధ్యమైనవని తెలిపారు. నానాజీ దేశ్‌ముఖ్, భూపెన్ హజారికాలకు మరణానంతరం భారతరత్న పురస్కారాలు దక్కడం సంతోషదాయకమని అన్నారు. ఎన్ని పర్యాయాలు, ఎన్ని అభ్యర్థనలు చేసినా ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించడంలో కేంద్రంలో అధికారంలో ఉండే ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయని విమర్శించారు. ఇది తెలుగువారి ఆత్మగౌరవాన్ని అలక్ష్యం చేయడమేనని అభిప్రాయం వ్యక్తం చేశారు.ప్రముఖ సినీ గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, చదరంగ క్రీడాకారిణి ద్రోణవల్లి హారికలకు పద్మ పురస్కారాలు దక్కడం అభినందనీయమని తెలిపారు.

మదురోకు పెరుగుతున్న మద్దతు

మొదటి పేజీ తరువాయి

ఆల్‌ఫ్రెడ్ డి జాయాస్ మాట్లాడుతూ, అమెరికా జోక్యం అంతర్జాతీయ వెనిజులాలో అమెరికా జోక్యం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమన ఇఅన్నారు. 2017లో జాయాస్ ఐరాస ప్రతినిధిగా వెనిజులాలో పర్యటించారు. ఎన్నికలను బహిష్కరించడం, తనకు తాను అధ్యక్షునిగా ప్రకటించుకోవడం వంటివి ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం ఉన్నవారు చేయాల్సిన పనేనా అని ప్రశ్నించారు. పశ్చిమ దేశాల ప్రధాన స్రవంతి మీడియా అమెరికా జోక్యంపై రాజీ పడిందని విమర్శించారు. 2003లో ఇరాక్‌పై అమెరికా దండెత్తినప్పుడు కూడా మీడియా ఇదే విధంగా వ్యవహరించిందని ఆయన గుర్తు చేశారు. ఒక దేశ ఆంతరంగిక వ్యవహారాల్లో మరో దేశం జోక్యం చేసుకోరాదన్న 1930లో ఆమోదించిన తీర్మానానికి తాము కట్టుబడి వున్నామని మెక్సికో అధ్యక్షుడు లోపెజ్ ఒబ్రాడర్ చెప్పారు. మదురోకు ఫోన్ చేసి ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు.టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ మదురోకు ఫోన్ చేసి పూర్తి మద్దతు ప్రకటించారు. వెనిజులా సార్వభౌమత్వ పరిరక్షణకు మదురో ప్రభుత్వం చేస్తున్న యత్నాలకు తమ పూర్తి మద్దతు వుంటుందని చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. "వెనిజులన్లు వారి భవితవ్యాన్ని వారే నిర్ణయించుకోవాలి. మనకు అనుకూలమైన నేతలను వారు ఎంపిక చేసుకోవాలని మనం భావించరాదు." అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఇండియన్ అమెరికన్ తులసీ గబ్బార్డ్ ట్వీట్ చేశారు. అమెరికన్ కాంగ్రెస్‌కు చెందిన మరో సభ్యురాలు ఇల్హాన్ ఒమర్ వెనిజులాలో అమెరికా జోక్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. వెనిజులాలో శాంతి చర్చలకు వాటికన్, మెక్సికో, ఉరుగ్వే తదితర దేశాలు చొరవ చూపాయి. అమెరికా కుట్రలను ఖండిస్తూ, తన ప్రభుత్వానికి సంఘీభావం తెలిపిన రష్యా, చైనా, మెక్సికో, టర్కీ తదితర దేశాల నేతలకు మదురో కృతజ్ఞతలు తెలిపారు.

మదురోఅండగా వుంటాం...!
వెనిజులా సైన్యం స్పష్టీకరణ

వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో నేతృత్వంలోని ప్రభుత్వానికి ఆ దేశ సైన్యం తన సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కుట్రదారులు వెనిజులాపై యుద్ధం ప్రకటించారని వెనిజులా సైన్యం ప్రకటించిందని, ఈ పరిస్థితుల్లో చట్టబద్ధమైన మదురో ప్రభుత్వానికే తాము అండగా నిలుస్తామని స్పష్టం చేసింది. మదురో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న కుట్రను తాము భగ్నం చేస్తామని, ఆయన ప్రభుత్వాన్ని కాపాడుతామని పడ్రినో ప్రకటించారు. పడ్రినో ప్రకటనను మరో ఎనిమిది మంది ఉన్నత స్థాయి సైనికాధికారులు గట్టిగా సమర్థించారు. సైన్యంతో పాటు సుప్రీం కోర్టు కూడా మదురో ప్రభుత్వ చట్టబద్ధతను పునరుద్ఘాటించింది. విదేశీ ప్రభుత్వాల అనుచిత జోక్యంతో వెనిజులాలో చట్టబద్ధమైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర కొనసాగుతోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

సైనిక చర్యపై పరిశీలన: ట్రంప్

వెనిజులాలో కొనసాగుతున్న సంక్షోభానికి తెరదించేందుకు సైనిక చర్య చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. 'సైనిక జోక్యంతో సహా అన్ని అంశాలు తమ పరిశీలనలో వున్నాయని ఆయన అన్నారు. సైనిక చర్యతో పాటు వెనిజులాపై ఆర్థికపరమైన ఆంక్షలు విధించే అంశాన్ని ట్రంప్ పరిశీలిస్తున్నారని అమెరికా ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అత్యంత అరుదైన రీతిలో వెనిజులా విషయంలో డెమోక్రాటిక్ పార్టీ కూడా ట్రంప్ ప్రతిపాదనలను సమర్థిస్తుండటం విశేషం. కానీ ఇండిపెండెంట్ సెనేటర్ బెర్నీ శాండర్స్ మాత్రం వెనిజులాలో అమెరికా జోక్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

గతంలో చిలీ, గ్వాటెమాలా, బ్రెజిల్, డొమ్నికన్ రిపబ్లిక్ వంటి దేశాలలో అప్పటి ప్రభుత్వాలకు వ్యతిరేకంగాజరిగిన కుట్రలను సమర్థించి దెబ్బతిన్న అనుభవాల నుండి మనం గుణపాఠాలు నేర్చుకోవాల్సి వుందని శాండర్స్ ట్రంప్ సర్కారుకు తేల్చిచెప్పారు. దీనితోపాటు వెనిజులా ప్రభుత్వం నిరసనలను అణచివేస్తుండటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇదిలా వుండగా వెనిజులాలో అదుపు తప్పుతున్న పరిస్థితులను కట్టడి చేసేందుకు ఉభయ వర్గాలు చర్చలు జరిపి సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సూచించారు.

'తాత్కాలిక అధ్యక్షుడు' రాజ్యాంగ విరుద్ధం

వెనిజులా రాజ్యాంగం ప్రకారం దేశానికి తాత్కాలిక అధ్యక్షుడెవరూ వుండరని వెనిజులా అటార్నీ జనరల్ ఓల్గా అల్వారెజ్ స్పష్టం చేశారు. ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ వెనిజులా రాజ్యాంగం ప్రకారం తాత్కాలిక అధ్యక్ష పదవి అనేదే లేదని అన్నారు. జాతీయ అసెంబ్లీ (2016 తరువాత) జాతీయ కార్యనిర్వాహక వ్యవస్థగా రాజ్యాంగం ఎక్కడా చెప్పలేదని ఆమె వివరించారు.

రిపబ్లిక్‌డే పరేడ్‌లో బ్రిటిష్ ట్యూన్ స్థానంలో 'శంఖనాదం'

న్యూఢిల్లీ: ఈ ఏడాది జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలు, ముఖ్యంగా సైనిక దళాల పెరేడ్‌లో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే పెరేడ్‌లో దీర్ఘకాలంగా వినిపిస్తున్న బ్రిటిష్ సైనిక వాద్య ఘోషకు బదులుగా తొలిసారిగా శంఖనాదాన్ని వినిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్వాతంత్ర్యానంతరం నుండి ఇప్పటి వరకూ భారతీయ శాస్త్రీయ సంగీతం ఆధారంగా రూపొందించిన బ్రిటిష్ సైనిక వాద్యఘోషను సైనిక బృందం వినిపిస్తున్న విషయం తెలిసిందే. సైనికదళాలతో 90 నిముషాల పాటు కొనసాగే ఈ పెరేడ్ శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమ్‌ఫోసా హాజరవుతున్నారు.

మూడేళ్ల తరువాత రైల్వే శకటం

గణతంత్ర దినోత్సవ ప్రదర్శనలో రైల్వే శాఖ మూడేళ్ల అనంతరం తన శకటాన్ని ప్రదర్శిస్తోంది. "మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధీ మహాత్మా గాంధీగా మారిన తీరు"ను అనేక చిత్రాల ద్వారా ప్రదర్శించనుంది. బుల్లెట్ ట్రైన్ ప్రారంభోత్సవం, ట్రెయిన్ 18ల చిత్రాలను ఈ శకటంలో ప్రదర్శించనున్నట్లు మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 1893లో దక్షిణాఫ్రికాలోని పీటర్‌మార్టిజ్‌బర్గ్ రైల్వే స్టేషన్‌లో రైలు నుండి గాంధీని బయటకు నెట్టేసినప్పటి నుండి 'సత్యాగ్రహం' చేయడం వరకు చిత్రాల రూపంలో ప్రదర్శిస్తుంది.

కలిసే వెళ్తాం

మొదటి పేజీ తరువాయి

ప్రజా పోరాటాలను కూడా కలిసే నిర్వహిస్తామన్నారు. సీట్ల పంపకాలకు సంబంధించిన చర్చ ఎంత వరకూ వచ్చిందంటూ విలేకర్లు పవన్‌ను ప్రశ్నించగా పొత్తుపై తర్వాత కూర్చొంటామని, ప్రస్తుతం కలిసి పనిచేస్తామని పవన్ వివరించారు. రాబోయే ఎన్నికల్లో ఎలా కలిసి వెళ్లాలి? అన్న విషయమై ఉమ్మడి ప్రణాళికను ఐదు అంశాలపై తయారు చేశామన్నారు. తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్స్ (ఇవిఎం)లపై అనుమానాలు నెలకొన్నాయన్నారు. వచ్చే ఎన్నికలను ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహించాలని పవన్ సూచించారు. ఈ అనుమానాలు తొలగించడానికి ఎన్నికల కమిషన్ నిపుణుల కమిటీ వేయాలని సమావేశం డిమాండ్ చేసిందన్నారు.

నూతన దృక్పథంతో రాష్ట్రం పురోగమనం: బివి.రాఘవులు

రాష్ట్రంలో ప్రజలను వేధిస్తున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించి ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చామని బివి.రాఘవులు తెలిపారు. రాష్ట్ర రాజకీయాలు 'చచ్చు..పుచ్చు' అయినా, ప్రజలు తప్పనిసరి పరిస్థితిలో ఓట్లు వేస్తున్నారని, ఇక నుంచి అలా కాకుండా ఉండేందుకు జనసేన ముందుకు వచ్చిందని రాఘవులు వెల్లడించారు. ప్రజా సమస్యలపై జనసేన, సిపిఎం, సిపిఐ ఈ మూడు శక్తుల నూతన దృక్పథంతో రాష్ట్రం పురోగమించేందుకు, ఆ లక్ష్యాన్ని ప్రజల ముందు ఉంచేందుకే నేటి సమావేశం ప్రాధాన్యమిచ్చిందన్నారు. రాష్ట్రంలో వనరులు, సంపద, నిధులు, గనులు, నీరు భావితరాలకు ఉండే విధంగా ఉండాలే తప్ప పరిపాలించే రాజకీయ పార్టీలు పట్టుకుని పోవడానికి కాదని ఆయన అన్నారు. కొత్త భూసేకరణ చట్టం, మైనింగ్, పర్యావరణ, పౌర, మానవ హక్కులు, సామాజిక సమస్యలు తదితర ఏవైతే సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయో వాటిని కాపాడుకోవడానికి, భవిష్యత్‌లో రాష్ట్రం ఎలా ఉండాలనేదే ఈ సమావేశంలో చర్చించామన్నారు. విశాఖలో బాక్సైట్ తవ్వకాలకు జనసేన, వామపక్షాలు వ్యతిరేకమని రాఘవులు స్పష్టం చేశారు. ఇంకా ఎక్కడైనా మైనింగ్ చేయాల్సి వస్తే హేతుబద్ధమైన విధానం అమలుచేస్తే అంగీకరిస్తామన్నారు. ప్రత్యేక హోదా విషయంలో కేంద్ర ప్రభుత్వం పచ్చిగా రాష్ట్రాన్ని మోసగించిందని విమర్శించారు. జనసేన, సిపిఎం, సిపిఐ ఇతర శక్తులనూ కలుపుకొని రాబోయేకాలంలో రాజకీయ పోరాటం కొనసాగిస్తామన్నారు.

సమస్యలపై ప్రజలను ఎలా చైతన్యపరచాలనే చర్చించాం: సురవరం సుధాకర్‌రెడ్డి

మూడు రాజకీయ పార్టీలు రాష్ట్రంలోని ప్రధాన సమస్యలపై ప్రజలను చైతన్యం చేసి పోరాటాలపై అవగాహన కలిగించడం కోసమే ఈ రౌండ్‌టేబుల్ సమావేశమని సురవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే ప్రజా సమస్యలపై పవన్‌తో చర్చించి నాదెండ్ల మనోహర్ డాక్యుమెంట్లను తయారు చేశారన్నారు. సమావేశంలో దీనిపై చర్చించామని, కొద్దిపాటి సవరణలతో అందరం ఏకాభిప్రాయం వ్యక్తం చేశామని చెప్పారు. పర్యావరణ కాలుష్యంతో వాతావరణం వేడెక్కి ఎంతోమంది దేశంలో చనిపోతున్నారన్నారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ బాధితుల సమస్యలకు పర్యావరణంలో తేడాలూ కారణమన్నారు. పర్యావరణ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సరైన విచారణ చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మైనింగ్ సమస్య ఉత్తరాంధ్రలో ప్రధానంగా ఉందని, అక్రమ మైనింగ్‌ను తమ పార్టీలు అంగీకరించబోవని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు అజెండా చేసుకుని దీనిపై చర్చించాలని సురవరం తెలిపారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, బలవంతంగా భూములు సేకరించకూడదని హితవు పలికారు.

మహిళా ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

రాయలసీమ జిల్లాల నుంచి 1000 మంది హాజరు

ప్రజాశక్తి – కర్నూలు క్రైం

కర్నూలు నగరంలోని ఎపిఎస్‌పి 2వ బెటాలియన్‌లో శుక్రవారం మహిళా ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య, సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. రాయలసీమ నాలుగు జిల్లాల నుంచి వెయ్యి మంది అభ్యర్థులు హాజరయ్యారు. 1600 వందల మీటర్ల పరుగు పందెంను కర్నూలు జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి జెండా ఊపి ప్రారంభించారు. కర్నూలు రేంజ్ డిఐజి డి.నాగేంద్రకుమార్, జిల్లా ఎస్పీల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఫక్కీరప్ప మాట్లాడారు.

మహిళా అభ్యర్థుల ఎత్తు, ధ్రువీకరణ పత్రాలు పరిశీలించిన అనంతరం 1600 మీటర్లు – 10:30 నిమిషాలు, 100 మీటర్లు 18 సెకన్లు, లాంగ్ జంప్ – 2.75 మీటర్ల, శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ ఐ.వెంకటేష్, డిఎస్‌పిలు, కర్నూలు హోంగార్డు డిఎస్‌పి లక్ష్మీ నారాయణ రెడ్డి , సి.ఎమ్ నాయుడు (చిత్తూరు), ఎమ్.రామక్రిష్ణయ్య (పుట్టపర్తి), సిఐ ఆదిలక్ష్మీ, ఆర్ఐ శివారెడ్డి, షీటీమ్ ఇన్‌ఛార్జి ఎస్ఐ విజయలక్ష్మీ, డిఐజి మేనేజర్ సురేష్ పాల్గొన్నారు.

అరుణ్‌జైట్లీ వేగంగా కోలుకుంటున్నారు

కేంద్రమంత్రి పియూష్‌గోయల్

న్యూఢిల్లీ : అనారోగ్యం కారణంగా అమెరికాలోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అరోగ్యం స్థిరంగా ఉందని, ఆయన వేగంగా కోలుకుంటున్నారని తాత్కాలికంగా ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న రైల్వే, బొగ్గు గనుల శాఖ మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అయితే జైట్లీ తిరిగి దేశానికి ఎప్పుడు వస్తారన్న దానిపై ఆయన సమాధానం చెప్పలేదు. ఈ నెల 13న వైద్య పరీక్షల కోసం జైట్లీ అమెరికాకు వెళ్లారని ఆర్థిక శాఖ అధికారులు వెల్లడించారు. వైద్యులు అయనను రెండు వారాలు విశ్రాంతి తీసుకోమని సూచించడంతో ఆర్థిక శాఖ విధులను రాష్ట్రపతి గోయల్‌కు అప్పగించారు.



'ఎఫ్2'లో మరింత ఫన్



అదనంగా మరో ఐదు సన్నివేశాలు

తమన్నా

వెంకటేష్, వరుణ్ తేజ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన మల్టీస్టారర్ 'ఎఫ్ 2'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమా రూ.100కోట్ల గ్రాస్ వసూళ్ల చేసింది. ఈ రికార్డు సాధించిన తొలి మల్టీస్టారర్‌గా నిలిచింది. అలాగే ఈ ఏడాది సంక్రాంతి విజేత నిలిచి మొదటి బ్లాక్ బ్లాస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. తెలుగు రాష్ట్రాల్లో రూ.50కోట్లపైగా షేర్‌ను రాబట్టింది. ప్రపంచ వ్యాప్తంగా 13రోజుల్లోనే రూ.68 కోట్లు కలెక్ట్ చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో చిత్రబృందం థాంక్స్ టు మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్ రాజు, తమన్నా, దర్శకుడు అనిల్, ప్రగతితో పాటు తదితర చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ'ఎఫ్ 2' సినిమా ఊహించని విజయాన్ని అందుకోవడం ఆనందంగా ఉంది. కేవలం రెండు వారాల్లో వంద కోట్ల గ్రాస్ వసూలు చేయడం నిజంగా రికార్డ్ అని చెప్పాలి. తెలుగు రాష్ట్రాల్లో విడుదలైన ప్రతి థియేటర్‌లో ప్రేక్షకులు నవ్వుల్లో మునిగిపోతున్నారు. ఈ సందర్భంగా శనివారం నుండి ఈ సినిమాలో మరో ఐదు సన్నివేశాలను జత చేస్తున్నాం. దాంతో మరింత ఫన్ ఉంటుంది. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" తెలిపారు.

దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'వందకోట్ల సినిమా చెయ్యాలని ప్రతి డైరెక్టర్ కల. అది ఈ సినిమాతో నాకు దక్కినందుకు హ్యాపీగా ఉంది. ఇంకా కంటిన్యూగా సినిమా స్ట్రాంగ్ కలెక్షన్లతో రన్ అవుతోంది. ఈ చిత్రం విజయం నా ఒక్కడిది కాదు.. దీని వెనుక చాలా మంది కష్టం ఉంది. వెంకటేష్, వరుణ్, తమన్నా, మెహ్రీన్ అందరూ తమ క్యారెక్టర్స్ ద్వారా సంతృప్తి చెందారు. వాళ్ల అందరికీ ఈ సినిమా ఓ కిక్‌నిచ్చింది' అని అన్నారు.

తమన్నా మాట్లాడుతూ 'దిల్ రాజు గారి బ్యానర్లో చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన రిలీజ్ చేసిన 'హ్యాపీడేస్' నాకు టర్నింగ్ పాయింట్. 'ఎఫ్ 2' సినిమా బిగ్గెస్ట్ హిట్ అవడం చాలా సంతోషంగా ఉంది. 'ఎఫ్ 2' స్క్రిప్ట్ విని ఎంత ఎక్సయిట్ అయ్యానో సినిమా షూటింగ్ కూడా అదే ఎక్సయిట్మెంట్‌తో చేశాం' అని తెలిపింది.

'మిస్టర్ మజ్ను'లో కొత్తదనం శూన్యం

అక్కినేని 'లైలా మజ్ను'లో భగ్నప్రేమికుడి జీవితాన్ని బ్లాక్ అండ్ వైట్‌లో ఆవిష్కరిస్తే ఆ చిత్రం ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. దాసరి దర్శకత్వంలో ఆయన వారసుడు నాగార్జున చేసిన 'మజ్ను' కూడా బాగానే గుర్తింపునిచ్చింది. మూడోతరం నటుడు అఖిల్ చేసిన 'మిస్టర్ మజ్ను' అంతే పేరు తెస్తుందని ఆశించారు. అఖిల్‌కు హీరోగా మూడోది, నటుడిగా నాలుగోది. దర్శకుడిగా 'తొలి ప్రేమ'తో సత్తా చాటిన వెంకీ అట్లూరి రూపొందించిన చిత్రమిది. శుక్రవారమే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమాలో కొత్తదనం లేకపోవడమే ప్రధాన లోపం.

కథ : విక్కీ (అక్కినేని అఖిల్) ఓ ప్లేబాయ్. ఏ అమ్మాయినైనా అబద్ధాలు చెప్పి నిమిషాల్లో పడేస్తాడు. కొన్ని రోజులు ఆ అమ్మాయితో రొమాన్స్ చేసి విడిపోతాడు. ఇలా పదుల సంఖ్యలో అమ్మాయిలతో ప్రేమాయణం నడిపిన అతడికి పూర్తి విరుద్ధమైన భావాలున్న నిక్కీ (నిధి అగర్వాల్) పరిచయం అవుతుంది. తనకు రాముడులాంటి భర్త రావాలని కోరుకున్న ఆ అమ్మాయి కూడా చివరికి విక్కీ చేష్టలను అసహ్యించుకున్నా, తన వ్యక్తిత్వం నచ్చి ప్రేమించేస్తుంది. ఆ ప్రేమ తనకే దక్కాలన్న ఆశతో అతన్ని ఎప్పుడూ అంటిపెట్టుకునే ఉంటుంది. దాంతో విసుగుచెందిన విక్కీ ప్రేమాదోమా తనకు లేదంటూ పెద్దల ముందు తేల్చేస్తాడు. దాంతో గుండె గాయపడిన నిక్కీ.. లండన్ వెళ్లిపోతుంది. ఆ తర్వాత తనేం కోల్పోయాడో విక్కీకి అర్థమవుతుంది. అతను మళ్లీ నిక్కీకి దగ్గర కావడానికి ఏం చేశాడు అన్నది మిగతా కథ.

విశ్లేషణ : ఈ సినిమాలో ప్రధాన లోపం కథ. ప్రేమకథలు ఎప్పుడూ ఒకేలా అనిపిస్తాయి. కానీ ఒకేలా ఉండవు. తెలీనితనంలో ప్రేమించుకోవడం ప్రేమించుకున్నాక ఏవో అలకలు, అపార్థాలతో విడిపోవడం పరిపాటే. ఇద్దరి మధ్య ఉన్న ఆ ప్రయాణం చాలా ఎంటర్‌టైన్‌మెంట్‌గా ఉంటేనే ప్రేక్షకుడికి నచ్చుతుంది. 'గీత గోవిందం' బ్లాక్‌బస్టర్ కావడానికి కారణమదే. ఇంకా ఆ చిత్ర ఛాయలు టీవీల్లో కూడా కన్పించడంతో యువత ఆ చిత్రాన్ని ఇప్పుడే మర్చిపోవడం కష్టం. అలాంటప్పుడు మరో ప్రేమకథను తెరపై ఆవిష్కరించాలంటే అంతకుమించినట్లుగా కన్పించాలి. కానీ మిస్టర్ మజ్నులో అదే లోపించింది. సినిమా ఆరంభం నుంచి హీరోహీరోయిన్ల ట్రాక్‌తో పాటు కథలోని ప్రధానమైన పాయింట్ కూడా గీతగోవిందం గుర్తుకురావడం ఆశ్చర్యమేస్తుంది. దాంతో ప్రతి సీనూ ఆ చిత్రంలోనే పోల్చుకునేలా చేయడం చిత్రానికి ప్రతికూల అంశం.

తొలి రెండు సినిమాల్లో మాదిరి నేలవిడిచి సాము చేయకుండా.. అందరికీ తెలిసిన ఒక సింపుల్ రొమాంటిక్ లవ్ స్టోరీలో ఒదిగిపోవడానికి అఖిల్ సిన్సియర్ ఎఫర్ట్ పెడుతున్నట్లే కనిపిస్తుంది. 'తొలిప్రేమ' స్థాయిలో కాకపోయినా వెంకీ అట్లూరి కూడా ఓ మోస్తరుగానే ఎంగేజ్ చేస్తున్నట్లే అనిపిస్తుంది. ఐతే ప్రథమార్ధంలో 'ఒకే' అనిపించే 'మిస్టర్ మజ్ను' ద్వితీయార్ధంలో 'వావ్' అనిపిస్తోందేమో అని ఆశిస్తే.. కనీసం తొలి సగంలో మాదిరి 'ఒకే' ఫీలింగ్ కూడా తీసుకురాదు. పదుల సినిమాల్లో చూసినట్లే ఒక ఫార్ములా ప్రకారం నడిపించేసి మమ అనిపించేయడంతో 'మిస్టర్ మజ్ను' ఒక సాధారణ సినిమాలా మిగిలిపోయింది. ఇక్కడ ప్రేమకథలో ఫీల్ మిస్సయింది. హీరోను ఇక్కడ స్త్రీలోలుడిగా చూపించారు. హీరోయిన్ అతడిని చూసి అసహ్యించుకుంటుంది. కానీ చిన్న కారణాలతో తన అభిప్రాయాలు మార్చుకుని అతడితో గాఢమైన ప్రేమలో పడిపోతుంది. హీరో కూడా ఈజీగా హీరోయిన్‌తో ప్రేమలో దిగిపోతాడు. ఇద్దరూ కలవడానికీ పెద్ద కారణాలు కనిపించవు. విడిపోవడానికి దారి తీసిన పరిస్థితులూ అలాగే అనిపిస్తాయి.

చిత్ర సమీక్ష

నటీనటులు : అక్కినేని అఖిల్, నిధి అగర్వాల్, రావు రమేష్, నాగబాబు, ప్రియదర్శి, పవిత్ర లోకేష్, సితార, హైపర్ ఆది, సుబ్బరాజు, సత్యకృష్ణ, విద్యు, రాజా తదితరులు
సంగీతం : తమన్, **ఛాయాగ్రహణం :** జార్జ్.సి.విలియమ్స్, **నిర్మాత :** బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, **రచన, దర్శకత్వం :** వెంకీ అట్లూరి.

ప్లే బాయ్‌లా ఉండే కుర్రాడు సీరియస్ ప్రేమికుడిగా మారిపోయి పరిణామం చెందే కథలతో దశాబ్దాలుగా చాలా సినిమాలు వచ్చాయి. వీటిల్లో చాలా వరకు విజయవంతం అయినవే. ఏఎన్నార్.. నాగార్జున సైతం ఇలాంటి ప్రయత్నాల్లో సక్సెస్ అయ్యారు. బహుశా అఖిల్ కూడా అదే ధీమాతో ఈ కథను ఒప్పుకున్నట్లున్నాడు. కథ పాతదైనా ఈ తరం ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు కథనం నడిపిస్తే విజయవంతం అయ్యేది. హీరో చదువులో జీరో, ఇంటి బాధ్యతలో హీరో. ఈ పాయింట్‌తో అల్లిన కొన్ని సన్నివేశాలు కృతంగా అనిపిస్తాయి. కుటుంబంలో సమస్య తలెత్తినపుడు దాన్ని హీరో పరిష్కరించే విధానం ఆకట్టుకుంటుంది. ఇటు సెంటిమెంటుతో పాటు యాక్షన్ పార్ట్ కూడా బాగానే డీల్ చేశారు. హీరో హీరోయిన్ల మధ్య వచ్చే సన్నివేశాలు కూడా సరదాగానే ఉండడంతో సమయం వేగంగానే సాగిపోతుంది. కాకపోతే హీరో హీరోయిన్ల లవ్-బ్రేకప్ విషయంలోనే కొంచెం హడావుడి అయిపోయింది. ప్రథమార్థం వరకు 'మిస్టర్ మజ్ను' ఎక్కడా పెద్దగా బోర్ అనిపించదు. ఇక పతాక సన్నివేశంలో కథానాయిక రియలైజ్ అయి హీరోను చేరుకోవడం అనేది రొటీన్ ఫార్ములా. హైపర్ ఆదిని పెట్టుకుని కామెడీ ట్రై చేశారు కానీ.. అదేమీ ఫలితాన్నివ్వలేదు. అవసరం లేని ఫైట్లు.. పాటలు ఏదో చేసేశాంలే అని అనిపిస్తాయి. ఆల్బమ్‌లో బెస్ట్ సాంగ్ అయిన 'కోపంగా...' కూడా సరైన ప్లేస్మెంట్ కుదరక ఎఫెక్టివ్‌గా అనిపించలేదు. టైటిల్ సాంగ్ ఒక్కటే ఆకట్టుకుంటుంది. ప్లేబాయ్‌గా పర్ఫెక్ట్‌గా సెట్టయ్యాడు. నటనలో ఇంకా కొంచెం సహజత్వం రావాల్సి ఉంది. డిక్షన్ కూడా మెరుగుపడాలి. నిధి అగర్వాల్ జస్ట్ ఓకే అనిపిస్తుంది. పాత్రకు సెట్టయింది కానీ.. ఆమె ప్రత్యేకత అంటూ ఏమీ కనిపించదు. రావు రమేష్ ఉన్నంతసేపూ తన ప్రత్యేకతను చాటుకున్నాడు. జయప్రకాష్, నాగబాబు, సితార, పవిత్ర లోకేష్, రాజా వీళ్లంతా పాత్రలకు తగ్గట్లుగా కనిపించారు. ప్రథమార్థంలో ప్రియదర్శి అక్కడక్కడా నవ్వించాడు. తమన్ తన సంగీతంతో 'మిస్టర్ మజ్ను'కు బలంగా నిలిచాడు. కెమెరా పనితనం బాగుంది. నిర్మాణ విలువల విషయంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ రాజీ పడలేదు. దర్శకుడు వెంకీ అట్లూరి తన తొలి సినిమా 'తొలి ప్రేమ' ఫార్ములానే ఇక్కడా అనుసరించాడు. ప్రథమార్థంలో లవ్-బ్రేకప్.. ద్వితీయార్థంలో మళ్లీ కలుసుకోవడం.... ఇలా కథను నడిపించాడు. కానీ ఈసారి అతను పకడ్బందీగా కథనాన్ని అల్లుకోలేదు. పాత్రల చిత్రణ.. స్క్రీన్ ప్లే విషయంలో పైపైన నడిపించాడు.

– ధనుంజయ్

సూర్యకాంతం



నిహారిక, రాహుల్ విజయ్

నిహారిక కొణిదెల, రాహుల్ విజయ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'సూర్యకాంతం'. మార్చి 29న విడుదల కానుంది. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాకి ప్రణీత్ బ్రమండపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. వరుణ్ తేజ్ చేతుల మీదుగా ఇప్పటికే విడుదల అయిన ఫస్ట్‌లుక్‌కి మంచి స్పందన వచ్చిందని చిత్రబృంద చెప్పింది. తాజాగా శుక్రవారం టీజర్ విడుదలైంది. ఫీల్‌గుడ్‌గా రీఫ్రెషింగ్‌గా ఉందంటూ కితాబు అందుకుంటుందని దర్శకుడు అన్నారు. శివాజీ రాజా, సుహాసిని ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మార్క్ కె రాబిన్ సంగీతం సమకూరుస్తున్నారు. అమెరికాలో ఫిలిం డిస్ట్రిబ్యూషన్‌లో అగ్రగామి సంస్థ అయిన నిర్వాణ సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. వరుణ్ తేజ్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. దర్శకుడు : ప్రణీత్ బ్రమండపల్లి, నిర్మాతలు : సందీప్ ఎర్రం రెడ్డి, స జన్ యారబోలు, రామ్ నరేష్.

సూర్యాస్తమయం



సరోజ్ కుమార్

సినిమా అంటేనే 24 శాఖల సమ్మిళితం. అందులో 11 శాఖలను ఒంటి చేతి మీద నిర్వహించి అరుదైన ఫీట్ చేశారు బండి సరోజ్ కుమార్. ఆయనే అన్నీ అయి నటించిన చిత్రం 'సూర్యాస్తమయం'. ఈ సినిమా తొలి కాపీ సిద్ధమైంది. ఓజో మీడియా పతాకంపై రఘు పిల్లుట్ల, రవికుమార్ సుదర్శి నిర్మించారు. ఫిబ్రవరి ద్వితీయార్ధంలో విడుదల కానుంది. బండి సరోజ్‌కుమార్ మాట్లాడుతూ 'ఇటీవల విడుదల చేసిన 'ఉరిమే మేఘం స్నేహం, కురిసే వర్షం స్నేహం..' అనే పాటకు చాలా మంచి స్పందన వస్తోంది. స్నేహం గురించి పదికాలాల పాటు నిలిచిపోయే అద్భుతమైన పాట చేశావని పలువురు ప్రశంసిస్తున్నారు. నేను రాసిన పాటకు, సమకూర్చిన బాణీకి గాయకుడు శ్రీకర్ జొన్నలగడ్డ న్యాయం చేశారు. ఆయన గాత్రంలో పాట వినసొంపుగా ఉంది. సినిమాలోని ప్రతి పాటా అదే స్థాయిలో ఉంటుంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుంది. సహజసిద్ధమైన లొకేషన్లలో ఆర్టిస్టులకు ఎలాంటి మేకప్ ఉపయోగించకుండా, చాలా నేచురల్‌గా తెరకెక్కించాం. ఇది నేచురల్ యాక్షన్ మూవీ. ఒక పోలీస్‌కీ, గ్యాంగ్‌స్టర్‌కీ మధ్య జరిగే అంతర్యుద్ధం ఈ సినిమాలో ప్రధాన కథాంశం. పవర్ ఫుల్ పోలీస్ పాత్రలో నేను, గ్యాంగ్‌స్టర్‌గా త్రిశూల్ రుద్ర యాక్ట్ చేశాం. తమిళ నటుడు డేనియల్ బాలాజీ కీలకమైన పాత్ర పోషించారు. హైదరాబాద్, వికారాబాద్, నల్గొండ, రామోజీ ఫిల్మ్ సిటీ, కడప, కర్ణాటకల్లో చిత్రీకరణ జరిపాం. త్వరలోనే ట్రైలర్‌ని, ఫిబ్రవరి ద్వితీయార్ధంలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు.

86 ఏళ్ల తెలుగు సినిమా



అక్కినేని, దాసరి నారాయణరావు, రామానాయుడు, డి.వి.ఎస్.రాజు సలహాదారులుగా, ప్రోత్సాహకులుగా ఏర్పడిన 'ఫిలిం అనలిటికల్ అండ్ అసోసియేషన్' (ఫాస్), డా. కె.ధర్మారావు రచయితగా '86 సంవత్సరాల తెలుగు సినిమా' పేరుతో ఓ పుస్తకాన్ని రచించారు. దీన్ని కృష్ణ, విజయనిర్మల దంపతులకు అంకితం చేశారు. కృష్ణ నివాసంలో ఈ అంకితోత్సవం సినీ ప్రముఖుల సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. తమకు ఇంత మంచి గ్రంథాన్ని అంకితం చేసినందుకు రచయితను అభినందించారు గ్రంధ స్వీకర్తలు కృష్ణ, విజయనిర్మల.

దర్శకులు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ '484 పేజీల్లో విషయం ఉంది. మరో 24 పేజీలు రంగుల పుటలతో విశిష్ట సమాచారంతో పాటు చక్కటి ఫొటోలతో తెలుగు సినిమా విశేషాలను బాగా ఆవిష్కరించారు. ఇది కచ్చితంగా తెలుగు సినిమా పరిశ్రమకు ఒక ఎన్‌సైక్లోపీడియాగా ఉపయోగపడుతుంది. రచయిత ఈ పుస్తకంపై వెచ్చించిన 14 సంవత్సరాలకు తాను ప్రత్యక్ష సాక్షి' అని అన్నారు.

మెప్పించిన 'మణికర్ణిక'



ఒకే చిత్రానికి ఇద్దరు సంయుక్తంగా దర్శకత్వం వహించడం చూశాం. కానీ ఒకరు కొంతభాగం మరొకరు తర్వాత భాగానికి దర్శకత్వం వహించి సినిమా తీయడం కష్టమే. అలా చేసిందే 'మణికర్ణిక'. ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం ఆధారంగా తెరకెక్కింది. కంగనా రనౌత్ టైటిల్ రోల్ పోషిస్తూ దర్శకత్వం బాధ్యతలను చేపట్టింది. మొదట క్రిష్ దర్శకత్వం వహించినా 60శాతం సినిమాకు కంగనానే డైరెక్షన్ చేసింది. ఆ తరుణంలో ఎన్నో ఆటంకాలు, అవరోధాలు ఎదురయ్యాయి. అయినా ధైర్యంగా వాటిని జయించి రెండు పనులనూ విజయవంతంగా చేసింది. ఝాన్సీ లక్ష్మీబాయి పాత్రలో జీవించేసింది. సినిమా మొత్తాన్ని తన భుజస్కంధాలపై నడిపించింది. తన వైఫల్యం కోసం చిత్రసీమలో ఎదురు చూస్తువారికి ఆ అవకాశం ఇవ్వకుండా సినిమా విజయం దిశగా నడిపించేందుకు కంగనా ఎంత శ్రమించిందో 'మణికర్ణిక' చూస్తే అర్ధమవుతుంది. వారం రోజుల క్రితమే వాస్తవ సంఘటన సర్జికల్ స్ట్రయిక్ ఆధారంగా తెరకెక్కిన 'ఉరి' చిత్రం వచ్చి బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. ఇప్పుడు ఝాన్సీ రాణి బయోపిక్ వచ్చింది.

చిత్ర సమీక్ష

కథ : మణికర్ణిక (కంగనా రనౌత్) బితూర్‌లో ఉంటుంది. ఆమె పీష్వా (సురేశ్ ఒబేరా)ను అభిమానిస్తుంటుంది. ఒక రోజు మణికర్ణికకు ఓ సంఘటన ఎదురైనప్పుడు ఆమెలో ఉగ్రం, భయం లేని కళ్లను ఝాన్సీ పాలక సభ్యుల్లో ఒకరైన దీక్షిత్ జీ(కులభూషణ్ ఖర్బంద) గమనిస్తాడు. తర్వాత అతను ఝాన్సీ పాలకుడు గంగాధర రావు(జిస్సు సేతుపతి)ని వివాహం చేసుకోమని కోరడం, పెళ్లి జరిగిపోవడం వెంటవెంటనే అయిపోతాయి. అప్పటికే బ్రిటీష్ వారు ఝాన్సీ రాజ్యాన్ని ఆక్రమించుకోవాలని చూస్తుంటారు. వాళ్లను ఎదుర్కోవాలంటే గుండె ధైర్యం ఉన్న వారు సింహాసనంపై ఉండాలని భావిస్తాడు. వెంటనే ఆమె పేరును లక్ష్మీబాయిగా మారుస్తారు. ఈ పరిణామాలు లక్ష్మీబాయి మరిది సదాశివ్(మహ్మద్ జీషాన్ అయ్యూబ్)కు ఈర్ష్య కలిగిస్తాయి. దీంతో ఆయన బ్రిటిష్ వారితో స్నేహంగా ఉండడం మొదలు పెడతాడు. తెల్లవారి సాయంతో ఝాన్సీ సింహాసనాన్ని దక్కించుకోవాలని కుయుక్తులు పన్నుతుంటాడు. ఇలా కొద్ది కాలంలో ఓ బాబుకు జన్మనిస్తుంది లక్ష్మీబాయి. కానీ ఈ సంతోషం ఎంతోకాలం నిలవదు. తన భర్త గంగాధరరావుకు ఆమె మరిది లేనిపోనివి నూరుపోస్తుంటాడు. అదే తరుణంలో ఆయన ఆరోగ్యం కూడా క్షణిస్తుంది. గంగాధరరావు మరణం అనంతరం బ్రిటిష్ వాళ్ల ఝాన్సీరాజ్యంపైకి దండెత్తిడానికి ప్రయత్నిస్తారు. రాజు లేక రాజ్యం క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటుంది. ఈ తరుణంలో అందరికీ ఆశ్చర్యం కలిగేలా ఝాన్సీ పగ్గాలను లక్ష్మీబాయి చేపడుతుంది. తనుకు తానుగా రాణిగా ప్రకటించుకుంటుంది. బహిరంగంగానే బ్రిటిష్ వారితో యుద్ధానికి సవాలు విసురుతుంది. తర్వాత ఏం జరిగిందన్నదే మిగిలిన సినిమా.

విశ్లేషణ : కేవీ విజయేంద్ర ప్రసాద్ ఈ కథను చాలా సింపుల్‌గా చెప్పాడు. అందరికీ అర్థమయ్యేలా చారిత్రక ఘట్టాలను వర్ణించాడు. ఈ సినిమాలో ఆయన స్క్రీన్‌ప్లే ప్రధాన ఆకర్షణ. మొదటి సగ భాగం కథ నెమ్మదిగా సాగుతుంది. రెండో భాగంలో వేగవంతమవుతుంది. ద్వితీయార్థంలోనే మలుపులన్నీ ఉంటాయి. అవి కూడా త్వరత్వరగానే వస్తుంటాయి. ప్రసూన్ జైన్ మాటలు బాగున్నాయి. చాలా చోట్ల పలికే డైలాగ్‌లు ప్రేక్షకుల చేత చప్పట్లు కొట్టిస్తాయి. ఇది కూడా ఈ సినిమాకు కలిసొస్తుంది.

ఈ సినిమాకు రాధాకృష్ణ జాగర్లమూడి (క్రిష్), కంగనా రనౌత్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి ఒక్కరే దర్శకులు అన్నట్టుగా ఉంటుంది. చారిత్రాత్మక ఘట్టాలు వచ్చినప్పుడు జరిగే పోరాటాల్లో వీరి పనితనం స్పష్టంగా కనిపిస్తుంది. ఇందులో సగానికి పైగా సినిమా కంగనా దర్శకత్వంలో తెరకెక్కింది. కొన్ని సన్నివేశాలు తప్ప ఈ చిత్రానికి కంగనా, క్రిష్ ఎవరు దర్శకత్వం వహించారన్నది చెప్పడం కష్టమే. మణికర్ణిక ఎంట్రీ, ఝాన్సీ లక్ష్మీబాయి కొడుకు మరణం, ఇంటర్వెల్‌కు ముందు, గ్వాలియర్ కోటలో నాటకీయ పరిణామాల్లో మధ్య లక్ష్మీబాయి సింహాసనాన్ని అధిష్టించడం వంటి మరికొన్ని యాక్షన్ సన్నివేశాలు సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి. అయితే కొన్ని సన్నివేశాలు మాత్రం 'బహుబలి', బాజీరావు మస్తాని, 'పద్మావత్' వంటి సినిమాల్లో చూసినవే అనిపిస్తాయి.

నటన : లక్ష్మీబాయిగా కంగనా రనౌత్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ ఇచ్చింది. ఈ పాత్రను, దర్శకత్వ శాఖను చాలా ఛాలెంజ్‌గా స్వీకరించి చేసింది. అది సినిమాలో మనకు కనిపిస్తుంది. ఈ పాత్రకు ఆమె న్యాయం చేసింది. పోరాట సన్నివేశాలు, భావోద్వేగ సీక్వెన్స్‌లు వచ్చినప్పుడు ఆమె నటన సూపర్బ్. జిసు సేతుపతి సపోర్టు యాక్టర్‌లా అనిపించాడు. మహ్మద్ జీషాన్ అయ్యూబ్ నటన ఆకట్టుకోలేదు. సురేశ్ ఒబెరాయ్ పాత్ర సినిమాకు మరో హైలైట్. డన్నీ దెన్జోంగ్పా (గులామ్ ఘుస్‌కాన్) ఆకస్మిక ఎంట్రీతో ఓకే అనిపించాడు. సినిమాలో తక్కువ సమయమే ఉన్నా తనకంటే ప్రత్యేకతను చాటుకున్న నటుడు అంకిత్ లోఖాండే(ఝక్కారి బాయి). మిస్తీ చక్రవర్తి (కాశి) స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంది. కులభూషణ్ ఖర్బంద అభినందించదగ్గ పాత్రలో కనిపించాడు. బ్రిటిష్ అధికారిగా చేసిన ఎడ్వర్డ్ సోన్నెన్‌బ్లిక్(గోర్డోన్), రిచార్డ్ (హుగ్ రోస్) పాత్రలు ఇందులో ప్రధానంగా చెప్పుకోదగ్గవి. మిగిలినవి ఓకే అనిపించాయి.

సినిమాలో పాటలు అంతగా బాగోకపోయినా బ్యాక్‌గ్రౌండ్ సంగీతం మాత్రం మెప్పించింది. జ్ఞాన శేఖర్ వీఎస్, కిరన్ డియోహన్స్ కెమెరా పనితనం సినిమాలో ప్రతి సీన్‌లోనూ కనిపిస్తుంది. ప్రొడక్షన్ డిజైన్ కూడా బాగుంది. నిక్ పోవెల్, టోడర్ లాజరోవ్, హబిబ్ రియాజ్ పోరాటాలు చూడాలనిపిస్తాయి. విజువల్ ఎఫెక్ట్స్ పనులు బాగున్నా కొన్ని చోట్ల ఇంకా మెరుగ్గా ఉంటే బాగున్ను అనిపిస్తాయి. ఇద్దరు దర్శకులు ఈ సినిమాకు పని చేసినా ఎక్కడా ఆ తేడా కనిపించకుండా చేసిన రమేశ్ భగవత్ ఎడిటింగ్ మెచ్చుకోదగ్గదే. చారిత్రాత్మక నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా చూడదగ్గదే. భావోద్వేగ సన్నివేశాలు, యుద్ధ పోరాటాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. కంగనా తన పెర్ఫార్మెన్స్‌తో సత్తా చాటింది. గణతంత్ర దినోత్సవానికి ముందు రోజు ఈ సినిమా విడుదల చేయడం సరైన సమయంగానే చెప్పొచ్చు.

చిత్రం : మణికర్ణిక
నటీనటులు : కంగనా రనౌత్, అతుల్ కులకర్ణి, జిషు సేతుపతి తదితరులు
దర్శకత్వం : క్రిష్, కంగనా రనౌత్
బ్యానర్ : జీ స్టూడియోస్
నిర్మాత : కమల్ జైన్, నిశాంత్ పిట్టి
మాటలు, పాటలు : ప్రసూన్ జోషి
కథ, స్క్రీన్‌ప్లే : కేవీ విజయేంద్ర ప్రసాద్
సంగీతం : శంకర్–ఇషాన్–లోయ్
సినిమాటోగ్రఫీ : కిరన్ డియోన్స్, జ్ఞాన శేఖర్ వీఎస్
ఎడిటింగ్ : రమేశ్ భగవత్,

– డిఆర్



ఉద్యమ ఘట్టాలు చూసి..
గాంధీజీతో నడిచి...

కొన్ని ఆకాంక్షలకు కారణాలు, లాజిక్కులు లాంటి నేపథ్యాలు ఉండవు. కాలంతోపాటు ప్రయాణం చేసి, ఎవరో ఒకరి ద్వారా ఏదో ఒకరోజు సాకారమవుతాయి. తరగని సంతృప్తినిస్తాయి. 'గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రత్యక్షంగా చూడాలన్న' బాల్యపు కోరిక నాతోపాటు పెరుగుతూ వచ్చింది. విద్యార్థి జీవితంలో.. పెరేడ్‌లో పాల్గొనే అవకాశం చేతుల్లోకి వచ్చినట్లే వచ్చి చేజారిపోయింది. ఆ ఆకాంక్ష మాత్రం 27 సంవత్సరాల పాటు నా కళ్లల్లో, కలల్లో నిలిచిపోయింది. ఈ ఏడాది నా చిరకాల స్వప్నం నెరవేరే తరుణం.. అవకాశం.. ఓ పాత్రికేయ మిత్రుని సహకారంతో ముందుకొచ్చింది.

హస్తినతో అనుబంధం 1992 నుంచీ అరాకొరగానే ఉంది. మూడేళ్లుగా మాత్రం పేగుబంధం పరుగులు పెట్టిస్తుంది. నా రాక, నిర్ధారణ అయిన సమయంలో 'ఆన్‌లైన్'లో రాష్ట్రపతి భవన్‌కి, నామమాత్రం రుసుము తలకు 50 రూపాయలు చెల్లించి, అనుమతి సంపాదించాడు నా కొడుకు సాకేత్. పొగమంచు దుప్పటిలా కప్పేసినప్పటికీ, 'మెట్రో'లో 'సెంట్రల్ సెక్రటేరియట్' వద్ద దిగి ఆటోలో 11.15 గంటలకల్లా రాష్ట్రపతి భవన్ 37వ గేటు ముందుకు చేరాం. ప్రభాత భానుడు అప్పటికింకా ఢిల్లీ వాసులకు 'హలో' చెప్పలేదు. కానీ, రెండురోజుల వర్షం కారణంగా దుమ్ము, కాలుష్యాన్ని తొలగించుకున్న పూబాలలు భిన్న రంగుల్లో, రూపాల్లో పలకరించాయి. ట్రిమ్ చేసుకున్న గుబురులు మరుగుజ్జు రూపంలోని సైనికుల్లా గోచరించాయి. కొత్త రంగులు అలుముకుంటున్న భవంతులు గోడలు, సాదరంగా స్వాగతమిచ్చాయి. సెక్యూరిటీ చెక్‌ఆప్ దాటి, రిసెప్షన్‌లో వెయిట్ చేస్తున్న మమ్మల్ని గోడలపై అలంకరించి ఉన్న 14 మంది రాష్ట్రపతుల పటాలు పలకరించాయి. 'ఆధార్' చూపించి అందరం ఫొటో దిగగా, పాస్ చేతిలో పెట్టారు అక్కడి ఉద్యోగులు. డబ్బులున్న చిన్న పర్సు తప్ప అన్నీ డిపాజిట్ చేసి, ప్రభుత్వం వారే నియమించిన 'ఖర్చులేని గైడ్'తో భవనం అంతర్భాగంలోకి అడుగుపెట్టాం.

చరిత్ర పుటలు

వియత్నాం నుంచి 1962లో ఆనాటి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణగారికి బహుమతిగా అందిన సమగ్ర బాహు అవలోకేశ్వర (అనగా వెయ్యిచేతులు, 12 తలలున్న బుద్ధుడు పద్మాసనంలో అభయముద్రతో) విగ్రహం ఎదురయ్యింది. కూడా వచ్చిన రచన తనను తాను పరిచయం చేసుకుని, ఎంత సమయంలో చూడాలో, ఏమేం చేయకూడదో సూచనలిచ్చి, చరిత్ర పుటలు తెరచింది. రాజధానిని కోల్‌కతా నుంచి ఢిల్లీకి మార్చాలన్న 1911వ సంవత్సరం దర్బారు నిర్ణయం, 400 ఎకరాల అవసరాన్ని తేల్చింది. జైపూర్ మహారాజు ఆధీనంలోని రైజినా, మాల్చా గ్రామస్థులను భూసేకరణ యాక్ట్‌తో 300 కుటుంబాలను తరలించి, 340 ఎకరాలలో నిర్మాణం చేపట్టారు. మూడంతస్థులుగా, 340 గదులతో, 1912 నుంచి 1929 వరకూ నిర్మాణం జరిగిన సుందర భవంతి నూతన వైస్రాయ్ కోసం నిర్మింపబడింది. తొలుతగా వైస్రాయ్ హౌస్ తర్వాత ప్రెసిడెన్షియల్ బిల్డింగ్‌గా పేరుగాంచి, దేశానికి గణతంత్ర దినోత్సవం ఏర్పడిన తర్వాత రాష్ట్రపతి భవన్‌గా మారి, అదే పేరుతో స్థిరపడిపోయింది. 1931లో అధికారికంగా ప్రారంభమైన ఈ నివాసంలో ఆకర్షణలు ఎన్నెన్నో. రెండు లక్షల చదరపు అడుగుల్లో ఒక బిలియన్ ఇటుకలతో, మొఘల్ నిర్మాణ శైలిలో సాంచీ స్థూపం ఉపరితలమైన వలయాకారం, కర్నాటకలోని జైనమందిరంలోని గంటలు, ప్రధానంగా జైపూర్ రంగులు, బ్రెజిలియన్ అద్దాలు, శాండ్లియర్లతో ప్రపంచంలోనే అతిపెద్ద అధికారిక నివాస గృహంగా చరిత్రకెక్కిందీ భవనం.

అబ్బురపరచే నిర్మాణశైలి

దర్బారు హాలులోని 5వ శతాబ్దపు బుద్ధవిగ్రహం ఉంది. దాని ముందుగా నేలపై గీచిన సరళరేఖ ఉత్తర ఢిల్లీ, దక్షిణ ఢిల్లీని విభజించే విభజన రేఖ మాత్రమే కాదు. 42 మీటర్ల ఇండియాగేట్ పైభాగాన నిలబడినంత అగ్రస్థానాన ఉంటుంది. రైజినా కొండపై ఠీవిగా నిలబడ్డ ఈ భవనం చరిత్రకు సజీవసాక్ష్యం. నాటి సి.రాజగోపాలాచారి నుంచీ ఎందరెందరో అగ్రజులతో అధికార ప్రమాణాలు చేయించింది. దేశంలో ఉన్నత పురస్కారాల గ్రహీతలను చూసింది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గొప్పవారి గొంతులు వింది. అధికారిక పురస్కారాలు అందుకొనేది ఈ హాలులోనే. దీనికి ఎదురుగా విదేశీ అతిథులను పలకరించే నార్త్ డ్రాయింగ్ రూం ఉంది. కొంచెం ముందుకెళితే రాష్ట్రపతి భవనానికే తలమానికమైన అశోకాహాల్...ఉపరితలాన అత్యద్భుతమైన పెయింటింగ్, దేదీప్యమానమైన బ్రెజిల్ శాండ్లియర్స్, చరిత్ర పుటలలో భాగస్వామమైన జర్దోసి జెండాలు కనిపించాయి.


జ్ఞాపికల షోరూం ..

లెక్క కట్టలేని మానసిక మేధో శ్రమ నుంచి కళాకారుల చేతుల్లో పుట్టిన కళాకృతులు, లక్షలాది శ్రామికుల స్వేద జలం నుంచి రూపుదిద్దుకున్న రాష్ట్రపతి భవన్‌లోని అశోకాహాల్ వెనుకభాగంలో రాష్ట్రపతి నివాసం ఉంది. అంతకుముందు వైస్రాయ్ జనరల్ ఆఫీసు రూపు మార్చుకుని, విదేశీ అతిథిగృహంగా మారింది. ఆయా అతిథులకు అనుగుణంగా ఆ దేశ జెండా గౌరవపూర్వకంగా గాల్లో ఎగురుతూ ఉంటుంది. అంతర్భాగంలో ఫొటోలకు అనుమతి లేనికారణంగా వెలుపల భాగంలో, జైపూర్ మహారాజుల ఉదారతత్వానికి నిదర్శనంగా నిలచిన నిలువెత్తు స్థూపం ముందు కొన్ని ఫోటోలు తీసుకుని, జ్ఞాపికల షోరూంలో రూ.190 నుంచి రూ.6 వేల మధ్య విలువగల వస్తువుల్లో నచ్చినవి కొనుక్కుని, మ్యూజియం వైపు అడుగులు వేశాం.

ఉట్టిపడే సాంకేతికత

రాష్ట్రపతి మ్యూజియం 30వ గేటులో ఉంటుంది. ఎంప్లాయీస్ క్వార్టర్స్, గుర్రపుశాలలు, బ్యాంక్, పోస్టాఫీస్, మందిరం, మసీదు, స్కూల్ అన్నీ ఈ ప్రాంతంలోనే ఉంటాయి. ఇది దాదాపు మూడు కిలోమీటర్లు ఉంటుంది. ఆన్‌లైన్‌లోగానీ, ఆఫ్ లైన్‌లోగానీ రూ.50తో టిక్కెట్ కొనుగోలు చేయవచ్చు. గతంలో రాష్ట్రపతి భవన్‌లోని జ్ఞాపికలను, మెడల్స్‌ని ఈ ప్రాంతంలో రెండు భవంతులలో భద్రపరిచారు. తొలుతగా 2014లో నాటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా ప్రారంభించిన ఈ భవంతులలో రెండు సెల్లార్‌లు, ఒక ఉపరితల భవనంగా అత్యంత ఆధునికంగా రూపొందించారు. అక్కడక్కడా సెన్సర్ల సాయంతో వెలిగే లైట్లు, తెరుచుకునే ద్వారాలు, ఎలివేటర్లు, ఎస్కలేటర్లతో సాంకేతికంగా రూపుదిద్దుకుంది ఈ ప్రాంగణం. తొలుతగా అశోకచక్రంపై నుంచి నాలుగు సింహాలు, ఆనాటి బ్రిటిష్ పాలకులు ఉపయోగించిన గుర్రపు బగ్గీలు, రాజీవ్‌గాంధీ వరకూ ప్రధానులు ఉపయోగించిన బుల్లెట్ ప్రూఫ్ మెర్సిడజ్‌బెంజ్ వాహనాలు స్వాగతం పలుకుతాయి. రాష్ట్రపతి భవన నిర్మాణానికి ప్రధాన ఆర్కిటెక్ ఇంజనీర్ల సంభాషణలు జరుపుతున్నట్లుండే బొమ్మలు దర్శనమిస్తాయి. మరోపక్క సామాన్లు తరలించడానికి వాడిన ట్రక్ నమూనా ఉంటుంది. అంతర్భాగంలో ఎడ్విన్‌లాండ్‌సీర్ ల్యూటన్స్ చేతిలో రూపుదిద్దుకున్న భిన్న ఆకృతుల కుర్చీలు, సోఫాలు, రైటింగ్ టేబుల్స్‌తో పాటు 13 మంది రాష్ట్రపతులు వాడిన వస్తువులు, అధికారిక పర్యటనలలో ప్రపంచం నలుమూలల నుంచి అందిన అత్యద్భుతమైన కళాఖండాలు కొలువై ఉంటాయి. కాన్సెప్ట్ ఓరియంటెడ్‌గా కొలువుదీరిన చిత్రరాజాలను, ఆర్‌బిఐ విడుదల చేసిన నాణాలను, చెక్కగాజు, బంగారం, వెండి, పింగాణి రూపంలోని బహుమతులు ఉన్నాయి. వాటితోపాటు మొఘల్ గార్డెన్‌లో విహరించే 340 రకాల పక్షుల కిలకిలరావాలు దేశాన్ని పాలించిన బ్రిటిష్ పాలకులు, వారి భార్యలు, సుభాష్ చంద్రబోస్ స్వయంగా రాసిన ఉత్తరం, సంతకం, రాజ్యాంగ రచన కోసం కమిటీ ఏర్పడడం, చేతితో రాసిన రాజ్యాంగ పీఠిక, ఆనాటి సభ్యుల సంతకాలు.. స్వాతంత్ర్యోద్యమ చరిత్ర బొమ్మలు హృద్యంగా కళ్లకు కట్టాయి. వాటిని చేతితో టచ్‌చేస్తే చరిత్ర వినిపించే ఆధునికత సౌకర్యం జత చేశారు. మ్యూజియంలోని వర్చువల్ రియాలిటీ హాల్లో గాంధీజీ మనతో మాట్లాడుతున్నట్లు, మనం తనలో కలిసి అడుగులు వేస్తున్నట్లు ప్రొజెక్టర్‌లో మన రూపం వస్తుంది. అలాగే, మ్యూజియంలోని మినీ థియేటర్‌లో స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలు త్రీడీ సినిమాగా ఐదు నిమిషాలు ఉంటుంది.







రెండోభాగంలో, 26 గదులు పూర్తిగా పిట్టలు, పెయింటింగ్స్, డైనింగ్ టేబుల్స్ నిండి ఉన్నాయి. ఆఖరిగదిలో భారతదేశ చరిత్రలో కీలకఘట్టాలైన స్వాతంత్ర్యోద్యమ పోరాటం తర్వాత, స్వేచ్ఛ లభించిన క్షణాలు గుర్తుచేస్తాయి. దేశాన్ని సర్వసత్తాకంగా సార్వభౌమాధికారంతో తీర్చిదిద్దుకునే క్రమంలో జరిగిన మేధోమధనాలను చూడాలంటే ఒక్కరోజు అనేది అతి స్వల్పమే! బాలలకిదో చారిత్రక పాఠం, అమూల్య బహుమానం.. ఇలా ఒక్కో ప్రదేశం ఒక్కోరకమైన ఉద్వేగాలను కలిగిస్తుంది ఈ సందర్శన. అది అనుభవించే వ్యక్తి సిద్ధాంతాలపైన, మానసిక పరిణితిపైనేగాక ఆస్వాదించే హృదయాన్ని బట్టి కూడా ఉంటుంది. జీవితపు పుస్తకంలో అందమైన పేజీని లిఖించుకునే అవకాశాన్నిచ్చిన సమయం, సాహిత్యతో సంభాషణలు, జగదీశ్‌తో రాజకీయ చర్చలు, సాకేత్‌తో ముచ్చట్లతో ముగిసిందీ ప్రయాణం.



- డాక్టర్ శమంతకమణి

ప్రకృతి పరవశం.. తేక్కడి!



ప్రకృతి సిద్ధమైన అందాల ప్రాంతం కేరళలోని తేక్కడి. ఇది సముద్ర మట్టానికి 900–1800 మీటర్ల ఎత్తులో ఉంటుంది. పర్యాటక ప్రేమికులకు తేక్కడి అనే పేరు వినగానే ఘీంకారాలు చేసే ఏనుగులు, విడిపోయిన కొండలు, సుగంధ ద్రవ్యాల వాసనలు విరజిమ్మే తోటలు గుర్తొస్తాయి. కుమిలి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది తేక్కడి. వివిధ ప్రాంతాల నుంచి తరచుగా పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. మన దేశంలోని అత్యద్భుతమైన వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల్లో ఒకటైన పెరియార్ అడవీ ప్రాంతం ఇక్కడకు దగ్గరలోనే ఉంది. జంతు ప్రేమికులకు ఇది చక్కటి ప్రదేశం. అందమైన తోటలు, ఎత్తయిన పర్వతాలపై నడక, ట్రెక్కింగ్ పర్యాటకులను మరింత అబ్బురపరుస్తాయి.

అరుదైన జంతుజాతుల ఆవాసం

పెరియార్ అడవిలో నివాసించే పక్షులు, జంతువులు, మొక్కల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. అడవిలో కనిపించే కొన్ని ఆసక్తికరమైన విషయాలు చాలానే ఉన్నాయి. ఈ వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో మొత్తం 1965 పుష్పించే మొక్కల్లో 171 గడ్డి రకాలు, 143 ఆర్కిడ్ రకాలు ఉన్నాయి. దక్షిణ భారతదేశ కోనిఫెరస్, పోడోకార్పస్, వలిచైనస్‌లు కేవలం ఇక్కడే కనిపిస్తాయి. అలాగే, ఇక్కడ జంతు సంపదకు కొదువే లేదు. 35 రకాల్లో కనిపించే ఏనుగులు, సాంబార్ డీర్, అడవి ఎలుగుబంట్లు ఉంటాయి. దీనికి దిగువ ప్రాంతంలో నీలగిరీ తార్ అనే అరుదైన జీవిని చూడవచ్చు. అదే విధంగా రాతి ప్రదేశాల్లో ఉండే సింహాలు, కోతులు, మలబార్ జెయింట్ ఉడతలు, ఎగిరే ఉడతలు, పులి, అడవి పిల్లి, స్లాత్ బేర్ వంటివి కనిపిస్తాయి. ఇంకా ఇక్కడ వలస వచ్చిన పక్షులతో సహా 265 పక్షిజాతులు ఉంటాయి.



హార్న్, కొంగ, వడ్రంగి పిట్ట, చెకుముకి పిట్ట, రాస్టర్, నీటికాకి, గ్రాకెల్, డార్టర్ మొదలైనవి. సరీసృపాలైన కోబ్రా, తాచుపాము, కట్లపాము, విషం లేని అనేక పాములు, మానిటర్ బల్లి కనిపిస్తాయి. సాధారణ కప్పలతో పాటు రంగురంగుల మలబార్ గ్లైడిరగ్ కప్ప, కామన్ ఇండియన్ చిరుకప్ప, ఫన్‌గోయిడ్ కప్ప వంటి ఉభయచరాలు చాలా ఉంటాయి. పెరియార్ వాగులు, వంకల్లో అనేక రకాల జాతుల చేపలు కనిపిస్తాయి. ముషేర్, అదృశ్యమైపోతున్న భారతదేశ గేమ్‌ఫిష్ వంటివి ఉంటాయి. అలాగే, సరస్సులో ఉండే ఏకైక క్షీరదం వోట్టర్. బోట్లో ప్రయాణించేటప్పుడు దీన్ని గమనించవచ్చు. తోటలు, టీ, యాలకులు, మిరియాల చెట్లు, కాఫీ తోటలు పెరియార్ వన్య సంరక్షణ కేంద్రం చుట్టూ ఉన్నాయి. ఇక పెరియార్ అడవిలోపల రెండు రకాల వాచ్ టవర్లు ఉంటాయి. ఫారెస్టు ఇన్ఫర్మేషన్ సెంటర్, ఇక్కడికి వెళ్లటానికి తెక్కడిలోనే రిజర్వేషన్లు చేసుకోవచ్చు.

★



చిన్నారి

జోక్:

టీచర్: దొంగ ఆ గదిలోకి వెళ్లాడని తెలిసినా.. ఎందుకు పట్టుకోలేదురా..?

చింటూ: గది బయట 'ఇతరులు లోనికి పోరాదు!' అని బోర్డు రాసుంది కదా సార్!

పొడుపు కథ

మనుషులకు ముక్కుమీద కోపం ఉంటే దీని ముక్కు మీద కొమ్ము ఉంటుంది. రౌడీలు కత్తిని చేతిలో పట్టుకుంటే.. ఇది కత్తిని తన పేరులో పెట్టుకుంది!

జవాబు : ఖడ్గం

నీడ కనిపెట్టండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఒక బాబు ఆడుకుంటున్నాడు. ఆ బాబుకి చెందిన అసలు నీడ ఏదో కనిపెట్టండి?!



హాయ్ చిన్నారులూ,

ఈరోజు రిపబ్లిక్ డే కదా.. అందరికీ శుభాకాంక్షలు.

ఆగస్టు 15లాగానే ఈరోజు కూడా జెండా పండగ.

1947 ఆగస్టు 15 మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు. మన దేశం ఎలా ఉండాలో, ఎలా పరిపాలించుకోవాలో, పౌరులుగా మన బాధ్యతలు ఏమిటో, హక్కులు ఏమిటో... మన రాజ్యాంగంలో లిఖితపూర్వకంగా నిర్దేశించుకొని.. చట్టసభలో చర్చించుకొని ఆమోదించుకున్నాం. జనవరి 26న మనదేశాన్ని సర్వసత్తాక స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నాం. అందుకనే దీనిని 'గణతంత్ర దినోత్సవం' అంటారు. మనది లౌకికరాజ్యమని, అన్ని మతాలూ కులాలూ సమానమేనని, పౌరులు అందరికీ సమాన హక్కులు ఉంటాయని మన రాజ్యాంగంలో రాసుకున్నాం. దాని ప్రకారం దేశాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనం అధికారం ఇచ్చే పాలకులది, ప్రభుత్వాలది. అలాగే వారు మన రాజ్యాంగం చెప్పిన విధంగానే పరిపాలిస్తున్నారా? లేదా? అన్నది చూడాల్సింది కూడా పౌరులే! గణతంత్ర దేశం అన్నింటా గర్వకారకంగా ఉండేలా జాగ్రత్త పడాల్సింది జనమే! పెద్దయ్యాక మీరు కూడా పౌరులే! దేశాన్ని ముందుకు నడిపించాల్సింది మీరే!

గణతంత్ర దినోత్సవం

గణతంత్ర దినోత్సవం
వచ్చింది! వచ్చింది!
ఎదఎదలో సంబరం
తెచ్చింది! తెచ్చింది!

ఆకాశాన జెండా
ఎగిరింది! ఎగిరింది!
మనదేశ గౌరవమును
చాటింది! చాటింది!

దేశభక్తుల త్యాగం
తెలిపింది! తెలిపింది!
దేశముకై అందరిని
బతకమంది! బతకమంది!





శ్రావణి
4వ తరగతి,
మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక,
పాఠశాల మెయిన్,హెచ్.మురవణి,
కర్నూలు జిల్లా.

నేను గీసిన బొమ్మ





ఎం.విష్ణువర్ధన్ నాయక్
6వ తరగతి
ఎపిటిడబ్యుఆర్ స్కూల్ బాయ్స్,
టి. సుండుపల్లి,
వైఎస్ఆర్ కడప.

డి. అభిలవ్
1వ తరగతి,
అరవింద హైస్కూల్,
కుంచనపల్లి,
గుంటూరు జిల్లా.





పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన
మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com

ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో జకోవిచ్



జకోవిచ్

- నేడు మహిళల సింగిల్స్ ఫైనల్
- ఒసాకాను క్విటోవో నిలువరించేనా?
- మధ్యాహ్నం 2.00 గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో
- 27న నాదల్‌తో అమీతుమీకి జకో రెడీ



ఒసాకా



క్విటోవో

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్ పోరు శనివారం జరగనుంది. జపాన్‌కు చెందిన నాల్గోసీడ్ నోమీ ఒసాకా, 8వ సీడ్ చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్విటోవాల మధ్య టైటిల్‌పోరు సాగనుంది. వీరిద్దరిలో ఎవరు టోర్నీ విజేతగా నిలిచినా ఆస్ట్రేలియన్ ఓపెన్ నయా ఛాంపియన్‌గా అవతరించనున్నారు. ఇక శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో టాప్ సీడ్ సెర్బియా ఆటగాడు జకోవిచ్ ఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు. ఆదివారం జరిగే టైటిల్ పోరులో స్పెయిన్‌బుల్ రఫెల్ నాదల్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. నేడు సెమీస్ పోరులో 28వ సీడ్ ఫౌలీ(ఫ్రాన్స్) చిత్తుగా ఓడించాడు. ఫైనల్‌కు చేరే క్రమంలో జకోవిచ్ ప్రత్యర్థి ఆటగానికి కేవలం నాలుగు పాయింట్లు మాత్రమే సమర్పించుకోవడం విశేషం. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన జకో 6-0, 6-2, 6-2 తేడాతో ఫౌలీని చిత్తుగా ఓడించాడు. దీంతో తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌లోకి అడుగుపెట్టిన ఫౌలీకు నిరాశే ఎదురైంది. జకో ఆస్ట్రేలియా ఓపెన్ టోర్నీలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో అతి తక్కువ సమయంలో ఈ గేమ్‌ను ముగించడం విశేషం. అంతేగాకుండా ఇంతకు ముందు 2015 యుఎస్ ఓపెన్ సెమీఫైనల్లో క్రోటియా మారిన్ సిలిక్‌పై 6-0, 6-1, 6-2 తేడాతో గెలిచిన రికార్డుకు దగ్గరలో ఈ మ్యాచ్ నిలిచింది. జకోవిచ్ ఆరు ఏస్‌లు సంధించి ఏడు బ్రేకింగ్ పాయింట్లుతో విజయం సాధించాడు. నాదల్‌తో ఆదివారం జరగబోయే ఫైనల్ పోరులో గెలిచి కెరీర్‌లో 15వ గ్రాండ్‌స్లామ్‌ను సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు.

సెమీస్‌లో సైనా

క్వార్టర్స్‌లో ఓడిన సింధు, శ్రీకాంత్



జకార్తా : ఇండోనేషియా మాస్టర్స్ ఓపెన్ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి సైనా నెహ్వాల్ దూసుకెళ్లగా, పివి సింధు, కిదాంబి శ్రీకాంత్‌లు ఓటమిపాలై నిరాశపరిచారు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో సైనా 21-7, 21-18 తేడాతో చోఛువాంగ్(థాయ్)ను చిత్తుచేసింది. భారత్ స్టార్ షట్లర్ సైనా తొలినుంచి ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించింది. ఇక పివి సింధు స్పెయిన్‌కు చెందిన కరోలినా మారిన్ చేతిలో 11-21, 12-21 తేడాతో ఓడింది. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 18-21, 19-21 క్రిష్టీ(ఇండోనేషియా)పై పోరాడి ఓడాడు. దీంతో క్వార్టర్స్‌లోనే పివి సింధు, శ్రీకాంత్‌ల కథ ముగిసినట్లైంది. సెమీస్‌లో సైనా చైనాకు చెందిన లీబింగ్జియావోతో శనివారం తలపడనుంది. మరో సెమీస్‌లో మారిన్ చైనాకే చెందిన చెన్-యుఫీతో పోటీపడనుంది.

ఉమేష్ వన్‌మ్యాన్ షో

- కేరళపై ఇన్నింగ్స్ 11 పరుగుల తేడాతో గెలుపు
- రంజీట్రోఫీ ఫైనల్లో విధర్భ



వయనాడ్ : రంజీట్రోఫీ ఫైనల్లోకి విధర్భజట్టు ప్రవేశించింది. ఈ మ్యాచ్‌ను విధర్భజట్టు రెండురోజుల్లోనే ముగించడం విశేషం. శుక్రవారం సెమీఫైనల్ పోటీల్లో భాగంగా రెండోరోజు విధర్భ బౌలర్ ఉమేష్ యాదవ్ దెబ్బకి కేరళ జట్టు ఇన్నింగ్స్ 11 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఉమేష్ యాదవ్ అద్భుతమైన బౌలింగ్ చేసి ఈ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లో కలిపి 79 పరుగులిచ్చి 12 వికెట్లు తీశాడు. రెండో రోజు ఐదు వికెట్లు నష్టపోయి 171 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విధర్భ 208 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కేరళ జట్టు విధర్భ బౌలర్లు ఉమేష్ యాదవ్, ఠాకూర్ రాణించడంతో 24.5 ఓవర్లలోనే 91 పరుగులకు చేతులెత్తేసింది. కేరళ బ్యాట్స్‌మెన్లు అరుణ్‌కార్తిక్ మినహా ఎవరూ చెప్పుకోదగ్గ పరుగులు చేయలేదు. విదర్భ బ్యాట్స్‌మెన్ ఫజల్ 75 పరుగులతో టాప్ స్కోరుగా నిలిచాడు. ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉమేష్ యాదవ్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ పొందాడు. మరో సెమీస్ పోరులో సౌరాష్ట్ర జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఏడు వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. అంతకుముందు కర్ణాటక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగులకు ఆలౌటైంది.

అదే జోరు కొనసాగేనా?



నేడు న్యూజిలాండ్‌తో రెండో వన్డే
ఉదయం 7.30 ని.ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

మౌంట్‌మాఘనయ్ : తొలి వన్డేలో న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించిన టీమిండియా నేడు ఆతిథ్య జట్టుతో రెండో వన్డేకు సిద్ధమైంది. బౌలర్లు సత్తా చాటిన నేపియర్ వన్డేలో కోహ్లీ సేన అన్ని విభాగాల్లో సమిష్టిగా రాణించింది. కివీస్ ఓపెనర్లను మహ్మద్ షమి త్వరగా పెవీలియన్‌కు పంపగా, ఆ తర్వాత కుల్దీప్, చాహల్‌లు మిడిలార్డర్, లోయర్ ఆర్డర్ భరతం పట్టారు. దీంతో నేడు జరిగే రెండో వన్డేలో కివీస్ జట్టు భారత్‌పై ఏమాత్రం ప్రదర్శన చేయబోతుందో వేచిచూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆస్ట్రేలియా పర్యటనను దిగ్విజయంగా ముగించుకొని కివీస్‌లో కాలుమోసిన టీమిండియా అదే జోరును న్యూజిలాండ్‌పైనా ప్రదర్శిస్తోంది.

ఇక బ్యాటింగ్ విషయానికొస్తే స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేక్రమంలో టీమిండియా ఓపెనర్ శిఖర్ ధావన్ అర్ధసెంచరీ, విరాట్ 46 పరుగులు చేసి కివీస్ బౌలర్ల భరతం పట్టారు. కివీస్ నిర్దేశించిన 157 పరుగుల లక్ష్యాన్ని కేవలం 34.5 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఒకవేళ నేటి వన్డేలో తొలిగా బ్యాటింగ్ చేయాల్సి వస్తే భారీ స్కోర్ నమోదు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హార్దిక్ పాండ్యా, రాహుల్‌లపై సిఓఏ నిషేధం ఎత్తివేయడంతో పాండ్యా భారతజట్టుతో కలిశాడు. కెఎల్ రాహుల్ మూడో వన్డేలో జట్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో టీమిండియాకు ముగ్గురు ఆల్‌రౌండర్లు అందుబాటులో ఉన్నారు.

విజయ్ శంకర్ తొలి వన్డేలో ఆకట్టుకోలేకపోయాడు. నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 19 పరుగులు సమర్పించుకొన్నా వికెట్ సాధించలేకపోయాడు. దీంతో రవీంద్ర జడేజా, పాండ్యాలలో ఒకరికి చోటు దక్కడం ఖాయం. మూడో వన్డే అనంతరం కోహ్లీకి విశ్రాంతినిస్తున్న నేపథ్యంలో శుభ్‌మన్ గిల్ జనవరి 28న వన్డేల్లో అరంగేట్రం చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. గత పర్యటనలో టీమిండియా 0-4తో సిరీస్ పరాజయాన్ని చవిచూసినా, ఇప్పటి వన్డే సిరీస్‌లో గెలుపు ఖాయం కనబడుతోంది.

టీమిండియా (అంచనా) : కోహ్లీ(కెప్టెన్), రోహిత్, ధావన్, ధోనీ(కీపర్), కేదర్ జాదవ్, దినేష్ కార్తీక్/రాయుడు, జడేజా/హార్దిక్ పాండ్యా, చాహల్, కుల్దీప్, షమి, భువనేశ్వర్, సిరాజ్/ఖలీల్ అహ్మద్.

న్యూజిలాండ్ (అంచనా) : విలియమ్సన్(కెప్టెన్), టేలర్, లాథమ్, గుప్తిల్, గ్రాంథోమ్, బౌల్ట్, నికోలస్, బ్రాస్‌వెల్, ఫెర్గుసన్, టిమ్ సౌథీ/హెన్రీ, కోలిన్ మున్రో/సాట్నర్.

హారికకు పద్మశ్రీ





గౌతం గంభీర్ (క్రికెట్) | సునీల్ ఛెత్రీ (ఫుట్‌బాల్) | ప్రశాంత్‌సింగ్ (బాస్కెట్‌బాల్) | అజయ్ ఠాకూర్ (కబడ్డీ) | భజరంగ్ పూనియా (కుస్తీ) | శరత్ కమల్ (టేబుల్ టెన్నిస్) | బంబేలా దేవి (ఆర్చరీ) | పద్మభూషణ్ భచేంద్రిపాల్ (పర్వతారోహణం)

క్రీడారంగానికి తొమ్మిది పురస్కారాలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ : క్రీడారంగంలో తొమ్మిది మందికి కేంద్ర ప్రభుత్వం పురస్కారాలను ప్రకటించింది. క్రీడారంగానికి సంబంధించి ద్రోణవల్లి హారిక(చెస్), గౌతం గంభీర్(క్రికెట్), సునీల్ ఛెత్రీ(ఫుట్‌బాల్), ఆచంట శరత్‌కమల్(టేబుల్ టెన్నిస్), అజయ్ ఠాకూర్(కబడ్డీ), ప్రశాంత్‌సింగ్ (బాస్కెట్‌బాల్), భజ్‌రంగ్ పూనియా(కుస్తీ), బంబేలా దేవి(ఆర్చరీ)లకు పద్మశ్రీ పురస్కారాలు వరించాయి. వీరిలో భచేంద్రి పాల్(పర్వతారోహణం)కు మాత్రం పద్మ విభూషణ్ పురస్కారం దక్కింది. ద్రోణవల్లి హారిక, సునీల్ ఛెత్రీ తెలుగు వారు కావడం గమనార్హం.



విజేతలుగా నిలిచిన మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హైదరాబాద్ మహిళల జట్టు

కెఎల్ ట్రోఫీలో హైదరాబాద్ జట్ల ప్రతిభ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోని వడ్డేశ్వరం కెఎల్ యూనివర్సిటీలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న కెఎల్ ట్రోఫీ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. బాస్కెట్‌బాల్ పురుషుల విభాగంలో మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హైదరాబాద్ విజేతగా నిలవగా, ఆంధ్రా లయోలా కాలేజీ విజయవాడ, నరసింహారెడ్డి కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ హైదరాబాద్ తరువాతి రెండు స్థానాలు దక్కించుకున్నాయి. పురుషుల విభాగం వాలీబాల్లో సెయింట్ ఆన్స్ కాలేజీ చీరాల విజయం సాధించగా చీరాల ఇంజనీరింగ్ కాలేజీ, విష్ణు ఇంజనీరింగ్ కాలేజీ భీమవరం రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగం బాస్కెట్ బాల్లో మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ హైదరాబాద్ ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా కెఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం వడ్డేశ్వరం రెండో స్థానంలో నిలిచింది. విజేతలకు వర్సిటీ విసి డాక్టర్ ఎల్ఎస్ఎస్.రెడ్డి, ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రామ్‌కుమార్, రిజిస్ట్రార్ ఆర్ఆర్.లక్ష్మీకాంతం తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.

విరిసిన పద్మాలు

న్యూఢిల్లీ : న్యూఢిల్లీ : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ప్రభుత్వం 112 మందికి పద్మ అవార్డులను ప్రకటించింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన నలుగురు పద్మ విభూషణ్, 14 మంది పద్మభూషణ్, 94 మంది పద్మశ్రీ అవార్డులు అందుకోనున్నారు. పద్మవిభూషణ్ పొందిన వారిలో ఒకరు, పద్మభూషణ్ పొందిన వారిలో ఇద్దరు విదేశీయులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు, తెలంగాణ నుంచి ఇద్దరు, మొత్తంగా నలుగురు తెలుగు వారికి పద్మశ్రీ అవార్డులు వరించాయి. అవార్డులు పొందిన వారిలో 21 మంది మహిళలు ఉన్నారు.



పద్మ విభూషణ్‌లు వీరే!

1. టీజెన్‌బాయ్-చత్తీస్‌గఢ్
2. ఇస్మాయిల్ ఒమర్ గులే-జిబౌటి (ఆఫ్రికా)
3. అనిల్‌కుమార్ మణీభాయ్ నాయక్-మహారాష్ట్ర
4. బల్వంత్ మేరేశ్వర్ పురంధరే- మహారాష్ట్ర

పద్మభూషణ్‌కు ఎంపికైనవారు(14)

1. జాన్ చాంబర్స్-యుఎస్ఎ
2. సుఖదేవ్ సింగ్ దిండ్సా-పంజాబ్
3. ప్రవీణ్ గోవర్ధన్-దక్షిణాఫ్రికా
4. మహాసయ్ దరమ్ పాల్-ఢిల్లీ
5. దర్శన్ లాల్ జాన్-హర్యానా
6. అశోక్ లక్ష్మణరావు-మహారాష్ట్ర
7. కరియా ముండా-జార్ఖండ్
8. బుద్ధాదిత్య ముఖర్జీ-పశ్చిమ బెంగాల్
9. మోహన్‌లాల్ విశ్వనాధన్ నాయర్-కేరళ
10. నాదంబి నారాయన్-కేరళ
11. కులదీప్ నాయర్-ఢిల్లీ
12. బచేంద్రి పాల్-ఉత్తరాఖండ్
13. వికె సుంగ్లు-ఢిల్లీ
14. హుకుమ్‌దేవ్ నారాయణ్ యాదవ్-బీహార్

మార్కెట్లోకి గుడ్‌నైట్ దోమల బత్తీలు



ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

దోమల నివారణకు గాను గోద్రేజ్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ సంస్థ సరికొత్త ఉత్పత్తిని ఆవిష్కరించింది. గుడ్‌నైట్ బ్రాండ్‌తో ఇప్పటికే మార్కెట్లో వివిధ రకాల దోమల నివారణ ఉత్పత్తులను అందిస్తోన్న ఈ సంస్థ తాజాగా ప్రకృతి నుంచి సహజ సిద్ధంగా తయారు చేసిన 'గుడ్‌నైట్ న్యాచురల్స్ నీమ్ అగర్‌బత్తీలను' అందుబాటులోకి తెచ్చినట్లు ఆ కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దోమల అగర్‌బత్తీలను పూర్తిగా 100 శాతం ప్రకృతి సిద్ధమైన దోమల నివారిణిగా రూపొందించినట్టుగా పేర్కొంది. దేశంలో ప్రమాదకరమైన రసాయనాలతో తయారు చేసిన దోమల బత్తీల విక్రయం విరివిగా సాగుతుండగా.. వీటికి భిన్నంగా ప్రకృతిలో లభించే వేప, పసుపుతో పాటు కొన్ని సహజసిద్ధమైన వన మూలికల మిశ్రమంతో వీటిని తయారు చేసినట్టుగా వెల్లడించింది. పది అగర్‌బత్తీలుండే ఈ బత్తీల ప్యాకెట్ ధరను కంపెనీ రూ.15లుగా నిర్ణయించినట్లు పేర్కొంది. ఒక్క బత్తీ దాదాపు మూడు గంటల పాటు వెలుగుతూ దోమలను ఇంట్లోకి రాకుండా కవచంలా కాపాడుతాయని పేర్కొంది.

పురుగుల మందుల తయారీలోకి నాట్కో

రూ.100 కోట్లతో నెల్లూరులో ప్లాంట్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ ఔషద ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మా పురుగుల మందుల తయారీ విభాగంలోకి అడుగు పెట్టింది. ఈ విషయాన్ని సంస్థ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. సముచిత వ్యవసాయ మందుల తయారీ నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో ప్లాంటు ఏర్పాటు పనులను ప్రారంభించినట్టుగా కంపెనీ తెలిపింది. ఇప్పటి వరకు క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధులకు జెనరిక్ మందుల తయారీలో నాట్కో సంస్థ తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకొని ముందుకు సాగుతోంది. సంస్థను బహుముఖంగా విస్తరించాలన్న వ్యూహంలో భాగంగానే కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా సమాచారం. అంతర్జాతీయ వ్యవసాయ మందుల తయారీ దిగ్గజాలైన బాయర్, నోవార్టీస్ సంస్థలు కూడా 90వ దశకం వరకు కూడా మొక్కల సంరక్షణ మందులతో పాటుగా మెడిసిన్స్‌ను కూడా తయారు చేసిన సంగతి తెలిసిందే. ఇదే మాదిరిగా నాట్కో కూడా ఇప్పుడు రెండు విభాగాల్లోనూ తమ సత్తా చాటాలని నిర్ణయించుకున్నట్టుగా సమాచారం. ఈ ఏడాది ముగింపు నాటికి నెల్లూరులో ఏర్పాటు చేస్తున్న ప్లాంటు నుంచి ఉత్పత్తి మొదలవగలదని తాము భావిస్తున్నామని కంపెనీ పేర్కొంది. దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో ఈ ప్లాంటు పనులను చేపడుతున్నట్టుగా సంస్థ తెలిపింది.

రెడీ టు ఓట్

శ్రీకాకుళం విద్యార్థుల విన్యాసం
జీనియస్, వండర్స్ బుక్ ఆఫ్ రికార్డుల్లో నమోదు



రెడీ టు ఓట్ ఆంగ్ల అక్షరం నమూనాలో విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రెడీ టు ఓట్ అనే 11 ఆంగ్ల అక్షరాల నమూనాను వేలాది మంది శ్రీకాకుళం విద్యార్థులు ఆవిష్కరించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులు ప్రదర్శించిన ఈ విన్యాసం ఆకట్టుకుంది. అనేక రికార్డు పుస్తకాల్లోనూ నమోదైంది. 11 ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, జూనియర్ కళాశాలలకు చెందిన 8,323 మంది విద్యార్థులు రెడీ టు ఓట్ (READY TO VOTE) ఆంగ్ల అక్షరాల నమూనాను ఆవిష్కరించారు. శ్రీకాకుళం కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జాయింట్ కలెక్టర్ కెవిఎన్ చక్రధరబాబు వినూత్న ఆలోచనతో చేపట్టిన కార్యక్రమంలో ఓటరు ప్రతిజ్ఞ, మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాలాపన కూడా చేశారు. రెడీ టు ఓట్, ప్రతిజ్ఞ, ఎన్నికల చిహ్నం రూపంలో 150 మంది వికలాంగులు ట్రై సైకిళ్లపై కూర్చోవడం ఒక రికార్డు కాగా, 8,323 మంది విద్యార్థులు ఒకేసారి మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాలాపన చేయడం రికార్డుగా నమోదైంది. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ ఇండియా కో-ఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణశ్రీ, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ బి.నరేంద్రగౌడ్ పరిశీలకులుగా హాజరై రికార్డును ధ్రువీకరించారు. ఈ రెండు సంస్థలతోపాటు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుకూ ప్రతిపాదన పంపించడంతో, రికార్డు నమోదుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలియజేసింది. కాగా, 2017 జనవరి 25న జాతీయ సమైక్యత, సమగ్రత భావాలతో అశోకచక్ర నమూనాను 5,571 మంది విద్యార్థులతో 4.56 నిమిషాల్లో ఆవిష్కరించడంతో సిక్కోలు చరిత్ర సృష్టించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించారు.

సచివాలయంలో ప్రతిజ్ఞ

ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో 9వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి నాగులపల్లి శ్రీకాంత్ నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులందరితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు.

ప్రతి ఒక్కరూ ఓటర్లుగా చేరండి : గవర్నర్ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఓటు హక్కు కలిగి ఉండటం పౌరుల ప్రాథమిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో అందరిచేత ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే నిర్ణేతలని అన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడం కనీస బాధ్యత అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా అన్నారు. ఎన్నికల ప్రధాన అధికారి గోపాల కృష్ణ ద్వివేది మాట్లాడుతూ ఓటు నమోదు కోసం 1950 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కళాశాలలో ఓటుపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆన్‌లైన్‌లో ఎప్పుడైనా ఓటు నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. ఓటర్ల నమోదులో ప్రతిభ చూపిన కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లు లక్ష్మీకాంతం, కోన శశిధర్, కార్తికేయలతో పాటు పలువురు ప్రభుత్వ అధికారులను బహుమతి పత్రాలు, నగదుతో గవర్నర్ సన్మానించారు, ఓటర్ల నమోదు సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68